

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



శనివారం | 13-9-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 149 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం, తిథి: షష్ఠి ఉ.7.23, సప్తమి తె.5.04, నక్షత్రం: కృత్తిక ఉ.10.11 తదుపరి రోహిణి, వర్జ్యం:రా.1.11-2.41, దుర్ముహూర్తం: ఉ.6.06-7.43, అమృతఘడియలు: ఉ.7.57-9.26, తె.5.41 మొదలు, రాహుకాలం: ఉ. 9.00-ఉ.10.30, సూర్యోదయం: 6.06, సూర్యాస్తమయం: 6.15 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



KANCHI, DHARMAVARAM, POCHAMPALLY, UPPADA BANARAS AND MORE
AKSHYA PATTU SAREE
MRP ₹1699*
GET SECOND SAREE @ 19* ONLY
PARINAYA PATTU SAREE
MRP ₹2699*
GET SECOND SAREE @ 29* ONLY
HANDLOOM SAREES
BUY 2 ₹@499* KERALA COTTON SAREE
BUY 2 ₹@666* HANDLOOM COTTON SAREE
BUY 2 ₹@799* SOMANUR HANDLOOM SAREE
BUY 2 ₹@899* ARUPUKOTTAI HANDLOOM SAREE
BUY 2 ₹@999* SOFT SILK SAREE
BUY 2 ₹@999* VENKATAGIRI HANDLOOM
BUY 2 ₹@1199* ARUPUKOTTAI HANDLOOM
BUY 2 ₹@1699* KANCHI COTTON
BUY 2 ₹@2099* KANCHI COTTON SAREE
BUY 2 ₹@2999* UPPADA HANDLOOM
PATTU SAREES
YAMINI PATTU BUY 2 ₹1199*
MALABAR PATTU BUY 2 ₹1499*
SOWBHAGYA PATTU BUY 2 ₹1599*
KANJEEVARAM PATTU BUY 2 ₹1799*
MAHALAXMI PATTU BUY 2 ₹1999*
SRAVANA PATTU BUY 2 ₹2199*
MAHADEVA PATTU BUY 2 ₹2999*
KAUSHALYA PATTU BUY 2 ₹3399*
VARAHI PATTU BUY 2 ₹3499*
CHUDIDAR DRESS MATERIALS
DRESS MATERIAL COMBO PACK BUY 6 ₹@999*
BUY 2 ₹@899* PRINTED DRESS MATERIAL
BUY 2 ₹@999* COTTON WORK DRESS MATERIAL
BUY 2 ₹@999* CHUDIDAR READY MADE
BUY 2 ₹@1099* FANCY DRESS MATERIAL
BUY 2 ₹@1299* READYMADE CHUDIDAR
BUY 2 ₹@1499* STRAIGHT CUT CHUDIDAR
BUY 2 ₹@1799* FANCY CHUDIDAR
BUY 2 ₹@1999* PARTY WEAR CHUDIDAR
GAGRAS
BUY 2 ₹@999* DIGITAL PRINT GAGRA
BUY 2 ₹@1499* PARTYWEAR GAGRA
BUY 2 ₹@1699* FANCY GAGRA
BUY 2 ₹@1999* BRIDAL GAGRA
MENS WEAR
BUY 2 ₹@1199* FORMAL TROUSER
BUY 2 ₹@1299* COTTON TROUSER
BUY 2 ₹@1299* MENS DENIMS
BUY 2 ₹@1399* BASIC CARGO
BUY 2 ₹@1499* FORMAL SHIRTS
BUY 2 ₹@1499* FASHION DENIMS
ARROW USA-1851
GET ₹3000* OFF On purchase of 16999*
GET ₹2000* OFF On purchase of 12999*
KILLER this is us
GET ₹2000* OFF On purchase of 10995*
GET ₹1000* OFF On purchase of 6995*
spykar
GET ₹3000* OFF On purchase of 16999*
GET ₹2000* OFF On purchase of 12999*
U.S. POLO ASSN. SINCE 1890
GET A BACKPACK WORTH ₹6999 FOR ₹699 ON PURCHASE OF ₹10999
GET A TROLLEY BAG WORTH ₹7999 FOR ₹799 ON PURCHASE OF ₹16999
INDIAN TERRAIN
SHOP FOR ₹6,999 & ABOVE GET A DUFFLE BAG @ ₹399*
SHOP FOR ₹3,999 & ABOVE GET A MESSENGER BAG @ ₹199*
OXEMBERG
COOL COLORS CASUALS
BUY 2 GET 1 OFF
BUY 1 20% OFF
*Conditions Apply
KIDS WEAR
GIRLS COTTON FROCKS BUY 2 ₹@599*
BOYS TRENDY SHIRTS BUY 2 ₹@499*
BOYS FASHION DENIMS BUY 2 ₹@999*
BUY 2 ₹@499* BOYS T-SHIRTS
BUY 3 ₹@499* GIRLS LOWERS
BUY 2 ₹@699* GIRLS COTTON FROCKS
BUY 2 ₹@899* BOYS JEANS
షాపింగ్‌కి కుటుంబమంతా మెచ్చే ఏకైక షాపింగ్ మాల్ CMR
30% OFF ON SELECTED ITEMS ONLY
BUY 1 GET 1 FREE ON SELECTED ITEMS ONLY
UPTO 51% OFF
అన్నిరకాల వస్త్రాలపై సరికొత్త స్టాక్‌తో...
CMR SHOPPING MALL
The joy of life
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | ఒడిశా
ఎం.జి.రోడ్, విజయవాడ 91333 87124
బస్టాండ్ ఎదురుగా, మచిలీపట్నం 9533315353
నెహ్రూ చౌక్ సెంటర్, గుడివాడ 9177006936

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శనివారం | 13-9-2025

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

15వ ఉప రాష్ట్రపతిగా రాధాకృష్ణన్ ప్రమాణం

చేయించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 4

మోదీ, ఖర్గే, కేంద్ర మంత్రులతో పాటు మాజీ ఉప రాష్ట్రపతులు వెంకయ్య, అన్సారీ, ధన్‌ఖడ్ హాజరు

సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్ కూడా..

హాజరు కాని రాహుల్ గాంధీ, ఇతర విపక్షాల నేతలు


రాధాకృష్ణన్‌తో ప్రమాణం చేయిస్తున్న రాష్ట్రపతి ముర్ము

జనులారా జాగ్రత్త!

అదే బూటకం! మళ్లీ అదే మాయ నాటకం! ఆంధ్రప్రదేశ్ రాజధానిపై కసి! రాష్ట్ర అభివృద్ధిపై కక్ష! ఇదే... జగన్ పార్టీ విధానం! అమరావతిపై వైసీపీ మరో డ్రామాకు తెరలేపింది! 2019 ఎన్నికల ముందు 'అమరావతే రాజధాని' అని ప్రకటించి... అధికారంలోకి రాగానే 'మూడు ముక్కలాట' మొదలుపెట్టిన సంగతి తెలిసిందే. ఇప్పుడు... వైసీపీ కీలక నేత సజ్జల రామకృష్ణా రెడ్డి కొత్త పల్లవి అందుకున్నారు. శుక్రవారం విజయవాడలో ఒక ప్రైవేటు సంస్థ నిర్వహించిన కాంక్లేవ్‌లో ఆయన పాల్గొన్నారు. జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అయితే అమరావతి పరిస్థితి ఏమిటనే ప్రశ్నకు... 'ఇక్కడే ఉంటారు. ఇక్కడి నుంచే పాలిస్తారు' అని సూటిగా చెప్పారు. తాము అధికారంలో ఉండగా... 'విశాఖ పాలనా రాజధాని' అని ఊదరగొట్టి, ఉత్తరాంధ్ర సెంటిమెంటు రాజేయాలని ప్రయత్నించిన నోటితోనే ఇప్పుడు... 'విశాఖ వెళ్లం. ఇక్కడే ఉంటాం' అని సజ్జల చెప్పడం గమనార్హం. అంతే కాదు... 'అమరావతిలో ఒక్క ఇటుక కూడా పడలేదు, అది ఎడారి, శ్మశానం' అని 2019 ఎన్నికల ముందు వైసీపీ నేతలు అక్కసు ప్రదర్శించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు... సజ్జల రామకృష్ణా రెడ్డి "అమరావతిలో రాజధాని ఉంది కదా! సచివాలయం కూడా ఉంది" అని చెప్పారు.





మరో జగన్నాటకం!



'అమరావతి'పై మళ్లీ బూటకం

ఈసారి సజ్జల మాయ మాటలు

- జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే విశాఖ వెళ్లరు
- 'ఇక్కడి నుంచే' పాలన సాగిస్తారు
- రైతుల ప్లాట్లు అభివృద్ధి చేసి విలువ పెంచుతాం
- అమరావతిలో ఉన్న కట్టడాలు చాలు
- సచివాలయం, భవనాలు ఉన్నాయి కదా
- కొత్త నిర్మాణాలు అవసరం లేదు
- ఇవీ సజ్జల రామకృష్ణా రెడ్డి సుద్దులు

2019కి ముందునాటి డ్రామా మళ్లీ మొదలు

- నాడు అధికారంలోకి రాగానే '3 ముక్కలాట'
- రాజధాని రైతులపై పగబట్టి వేధింపులు
- అమరావతి ఎడారి, శ్మశానం అంటూ ఎద్దేవా
- ఇప్పుడు అవన్నీ మరిచి 'రివర్స్ ప్రేమలు'

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల ముందు ఒక మాట! అధికారంలోకి వచ్చాక మరో పాట! 'అమరావతి'పై వైసీపీ ఇప్పటికే ఒకసారి జనాన్ని మాయ చేసింది. ఇప్పుడు మరోసారి అదే చేస్తోంది. ఈసారి వైసీపీ కీలక నేత సజ్జల రామకృష్ణా రెడ్డి తెరపైకి వచ్చారు. శుక్రవారం ఒక ప్రైవేటు సంస్థ నిర్వహించిన చర్చలో పాల్గొన్నారు. 'ఈ దఫా రాజధాని నిర్మాణం పూర్తవుతుందని కూటమి ప్రభుత్వం చెబుతోంది. ఒకవేళ మళ్లీ మీరొస్తే మార్చరు కదా!' అన్న ప్రశ్నకు..


మిగతా 13వ పేజీలో...

కొత్తవి వద్దంటే...

అమరావతిని కొత్త నగరంగా... దేశానికే తలమానికంగా నిర్మించాలన్నది చంద్రబాబు సంకల్పం. దీనికి అనుగుణంగానే ప్రణాళికలను సిద్ధం చేశారు. 2019లో మళ్లీ టీడీపీ ప్రభుత్వం వచ్చినా... లేక, జగన్ సర్కారు ఆ పనులను కొనసాగించినా ఈపాటికే 'అమరావతి' సాక్షాత్కరించేది. కానీ... జగన్ ఐదేళ్లు అమరావతిని పాడుపెట్టి, పూర్తిగా సర్వనాశనం చేయాలని ప్రయత్నించారు. వేసిన పునాదులు గట్టివి కాబట్టి, చేసిన పనులు నాణ్యమైనవి కాబట్టి ఆ భవనాలు అలాగే దృఢంగా నిలబడ్డాయి. ఇప్పుడు... సజ్జల మైకు పట్టుకుని, 'ఆ భవనాలు చాలు. కొత్తవి కట్టక్కర్లేదు' అని సుద్దులు చెబుతున్నారు. రాజధాని అంటే ఒక్క సచివాలయమే కాదు. సకల వర్గాల జీవన ప్రమాణాలు, అభివృద్ధిని ప్రతిబింబించే నిర్మాణాలు ఉంటాయి. అవేవీ వద్దనడం వైసీపీ వైఖరికి అద్దం పడుతోంది.

మూడేళ్లలో రాజధాని తొలి దశ!

ప్రతి పనీ పూర్తిచేస్తాం.. ప్రధానితో ప్రారంభింపజేస్తాం: చంద్రబాబు



"అమరావతి అభివృద్ధి నిరంతరాయంగా జరిగే ప్రక్రియ. ఆ అభివృద్ధిని కొంతవరకే పరిమితం చేస్తే అమరావతి చిన్న మున్సిపాలిటీగా మిగిలిపోతుంది. హైదరాబాద్ తరహాలో ఇది కూడా మహానగరంగా రూపుదిద్దుకోవాలంటే గుంటూరు, విజయవాడ, తెనాలిని కలుపుకొంటూ వెళ్లాల్సిన అవసరం ఉంది.

బనకచర్ల ప్రాజెక్టుకు డబ్బులు ఎక్కడి నుంచి వస్తాయని ప్రశ్నిస్తున్నారు. పెద్ద పెద్ద సంస్థలన్నీ సొంత డబ్బుతో కంపెనీలు పెడుతున్నాయా..? బ్యాంకుల నుంచి తీసుకుని కంపెనీలు పెట్టి సంపాదించి, తర్వాత వాటిని కట్టేస్తున్నారు. బనకచర్ల విషయంలోనూ అలాగే చేస్తాం."

- సీఎం చంద్రబాబు

- అమరావతి అభివృద్ధిని పరిమితం చేస్తే చిన్న మున్సిపాలిటీగా మిగిలిపోతుంది
- మహానగరంలా మలచాలంటే గుంటూరు, విజయవాడ, తెనాలిని కలుపుకొని వెళ్లాలి
- అమరావతిలో ఒక్క రైతుకూ అన్యాయం జరగనివ్వం.. వారితో మాట్లాడే విస్తరణకు భూములు తీసుకుంటాం
- విమర్శలకు భయపడితే అభివృద్ధి జరగదు
- జనవరికల్లా అమరావతిలో క్వాంటమ్ మిషన్
- 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి
- భావితరాల కోసమే విజన్-2047
- 2028-29నాటికి ఏపీ తలసరి ఆదాయం రూ.5.42 లక్షలుగా చేయాలని లక్ష్యం
- 2033-34కి రూ.10.55 లక్షలు చేయాలి
- నిర్దిష్ట ప్రణాళికలతో ముందుకెళ్తే సాధిస్తాం
- మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు ఇవ్వడం లేదు
- బనకచర్లకు వృథా జలాలే వాడుకుంటాం
- మీడియా సంస్థ కాంక్లేవ్‌లో సీఎం స్పష్టీకరణ

అమరావతి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): 'అమరావతిలో ప్రారంభించిన ప్రతి పనినీ మూడేళ్లలో పూర్తి చేస్తాం. ప్రధాని మోదీతో వాటిని ప్రారంభింపజేస్తాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. 'రానున్న దశాబ్ద కాలంలో ఆంధ్రప్రదేశ్ ఎలా ఉండబోతోంది' అనే అంశంపై ఓ మీడియా సంస్థ శుక్రవారం మంగళగిరిలో నిర్వహించిన కాంక్లేవ్‌లో ఆయన పాల్గొన్నారు. ప్రస్తుతం అమరావతిలో రూ.50వేల కోట్లపైచిలుకు విలువైన మౌలిక వసతుల కల్పన పనులు జరుగుతున్నాయని, వాటన్నింటినీ మూడేళ్లలో పూర్తి చేసి తీరతామని తెలిపారు. అమరావతి అభివృద్ధి అనేది హైదరాబాద్ తరహాలో నిరంతరం సాగుతూనే ఉంటుందని తెలిపారు. రాజధానిలో క్వాంటమ్ మిషన్ వచ్చే జనవరి నాటికి వస్తుందని తెలిపారు. పోలవరం ఇప్పటికే పూర్తికావలసిన ప్రాజెక్టని, 2019లో టీడీపీ మళ్లీ అధికారంలోకి

మిగతా 13వ పేజీలో...

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

టక్కరి ట్రంప్!

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్‌ట్రంప్‌కు తెలియచేశాకే ఖతార్‌మీద దాడి చేశామని ఇజ్రాయెల్ అంటోంది. ట్రంప్ దీనిని కాదనడం లేదు. అవును, ఇజ్రాయెల్ మాకు ముందే చెప్పింది, ఆ సమాచారం అందగానే, మీ మీద దాడిజరగబోతోందని ఖతార్‌కు వెంటనే తెలియచేశామని ఆయన అన్నాడు. ఈ దాడిలో తన పాత్రలేదనీ, అది తన నిర్ణయం కాదన్న ట్రంప్ వ్యాఖ్యలు నిజమే అనుకుందాం. దాడిచేయబోతున్నానని చెప్పిన ఇజ్రాయెల్‌ను ఆయన ఎందుకు నిలవరించలేదు, ఎందుకు హెచ్చరించలేదన్న ప్రశ్నలను కూడా పక్కనబెడదాం. ఇజ్రాయెల్ ఈ ఘాతుకానికి ఒడిగడుతున్న సమాచారం ఖతార్‌కు చేరివుంటే అది దాడిని ఆపగలదా లేదా అన్నది అటుంచితే, ఆత్మరక్షణ ప్రయత్నాలేవో చేసుకొనేది. మరి, అలా ఎందుకు జరగలేదు? అమెరికా అధ్యక్షుడు ఈ అరబ్ మిత్రదేశానికి అన్యాయం చేయదల్చుకోలేదు. మరోపక్క ఇజ్రాయెల్‌కూ ద్రోహం చేయడానికీ మనసొప్పలేదు. ఆయన తన మధ్య ఆసియా ప్రత్యేక రాయబారికి సమాచారం చేరవేత బాధ్యతని అప్పగించాడు. సున్నితమైన సమాచారం కదా, ఆయన దానిని అతిజాగ్రత్తగా, తాపీగా ఖతార్ చెవిలో వేశాడు. ఇజ్రాయెల్‌కు చెందిన పదిహేను యుద్ధవిమానాలు దాడులు ఆరంభించి అప్పటికే పది నిముషాలైంది. ఖతార్ రాజధాని నడిబొడ్డున జరిగిన ఈ దాడిలో ఆరుగురు హమాస్ అధికార ప్రతినిధులు మృతిచెందారు. దాడిలో తన పాత్ర లేదంటున్న ట్రంప్ దానిని నిలువరించలేదు కానీ, మహా గట్టిగా ఖండించారు. దాడి తప్పే కానీ, ఉగ్రవాదులు చావడం మాత్రం సరైనదేనని వైట్‌హౌస్ అంటోంది.

అమెరికా అధ్యక్షుడిని సంతోషపెట్టడానికి, మచ్చిక చేసుకోవడానికి తెగ ఆపసోపాలు పడుతున్న ఈ ఆయిల్ రిచ్ అరబ్ దేశానికి ట్రంప్ భలే జెల్ల కొట్టారంటూ సామాజిక మాధ్యమాలు వ్యాఖ్యానిస్తున్నాయి. పశ్చిమాసియాలో అమెరికా తన అతిపెద్ద వైమానిక స్థావరాన్ని ఖతార్‌లోనే నిర్మించుకుంది. నాలుగునెలల క్రితం ట్రంప్ వచ్చినప్పుడు, ఎర్రతివాచీ స్వాగతాలు, వేల కోట్ల రూపాయల రక్షణ సామగ్రి కొనుగోళ్ళతో ట్రంప్‌ను ఖతార్ సంతోష పెట్టింది. అంతేకాదు, అత్యంతవిలాసవంతమైన, మూడున్నరవేలకోట్ల విలువైన బోయింగ్ విమానాన్ని ఖతార్ రాజు గిఫ్ట్‌గా ఇస్తే, అమెరికా అధ్యక్షుడు దానిని నిస్సిగ్గుగా స్వీకరించాడు. భారీ బహుమతి ఇచ్చిన మిత్ర దేశాన్ని ట్రంప్ ఇప్పుడు ఈ రీతిన ఖంగుతినిపించాడు.

హమాస్ నాయకులను నిర్మూలించడం మంచిపని అంటోంది వైట్‌హౌస్. ఖతార్ మీద దాడిని పరోక్షంగా అనుమతించిన అమెరికా అధ్యక్షుడు ఇకపై అటువంటివి ఒప్పుకొనేది లేదంటున్నారు. శాంతియత్నాలు ఒక కొలిక్కివచ్చినప్పుడల్లా నెతన్యాహూ మోకాలడ్డుతూనే ఉంటారని ఆగ్రహం నటిస్తున్నారు. ఆయన ఖతార్‌కు మాత్రమే ద్రోహం చేయలేదు. శాంతిచర్చలకు వెన్నుపోటు పొడవడంలో తానూ భాగస్వామి అయ్యారు. గడువులోగా దారికిరావాలంటూ హమాస్‌ను ఒకపక్క హెచ్చరించి, మరోపక్క ఆ ప్రయత్నాల్లో ఉన్నవారిని ఇజ్రాయెల్‌తో హత్య చేయించారు. శాంతియత్నాలను భగ్నం చేసి, యుద్ధం నిరవధికంగా సాగించేందుకు ప్రయత్నిస్తున్న నెతన్యాహూతో కలసి కుట్రచేశారు.

తాలిబాన్, హమాస్, ఇరాన్ తదితర ప్రతినిధులతో అమెరికా, ఇజ్రాయెల్ చర్చలు జరపడానికి, ఒప్పందాలు కుదర్చుకోవడానికి ఎంతోకాలంగా ఒక వారధిగా, మధ్యవర్తిగా ఉపకరిస్తున్న ఖతార్‌మీద నేరుగా దాడికి తెగబడి ఇజ్రాయెల్ తీవ్ర తప్పిదం చేసింది. ఆ తప్పులో పాత్రధారి అయి, అరబ్ దేశాల నమ్మకాన్ని ట్రంప్ వమ్ముచేశారు. తమ భద్రతకు ఎటువంటి గ్యారంటీ లేదని వాటికి తెలిసొచ్చేట్టుగా చేశారు. కాల్పుల విరమణ జరిగి, హమాస్ చెరలో ఉన్న బందీలు విడుదలకావాలని ఇజ్రాయెల్ ప్రజలు ఆశిస్తుంటే, దానికి అడ్డుకట్టవేసేపనిలో నెతన్యాహూ ఉన్నారు. రెండేళ్ళుగా హమాస్‌తో యుద్ధాన్ని సాగిస్తున్న నెతన్యాహూ, దానిని విస్తరించి, పరిధులు దాటించి, నేరుగా ఇరాన్ మీదకు లంఘించినప్పుడు కూడా ట్రంప్ వారించలేదు. స్వయంగా దాడులకు తెగబడి మరీ ఇజ్రాయెల్‌కు మద్దతు ఇచ్చారు. హమాస్ మీద ప్రతీకారం పేరిట నెతన్యాహూ పాల్పడుతున్న ప్రతీ అక్రమాన్నీ సమర్థిస్తూ గాజాను నిర్మానుష్యం చేసే ఉమ్మడి లక్ష్యంతో పనిచేస్తున్నారు. కాల్పుల విరమణకు హమాస్ సిద్ధపడినా కూడా యుద్ధం ఆగకుండా జాగ్రత్తపడుతున్నారు. రెండేళ్ళుగా నెతన్యాహూ గాజాలో ఊచకోతలకు పాల్పడుతున్నా, పొరుగుదేశాలను చావగొడుతున్నా నోరువిప్పడానికి కూడా సాహసించని గల్ఫ్ దేశాలు ఇప్పటికైనా కాస్తంత బుద్ధితెచ్చుకొని, ఆత్మగౌరవంతో స్వతంత్రంగా వ్యవహరించడం అవసరం. అవి ఒక్కటిగా లేకపోవడం వల్లనే యుద్ధం ఆగలేదన్నది వాస్తవం.

తగ్గింపులు సరే, క్షమాపణలు ఏవీ?

కేంద్ర ప్రభుత్వానికి తుదకు వివేకోదయమయింది. ఈ సెప్టెంబర్ 3న ప్రభుత్వం విస్తృత శ్రేణి వస్తువులు, సేవలపై పన్ను (గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ –జీఎస్టీ) రేట్లను హేతుబద్ధీకరించి, తగ్గించింది. శుభం. జీఎస్టీ ఇప్పుడు 'గుడ్ అండ్ సింపుల్ ట్యాక్స్' భావన (కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే అనేకానేక పరోక్ష పన్నులను ఒకే ఒక పన్నుగా సమైక్యపరచడం)కు సన్నిహితంగా ఉన్నది, సందేహం లేదు. పలువురు రాజకీయవేత్తలు, ఎంతో మంది వ్యాపారవేత్తలు, వివిధ సంస్థలు, (నాతో సహా) వ్యక్తులు ఎందరో వస్తు సేవల పన్ను అనేది గుడ్ అండ్ సింపుల్ ట్యాక్స్ వలే ఉండాలని ఎనిమిదేళ్లుగా వాదిస్తూ వస్తున్నారు.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

ఆగస్టు 2016లో రాజ్యాంగ (122వ సవరణ) బిల్లుపై పార్లమెంటులో చర్చ జరిగినప్పుడు రాజ్యసభలో నేను ఆ చర్చలో పాల్గొన్నాను. ఆనాటి నా ప్రసంగంలోని కొన్ని భాగాలను ఉటంకించడం అప్రస్తుతం కాదు. నేను ఇలా అన్నాను: "వస్తు సేవల పన్నును అమలుపరచాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని తొలుత అధికారికంగా ప్రకటించింది డాక్టర్ మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వమేనన్న వాస్తవాన్ని ఆర్థికమంత్రి అంగీకరించినందుకు నేను చాలా సంతోషిస్తున్నాను. 28, ఫిబ్రవరి 2005న ఆర్థికమంత్రి బడ్జెట్ ప్రసంగంలో జీఎస్టీని తొలిసారి ప్రకటించారు. వస్తుసేవల పన్నులో నాలుగు ప్రధాన అంశాలు ఉన్నాయి....."

"122వ రాజ్యాంగ సవరణ బిల్లులోని చాలా ముఖ్యమైన విషయాన్ని తరచి చూడదలుచుకున్నాను. మనం పరోక్ష పన్ను గురించి వ్యవహరిస్తున్నామన్న విషయాన్ని దయచేసి మరచిపోవద్దు. పరోక్ష పన్ను అనేది నిర్వచనం రీత్యా ఒక తిరోగామి పన్ను (పన్ను మొదట్లో చెల్లించేది ఒకడు. అంతిమంగా దాని భారాన్ని భరించేది మరొకడు అయినప్పుడు ఆ పన్నును పరోక్ష పన్ను అంటారు). ఏ పరోక్ష పన్ను అయినా ధనికులు, పేదలు ఒకే రీతిలో చెల్లించేదిగా ఉంటుంది... ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు నివేదిక ఇలా పేర్కొంది: 'అధికాదాయమున్న దేశాలలో సగటు జీఎస్టీ రేటు 16.8 శాతం. భారత్ లాంటి మార్కెట్ ఆధారిత ఆర్థిక వ్యవస్థగా ఇప్పుడిప్పుడే ఆవిర్భవిస్తున్న భారత్ లాంటి దేశాలలో సగటు జీఎస్టీ రేటు 14.1 శాతం'. ప్రపంచ వ్యాప్తంగా 190కు పైగా దేశాలలో జీఎస్టీ అనేది ఏదో ఒక రూపంలో ఉన్నది. అది సగటున 14.1 శాతం–16.8 శాతం మధ్య ఉన్నది..."

"పన్నురేట్లను మనం తక్కువగా ఉంచవలసిన అవసరమున్నది. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వాల ప్రస్తుత ఆదాయాలను పరిరక్షించి తీరాలి... 'రెవెన్యూ తటస్థ రేటు' (రెవెన్యూ న్యూట్రల్ రేట్ – జీఎస్టీ వ్యవస్థలో సంస్కరణ తరువాత ప్రభుత్వం సేకరించే మొత్తం పన్ను ఆదాయం మునుపటిలాగే ఉండేందుకు దోహదం చేసే ప్రామాణిక పన్ను రేటు)ను కనుగొనడం ద్వారా ప్రభుత్వాల ప్రస్తుత ఆదాయాలను కాపాడాలి... ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులతో సహా ఆర్థిక నిపుణులతో సంప్రతింపులు, సమాలోచనలతో రెవెన్యూ తటస్థ రేటు 15 నుంచి 15.5 శాతంగా ఉండాలనే నిర్ణయానికి వచ్చారు. దరిమిలా ప్రామాణిక పన్నురేటు 18శాతంగా ఉండాలని సూచించారు. ప్రధాన ఆర్థిక సలహాదారు నివేదిక నుంచి గ్రహించే కాంగ్రెస్ పార్టీ ఆ ప్రామాణిక పన్ను రేటు 18 శాతం ఉండాలని కోరిందని నేను మళ్లీ చెప్తున్నాను..."

"ప్రజల శ్రేయస్సు కోసం వారి తరఫున ఎవరో ఒకరు మాట్లాడాలి కదా. ప్రజల పేరిట నేను అడుగుతున్నాను: మీ ప్రభుత్వ ప్రధాన సలహాదారు సిఫారసు చేసిన రేటునే అమలుపరచండి. ప్రామాణిక పన్ను రేటు 18 శాతం మించకుండా చూడండి... ప్రామాణిక పన్ను రేటు 18 శాతంగా ఉంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయాలు పరిరక్షించబడతాయని ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు తన నివేదికలో సుసంగతంగా వాదించారు. అది ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచుతుంది. పన్ను చెల్లింపు ఎగవేతలను నివారిస్తుంది. దేశ ప్రజలందరికీ అంగీకారయోగ్యంగా ఉంటుంది. వస్తువులు, సేవలపై మీరు 24 నుంచి 26 శాతం పన్ను వసూలు చేయదలుచుకుంటే అసలు జీఎస్టీ బిల్లు తీసుకు రావడమెందుకు?..."

"అంతిమంగా ఒక పన్ను బిల్లులో పన్ను రేటు ఎంత అనేది స్పష్టంగా పేర్కొనాలి. 70 శాతానికి పైగా వస్తువులు, సేవలకు వర్తించే జీఎస్టీ రేటు ఎట్టి పరిస్థితులలోను 18 శాతానికి మించకూడదని మా పార్టీ తరఫున, నా తరఫున గట్టిగా, స్పష్టంగా కోరుతున్నాను. అలాగే తక్కువ జీఎస్టీ రేటు, డీ మెరిట్ రేటు (వినియోగదారుల ఆరోగ్యానికి హానికరమైన, ప్రతికూల సామాజిక పరిణామాలకు కారణమయ్యే పొగాకు ఉత్పత్తులు, చక్కెర పానీయాలు మొదలైన వాటి వాడకాన్ని నిరుత్సాహపరిచేందుకు సదరు సరుకులపై ప్రభుత్వం విధించే ప్రత్యేక పన్ను రేటు)ను ఆ 18 శాతం ప్రామాణిక రేటు ప్రాతిపదికన నిర్ణయించాలి".

నేను ఈ వ్యాసంలో వ్యక్తం చేసిన అభిప్రాయాలనే 2016లో రాజ్యసభ చర్చలో వ్యక్తం చేశాను. వస్తుసేవల పన్ను రేట్లను హేతుబద్ధీకరించాలని, తగ్గించాలనే అభిప్రాయానికి ప్రభుత్వం వచ్చినందుకు నేను అమితంగా సంతోషిస్తున్నాను. అయితే వస్తుసేవల పన్నును అమలు పరచదలుచుకున్నప్పుడు ప్రామాణిక పన్నురేటు 18 శాతంగా మాత్రమే ఉంటే భారీ ఆదాయ నష్టం, ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వాలకు సంభవిస్తుందని మోదీ ప్రభుత్వం వాదించింది. అది నిష్కారణ భయం మాత్రమే. ఆదాయ నష్టం సాకుతో పన్నురేట్లను అధికంగా నిర్ణయించారు. జీఎస్టీ తాజా సంస్కరణలో రెండు శ్లాబ్‌ల రేట్లు 5 శాతం, 18 శాతంగా ఉన్నాయి! పన్ను రాబడిని పెంచుకునేందుకు ప్రభుత్వానికి అనేక మార్గాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు ఆదాయాన్ని కోల్పోతే, ఆ పరిస్థితిని చక్కదిద్దేందుకు సరైన మార్గం రాష్ట్రాలకు నష్టపరిహారం చెల్లించడమే.



వస్తుసేవల పన్ను అమలులోకి వచ్చిన మొదటి సంవత్సరం (జూలై 2017–మార్చి 2018) ప్రభుత్వం 11 లక్షల కోట్ల రూపాయలు వసూలు చేసుకున్నది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీ రాబడి 22 లక్షల కోట్ల రూపాయలుగా ఉన్నది. వినియోగదారులు కష్టపడి ఆర్జించుకున్న ప్రతి పైసాను వస్తుసేవల పన్ను ద్వారా ప్రభుత్వం లాగివేసుకున్నది. మరి జీఎస్టీని గబ్బర్ సింగ్ ట్యాక్స్ అని అపహసించడంలో ఆశ్చర్యమేమున్నది? ఎనిమిది సంవత్సరాల పాటు ఈ దేశ ప్రజలు అత్యధిక పన్నులు ఎందుకు చెల్లించవలసివచ్చింది?

గత ఎనిమిది సంవత్సరాలుగా ప్రభుత్వం వినియోగదారుల నుంచి చివరి పైసాను సైతం రాబట్టుకునేందుకు జీఎస్టీ రేట్లను బహుళ రీతుల్లో నిర్ణయించి అమలుపరిచింది. ఆదాయాన్ని మరింతగా పెంపొందించుకోవడమే ప్రభుత్వ ప్రథమ లక్ష్యంగా ఉన్నది. వస్తుసేవల పన్ను అమలులోకి వచ్చిన మొదటి సంవత్సరం (జూలై 2017–మార్చి 2018) ప్రభుత్వం 11 లక్షల కోట్ల రూపాయలు వసూలుచేసుకున్నది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీ రాబడి 22 లక్షల కోట్ల రూపాయలుగా ఉన్నది. వినియోగదారులు కష్టపడి ఆర్జించుకున్న ప్రతి పైసాను వస్తుసేవల పన్ను ద్వారా ప్రభుత్వం లాగివేసుకున్నది. మరి జీఎస్టీని గబ్బర్ సింగ్ ట్యాక్స్ అని అపహసించడంలో ఆశ్చర్యమేమున్నది? అది సబబైన ఎగతాళి సుమా! వినియోగం తగ్గిపోవడానికి, గృహ రుణాల (ఇళ్ల, వాహనాల కొనుగోలు మొదలైనవాటికి కుటుంబాలు చేసే రుణాలు) భారం పెరిగిపోవడానికి ప్రధాన కారణాలలో ఒకటి జీఎస్టీ రేట్లు అధికంగా ఉండడమే. పన్నులు తగ్గించినప్పుడు వినియోగం పెరుగుతుంది – ఇది అర్థశాస్త్ర ప్రాథమిక పాఠం. టూత్‌పేస్ట్, తలనూనె, పెన్నులు, పెన్సిళ్లు, నోట్ పుస్తకాలు, ట్రాక్టర్లు, స్ప్రింకర్లు మొదలైన వాటిపై 5 శాతం జీఎస్టీ సమంజస నిర్ణయం. గత ఎనిమిది సంవత్సరాలుగా ఆ వినియోగ వస్తువులపై జీఎస్టీ అధికంగా ఎందుకు ఉన్నది? ఎనిమిది సంవత్సరాల పాటు ఈ దేశ ప్రజలు అత్యధిక పన్నులు ఎందుకు చెల్లించవలసివచ్చింది?

వస్తుసేవల పన్ను రేట్ల తగ్గింపు ఆరంభం మాత్రమే. పన్నుల వ్యవస్థ ప్రజాహితంగా ఉండేందుకు ఇంకా ఎన్నో సంస్కరణలు చేపట్టవలసి ఉన్నది. ప్రభుత్వం తప్పక చేయవలసినవి: రాష్ట్రాలు, ఉత్పత్తిదారులు, వినియోగదారులను (తప్పనిసరైతే మరిన్ని మినహాయింపులతో) ఏకైక జీఎస్టీ రేటుకు సంసిద్ధపరచాలి; పన్నుల చట్టాలలోని అర్థంకాని పరిభాషను పరిహరించాలి. సరళమైన, సుబోధకమైన మాటలలో ఆ చట్టాలను పునర్లిఖించాలి, నియమనిబంధనలు సామాన్య వినియోగదారులకు సైతం అర్థమయ్యేలా సూటిగా స్పష్టంగా ఉండి తీరాలి; ట్యాక్స్ రిటర్న్‌ను పదే పదే ఫైల్ చేయవలసిన శ్రమను గణనీయంగా తగ్గించాలి; చట్టానికి అనుగుణంగా వ్యవహరించే ప్రక్రియను సరళీకరించాలి. చిన్న వ్యాపారస్తులు, దుకాణదారులకు చార్టర్డ్ అకౌంటెంట్ సేవలు అవసరం కాకూడదు; జీఎస్టీ చట్టాలను డీ–క్రిమినలైజ్ చేయాలి. అవి వ్యాపార, వర్తకాలకు సంబంధించిన పౌరచట్టాలు అనే వాస్తవాన్ని విస్మరించకూడదు. చట్టాలకు విరుద్ధంగా వ్యవహరించిన వారికి విధించే శిక్షను సహేతుకమైన జరిమానాలతో సరిపెట్టాలి. ఉత్పత్తిదారులు, వ్యాపారులు ఆర్థిక వ్యవస్థకు కీలకమైనవారని, సమాజ శత్రువులు కారనే యథార్థాన్ని పన్ను వసూలు అధికారుల మనసుల్లో నెలకొల్పాలి.

సరే, వస్తుసేవల పన్ను హేతుబద్ధీకరణ శ్రేష్ఠమైన నిర్ణయమే, సందేహం లేదు. అది, ప్రజలకు తాము చేసిన సమున్నత మేలుగా భారతీయ జనతా పార్టీ చెప్పుకోవడం సబబు కాదు. అంతే కాదు గత ఎనిమిది సంవత్సరాలుగా అధిక జీఎస్టీ రేట్లతో వినియోగదారులను సతమతం చేసినందుకు ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలి. జీఎస్టీ వ్యవస్థలో మిగతా సంస్కరణలను అమలుపరిచేందుకు ప్రభుత్వం మరో ఎనిమిది సంవత్సరాల వ్యవధిని తీసుకోదని ఆశిస్తున్నాను.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

దేశంలో వరదలు, భూకంపాలు, ప్రకృతి వైపరీత్యాలు, యుద్ధాలు సంభవించినప్పుడు ప్రతిఫలాపేక్ష లేకుండా సేవలు అందించేది ఆర్ఎస్ఎస్ కార్యకర్తలే. వారిని దూషించేవారు మాత్రం దేశ ప్రజలకు అవసరం వచ్చినప్పుడు పారిపోయి దాక్కుంటారు.

హిందూత్వ సంస్థలపై ఎందుకంత ఆక్రోశం?

'క్రైస్తవులకూ తప్పని వేధింపులు' అంటూ ఆగస్టు 15న రాజ్‌దీప్ సర్దేశాయి రాసిన వ్యాసంలో హిందుత్వ సంస్థలపై వ్యతిరేక పైత్యం పరాకాష్ఠకు చేరింది. "నరేంద్ర మోదీ ప్రధాని అయినప్పటి నుంచి భారతీయ ముస్లింల పట్ల వ్యవహరిస్తున్న తీరుపై 'పలువురు' ఆక్షేపిస్తున్నారు" అని ఆయన చెప్పడంలో పెద్ద తిరకాసే ఉంది. ఈ 'పలువురు' ఎవరు? ఇస్లామిక్ ఉగ్రవాదులను నెత్తిన పెట్టుకొని, లౌకికవాద ముసుగును తగిలించుకొని, హిందువుల సంప్రదాయాలను, హిందుత్వ సంస్థలను అకారణంగా, అసందర్భంగా, అనవసరంగా దెప్పిపొడిచే 'హిందూ వ్యతిరేక హిందువులు' అని చెప్పుకోవచ్చు.

వ్యాసంలో 'సంఘ పరివార్ తీవ్రవాదులు' అనే పద ప్రయోగం చేయడం వెనుక రాజ్‌దీప్ సర్దేశాయికి జాతి వ్యతిరేక సంస్థల ప్రోత్సాహం ఉందన్న విషయం అర్థమవుతున్నది. వాస్తవంగా హిందూత్వ సంస్థల కార్యకర్తలు హింసావాదులైతే ఈ దేశంలో ప్రజాస్వామ్యం నడిచేది కాదు. దేశంలో వరదలు, భూకంపాలు, ప్రకృతి వైపరీత్యాలు, యుద్ధాలు సంభవించినప్పుడు ప్రతిఫలాపేక్ష లేకుండా సేవలు అందించేది ఆర్ఎస్ఎస్ కార్యకర్తలే. వారిని దూషించేవారు మాత్రం దేశ ప్రజలకు అవసరం వచ్చినప్పుడు పారిపోయి, దాక్కుంటారు.



బలవంతపు మత మార్పిడి, అమ్మాయిల అక్రమ రవాణా అనే ఆరోపణలతో కేరళకు చెందిన ఇద్దరు 'నన్స్'ను ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం అరెస్ట్ చేసిన విషయంలో ఈ దేశంలో క్రైస్తవ రాజకీయాల లాబీ బలంగానే పనిచేసింది. వారికి బెయిల్ ఇప్పించడంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కేరళ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ ప్రధాన పాత్ర పోషించారు. బీజేపీ ఈ సందర్భంలో పూర్తి సంయమనంతో వ్యవహరించిందని అర్థం చేసుకోవాలి తప్ప, పెడర్థాలు ఎందుకు? ఈ దేశంలో క్రైస్తవ మతమార్పిడి వెనుక క్రైస్తవ దేశాల కుట్రలు, లౌకికవాద ముసుగు వేసుకున్న హిందూ రాజకీయ నాయకుల దౌష్ట్యపు ఆలోచనలు లేవని ఎవరైనా చెప్పగలరా? క్రైస్తవంలోని ఆధ్యాత్మిక ఆలోచనల ప్రేరణతోనే హిందువులు క్రైస్తవంలోకి మారుతున్నారని చెబితే, అది అతిశయోక్తి అవుతుంది. ఇదే వాస్తవమైతే ఇస్లాం మతస్థులు కూడా కన్వర్ట్ కావాలి కదా.

భారత రాజ్యాంగం మత స్వేచ్ఛ కల్పించింది కానీ, ఇతర మతాలపై దుష్ప్రచారం చేసి, ప్రలోభాలతో, మాయ మాటలతో వేరొక మతం వారిని తమ మతంలోకి మార్చుకొని సంఖ్య పెంచుకోవాలనే వెసులుబాటుకు మన రాజ్యాంగంలో చోటు లేదు. అంబేడ్కర్ మరణానికి ముందు అంటే 1956లో బౌద్ధ మతంలోకి మారేటప్పుడు దేశంలో ప్రభావవంతంగా ఉన్న క్రైస్తవాన్నో, ఇస్లామ్‌నో ఎందుకు ఎంచుకోలేదు? ఈ విషయం గురించి మన దేశంలోని స్వయం ప్రకటిత మేధావులు అనేక కట్టుకథలు చెబుతారు. వాస్తవం ఏమిటంటే– ఈ రెండు మతాల నిజస్వరూపం ఏమిటో అంబేడ్కర్‌కు బాగా తెలుసు.

ముస్లిం మత పెద్దలు నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనకుండా, క్రైస్తవ మత పెద్దలు నిర్వహించే క్రిస్మస్ వేడుకల్లో మోదీ పాల్గొన్నారని చెప్పడం వెనుక వ్యాసకర్త దురుద్దేశం అర్థమైంది. బీజేపీ మాతృ సంస్థ ఆర్ఎస్ఎస్ అధ్యక్షులు మోహన్ జీ భగవత్ ఇటీవల ఢిల్లీలో 60మంది ఇమాముల సమావేశంలో పాల్గొన్నారు. రామ మందిరం ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆల్ ఇండియా ఇమామ్ ప్రెసిడెంట్ మహమ్మద్ ఇలియాసీని హిందుత్వ సంస్థలు స్నేహపూర్వకంగా ఆహ్వానించాయి. మోదీ ప్రధానిగా మొదటి టర్మ్‌లో పాకిస్థాన్‌ను సందర్శించి, అప్పటి ప్రధాని నవాజ్ షరీఫ్ ఇంటికి వెళ్ళి ఆయన తల్లికి పాద నమస్కారాలు చేసి వచ్చారు. సంస్కారవంతులకు మాత్రమే ఈ వాస్తవం బోధపడుతుంది.

దేశ జనాభాలో క్రైస్తవులు కేవలం 2.3శాతం మంది మాత్రమే అని చెప్పడం పచ్చి అబద్ధం. ఈ దేశంలో క్రైస్తవులు చర్చిలో ఒక పేరు ప్రభుత్వ లెక్కల్లో మరొక పేరుతో కొనసాగుతారు. ఈ దొంగ లెక్కలను పరిగణనలోకి తీసుకుని క్రైస్తవుల జనాభా 1971లో 2.6శాతం ఉంటే నేడు 2.3శాతం ఉందని రాజ్‌దీప్ సర్దేశాయి బుకాయిస్తున్నారు. ఈ దేశంలో ముస్లింలు, క్రైస్తవులు మతపరంగా సంఘటితంగా ఉంటూ, రాజకీయ పార్టీల పైన తమ ప్రభావాలను చూపుతూ, తమ మత వ్యూహాలను చక్కగా అమలు చేస్తున్నారు. కులాల, వర్గాల, ప్రాంతాల, భాషలవారీగా విడిపోయిన హిందువులు అని పిలవబడే మెజారిటీ సమూహమే నేడు శక్తి హీనంగా ఉంది. తమ మతాచారాలను, సంప్రదాయాలను, దేవీ దేవతలను దూషించే వాళ్లను నెత్తిన పెట్టుకోవడం వీరి సహజ నైజంగా మారిపోవడం దురదృష్టకరం!

• ఉల్లి బాలరంగయ్య

బీమాతో దేశాభివృద్ధికి ధీమా

కోట్లాది మంది పట్టాదారుల బీమా ప్రీమియం సొమ్ముపై కేంద్రం 2017లో 18 శాతం జీఎస్టీ విధించింది. ఇది దేశీయ పొదుపు వ్యవస్థను దెబ్బతీయడమేనని, ఈ భారీ పన్ను వసూలును రద్దు చేయాలని కోరుతూ బీమా ఉద్యోగులు గతంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. దీనిపై 'ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్' పెద్ద ఎత్తున ఉద్యమం సాగించింది. దేశవ్యాప్తంగా పలు సదస్సులు, సెమినార్లు, ప్రెస్‌మీట్స్ నిర్వహించింది. దాదాపు 45 లక్షలమంది పాలసీదారుల సంతకాలను సేకరించి వాటిని నాటి కేంద్ర ఆర్థికమంత్రికి పంపింది. అనంతరం కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, ప్రహ్లాద్ జోషీ వంటి వారిని కలిసి బీమా ప్రీమియం సొమ్ముపై జీఎస్టీని రద్దు చేయాలని కోరింది. ఈ విషయంపై జోక్యం చేసుకోవాలని నీతి ఆయోగ్‌కు, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి లేఖలు రాసింది. యూనియన్ పోరాటం ఇన్నాళ్లకు ఫలించింది. జీఎస్టీ స్లాబ్ 18 శాతం నుంచి ప్రస్తుతం బీమా ప్రీమియంను కేంద్రం పూర్తిగా మినహాయించింది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం మొత్తం బీమా రంగానికి ఎంతగానో ఉపకరిస్తుంది. ప్రభుత్వరంగంలోని బీమా సంస్థలను శక్తిమంతం చేసేలా ప్రభుత్వ విధానాలు ఉండాలి. ఈ సంస్థల ద్వారా ప్రజల నుంచి వసూలయ్యే కోట్లాది రూపాయల ప్రీమియం సొమ్ము దేశీయ పెట్టుబడిగా మారుతోంది. ఫలితంగా దేశ ప్రగతికి మార్గం సుగమం అవుతున్నది.

– వి.వి.కే. సురేశ్
ఎల్ఐసీ ఎంప్లాయిస్ యూనియన్, మచిలీపట్నం

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

కమ్యూనిస్టుల ఐక్యత అసంభవమా?

వంద సంవత్సరాల ఉద్యమ చరిత్ర గల ఇండియన్ కమ్యూనిస్టులు గత ఆరు దశాబ్దాలలో అనేక విధాలుగా చీలిపోయారు. సమాంతరంగా అదే వంద సంవత్సరాలలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) స్థిరపడి, ఈ రోజు భారతీయ జనతాపార్టీని, పరోక్షంగా ఈ దేశాన్ని శాసిస్తున్నది.

రాజ్యాంగ రీత్యా ఎన్నికల ద్వారానే గతంలో కాంగ్రెస్‌ను దీటుగా ఎదుర్కొన్న కమ్యూనిస్టులు, ఈ రోజు ఆ ఎన్నికల ద్వారానే తమ అస్తిత్వాన్ని కోల్పోయే దశలో ఉన్నారు. ఈ దుస్థితికి మూల కారణాలు ఏమిటి? మార్క్సిస్టు మూల సిద్ధాంతాలను, ఈ దేశ ప్రజల స్వభావానికి, అవసరాలకు అనుగుణంగా అన్వయించి ఆచరించలేకపోవడమా? ప్రజా పోరాటాలలో అపారమైన త్యాగాలు చేసిన కమ్యూనిస్టులే దిక్కుతోచని స్థితిలో ఉన్నారా? రైతాంగ–కార్మిక పోరాటాల నాయకత్వాన్ని కోల్పోయారా?

1964 తర్వాత క్రమంగా 1970 నాటికి కమ్యూనిస్టుల్లో చీలికల్లో చీలికలు ప్రారంభమైన యథార్థాన్ని చరిత్ర నిరూపిస్తున్నది. రాజకీయ విశ్లేషకుడు సీనియర్ జర్నలిస్టు మోహన్ రామ్ (ది మెయిల్–మద్రాసు) ఆ రోజుల్లోనే రాసిన 'Split within split' పుస్తకం చర్చనీయాంశమైంది. కమ్యూనిస్టుల భవిష్యత్తు గురించి ఆనాడే ఆయన హెచ్చరించాడు. తర్వాత 'Maoism in India' అనే గ్రంథం రచించాడు.

ఇక 1974 నాటికే అంతర్జాతీయంగా రష్యన్–చైనీస్ కమ్యూనిస్టు శిబిరాలుగా విడిపోగా, కోమింటర్న్ (కమ్యూనిస్టు ఇంటర్నేషనల్) బలహీనపడింది. ఆనాటి సోవియట్ రష్యాను 'సోషల్ సామ్రాజ్యవాదం'గా కొందరు పరిగణించారు. ఆ రోజుల్లోనే తరిమెల నాగిరెడ్డి సంపాదకత్వంలో, అనంతపురం నుంచి 'జనశక్తి' పక్షపత్రిక వెలువడుతుండేది. నేను రాసిన 'జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కమ్యూనిస్టుల ఐక్యత సాధ్యమా?' వ్యాసాన్ని జూన్ 5, 1974న 'జనశక్తి'లో ప్రచురించారు.

అంతకుపూర్వం వామపక్ష రచయిత ఫెలిక్స్ గ్రీన్ ('The enemy' గ్రంథంతో ప్రసిద్ధి) అమెరికన్ వారపత్రిక 'గార్డియన్' 25వ వార్షికోత్సవంలో ప్రసంగిస్తూ సోషల్ సామ్రాజ్యవాదాన్ని విమర్శించారు. అంతర్జాతీయంగా కమ్యూనిస్టుల ఐక్యత అవసరమని కోరిన ఫెలిక్స్ గ్రీన్ ప్రసంగాన్ని నేను నా వ్యాసంలో సవివరంగా ఉటంకించాను. విప్లవకారుల మధ్య చీలిక కోసం కాకుండా ఐక్యత కోసం నిజాయితీగా కృషి జరిపినప్పుడే శ్రామికవర్గాన్ని చోదకశక్తిగా నడిపించే విప్లవ పార్టీ నిర్మాణమవుతుందని నేను రాసిన ఆ వ్యాసంలోనే, ఆనాటి ఫెలిక్స్‌గ్రీన్ వాక్యాలు కొన్ని– 'విప్లవం ఒక సంఘటన కాదు. అది ఒక క్రమ పరిణామంలో వచ్చే దశ' అనే ముగింపునకు ముందు ఆయన ఒక చోట వేసిన ప్రశ్నలు "విప్లవకరమైన మార్పులు కోరుతున్న మనం చేదు నిజాలను గమనించవలసి ఉంది. సమాజాన్ని–వ్యవస్థను సమూలంగా మార్చాలనుకున్నప్పుడు ఐక్యత, సంస్థ (పార్టీ) అవసరం. ఐక్యత, నిర్మాణం లేనప్పుడు మార్పు ఎలా సాధ్యం? మనం పరస్పరం సహకరించుకొని ఒకే సంస్థను ఎందుకు నిర్మించుకోలేము? మనలోనే ఎందుకు ఇన్ని వైరుధ్యాలు?"

మితవాద, అతివాద కమ్యూనిస్టులలో చీలికల పర్వం కొనసాగుతున్న కాలంలోనే, కమ్యూనిస్టు విప్లవ నాయకులు తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు– ఒక మౌలిక పంథా ఆధారంగా కమ్యూనిస్టు విప్లవకారుల ఐక్యతా కేంద్రంగా యూసీసీఆర్ (ఎంఎల్)ను స్థాపించారు. గత నాలుగైదు దశాబ్దాల కాలంలో ఆ మౌలిక పంథాపై సరైన చర్చ జరగలేదు, ఐక్యత ఫలించలేదు.

ఆనాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, నక్సల్బరీ–శ్రీకాకుళం తదితర పోరాటాలు జరిగిన దేశ కాల పరిస్థితులు వేరు. ఆ పోరాటాలలో కమ్యూనిస్టుల విజయాలతో పాటు, ప్రయోగాలుగా కొన్ని వైఫల్యాలు మిగిలిపోయాయి. చివరికి ఈనాడు 60 సంవత్సరాల పరిణామక్రమంలో మావోయిస్టుల మిలిటెన్సీ త్యాగాల నేపథ్యంలో వారు తమ పంథా మార్చుకుంటే తప్ప భవిష్యత్తు లేదని చరిత్ర హెచ్చరిస్తున్నది.

మరోవైపు విప్లవ కమ్యూనిస్టుల పేరిట, ఆయా గ్రూపులుగా చలామణిలో ఉన్న పార్టీలలో ముఖ్యంగా గత 25 సంవత్సరాల కాలంలో మరిన్ని చీలికలు– బ్రాండ్‌నేమ్స్ తగిలించుకున్నట్లు చీలిపోయి, నాయకత్వం కోసం స్థానిక బలం కోసం ఎవరికి వారుగా విడిపోవడం ఒక హాస్యాస్పదమైన పరిణామం.

ఈ దశలో కనీసం సీపీఐ–సీపీఎం పార్టీలైనా ఏకమై ఉమ్మడిగా పార్లమెంటరీ పంథాలోనైనా ప్రజా ఉద్యమాలను నిర్వహించవచ్చునని, కీ.శే. సురవరం సుధాకర్‌రెడ్డి చివరి వరకు కూడా మనసారా కోరుకున్నారు.



ప్రస్తుతం భారతీయ ప్రజాస్వామ్యమనేది మన రాజ్యాంగ నీడలోనే మతోన్మాదాన్ని, సంకుచిత జాతీయవాదాన్ని పెంచి పోషిస్తున్నది. మరోవైపు వికృత సంస్కృతి విజృంభించి మానవీయ విలువలు నశిస్తున్నాయి. మారిపోయిన పరిస్థితులను అనుసరించి భారతీయ కమ్యూనిస్టులు తమను తాము పునరావిష్కరణ చేసుకోవాలి.

ఇంతకూ కమ్యూనిస్టుల అనైక్యతకు కారణాలేమిటి అనే మీమాంసలో, సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు, రచయిత కందిమళ్ల ప్రతాపరెడ్డి ఇటీవల ప్రచురించిన 'భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల ఉద్యమ ప్రస్థానం' అనే పుస్తకంలో నిర్మొహమాటంగా కొన్ని ప్రశ్నలు సంధించి నిలదీస్తున్నారు– వాటిలో కొన్ని– 1) విలీనానికి ఆటంకంగా ఉన్న సిద్ధాంత విభేదాలేమిటి? 2) నాయకత్వం పోతుంది, పార్టీ ఆస్తులు పోతాయన్న భయమా? 3) నాయకుల వ్యక్తిగత ప్రయోజనాలు దెబ్బతింటాయనా? 4) విమర్శ–ఆత్మవిమర్శ అన్న మౌలిక సూత్రాన్ని విస్మరించి, విమర్శలకే పరిమితం కావడమా? 5)ప్రజల, శ్రేయోభిలాషుల ఆలోచనా విధానాలకు భిన్నంగా ఉండడమా?

ప్రతి ఒక్క కమ్యూనిస్టు ఆత్మవిమర్శ చేసుకొని, ఐక్యత–విలీనం దిశలో కృషి చేస్తూ, కలిసొచ్చిన వారితో 'వామపక్ష ప్రజాతంత్ర–ఐక్య సంఘటన నిర్మాణం' జరగాలని ఆయన కోరుతున్నారు.

ప్రస్తుతం భారతీయ ప్రజాస్వామ్యమనేది మన రాజ్యాంగ నీడలోనే మతోన్మాదాన్ని, సంకుచిత జాతీయవాదాన్ని పెంచి పోషిస్తున్నది. మరోవైపు వికృత సంస్కృతి విజృంభించి మానవీయ విలువలు నశిస్తున్నాయి. ఈ దేశంలోని అన్ని కులాల్లో బ్రాహ్మణీయ భావజాలం, మూఢ దైవభక్తి జీర్ణించుకుపోయింది. సాంస్కృతికంగా ఒక మానవీయ ప్రత్యామ్నాయ సంస్కృతిని, కమ్యూనిస్టులు ఆచరణలో నిరూపించలేదు. కులాలు, మతాచారాల మధ్య కొట్టుకుపోయారు. శ్రామిక రంగంలో వామపక్షాల అనైక్యత, బలహీనతల వల్ల మత–మితవాద శక్తులన్నీ మరింత బలపడినాయి.

ఇప్పుడైనా మార్క్సిస్టు–లెనినిస్టు మూలసూత్రాల నిబద్ధత ఉన్న కమ్యూనిస్టులందరూ చిత్తశుద్ధితో ఏకం కాని పక్షంలో మరింతగా మూలకు నెట్టబడతారు. అర్ధ భూస్వామ్య, అర్ధ వలస స్థాయి నుంచి ఈ రోజు భారతీయ ఆర్థిక–సామాజిక వ్యవస్థ పెట్టుబడిదారి దళారుల చేతిలో ఉంది. విదేశీ పెట్టుబడులకు తోడైన స్వదేశీ క్యాపిటలిస్టులు బాహాటంగానే దోచుకుంటున్నారు. దేవాలయాలు–విగ్రహాలు నిర్మించి ప్రజలను భ్రమావరణంలోకి నెడుతున్నారు. ఈ దశలో భారతీయ కమ్యూనిస్టులు మారిపోయిన పరిస్థితులను అనుసరించి 'Reinvent' చేసుకోవడం (పునరావిష్కరణ) తిరిగి తెలుసుకోవడం అవసరమని రాజనీతి శాస్త్రవేత్తలు, ప్రజా మేధావులు భావిస్తున్నారు. గత చరిత్ర–సెంటిమెంట్ల భారాన్ని వదిలివేసి, వామపక్ష నాయకులు–అనుయాయులు ఉద్యమించడమే మార్గాంతరం!

■ నిఖిలేశ్వర్


తిరుమలలో భక్తులకు అన్నప్రసాదాలు వడ్డిస్తున్న నిర్మలా సీతారామన్

శ్రీవారిని దర్శించుకున్న నిర్మలా సీతారామన్

తిరుమల, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం వేకువజామున అభిషేక సేవలోనూ, ఆ తర్వాత వీఐపీ బ్రేక్‌లోనూ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆమెకు రంగనాయక మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేశారు. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి శ్రీవారి ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. మధ్యాహ్నం వెంగమాంబ అన్నప్రసాద కేంద్రాన్ని సందర్శించిన కేంద్ర మంత్రి భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. అనంతరం అందరితో కలిసి భోజనం చేశారు.

స్టిక్కర్‌తో శ్రీవారి హుండీలో చోరీ

తిరుమల శ్రీవారి ఆలయ హుండీలో చోరీ చేసి ఓ పాత నేరస్థుడు దొరికిపోయాడు. తమిళనాడులోని తిరునల్వేలికి చెందిన వేణు బుధవారం రాత్రి 9.30 గంటల సమయంలో శ్రీవారి ఆలయంలో బంగారు బావి పక్కనే ఏర్పాటు చేసిన స్టీల్ హుండీలో చోరీకి పాల్పడ్డాడు. ఒక స్టిక్కర్‌ను హుండీలోకి పంపి దానికి అంటుకున్న కానుకలను బయటకు లాగాడు. సీసీ కెమెరాల ద్వారా ఈ తతంగం గమనించిన విజిలెన్స్ సిబ్బంది అతన్ని అదుపులోకి తీసుకున్నారు.తిరుమల వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

4,687 అంగన్వాడీ హెల్పర్ పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్

అమరావతి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 4,687 అంగన్వాడీ హెల్పర్ పోస్టుల నియామకానికి రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి సూర్యకుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

లాసెట్ కౌన్సెలింగ్ షెడ్యూలు సవరణ

న్యాయ విద్యలో ప్రవేశాలకు ఇటీవల జారీచేసిన లాసెట్ కౌన్సెలింగ్ షెడ్యూలును ఉన్నత విద్యామండలి సవరించింది. కొత్త షెడ్యూలును శుక్రవారం విడుదల చేసింది. దీని ప్రకారం ఈనెల 14 వరకు రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఉంది. 17 వరకు వెబ్ ఆప్షన్లను ఎంపిక చేసుకోవాలని ఉన్నత విద్యామండలి సూచించింది. 18న ఆప్షన్లు మార్చుకోవచ్చని, 20న సీట్ల కేటాయింపు జరుగుతుందని తెలిపింది. 22 నుంచి 24 వరకు విద్యార్థులు కాలేజీల్లో రిపోర్టు చేయాలని పేర్కొంది.

ప్రథమ చికిత్సకే పరిమితం కావాలి

- పరిధి దాటితే చట్టపరంగా చర్యలు తప్పవు
- ఆర్ఎంపీ, పీఎంపీ, గ్రామీణ వైద్యులకు.. ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ శ్రీహరిరావు హెచ్చరిక
- ఐఎంఏ ప్రతినిధులతో కలసి తురకపాలెం సందర్శన

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎంపీ, పీఎంపీ, గ్రామీణ వైద్యులు అత్యవసర ప్రథమ చికిత్సలకే పరిమితం కావాలని.. పరిధి దాటి వైద్యం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ డీ శ్రీహరిరావు హెచ్చరించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ కే విజయలక్ష్మీ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గార్లపాటి నందకిశోర్, ఏపీ మెడికల్ కౌన్సిల్ విజిలెన్స్ అధికారి డాక్టర్ ఆశాకిరణ్‌తో కలసి శుక్రవారం ఆయన తురకపాలెంలో పర్యటించారు. గ్రామంలోని ఆర్ఎంపీ క్లినిక్‌లను సందర్శించారు. 'కలుషిత సెలైన్ కాటేసిందా..?' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో గురువారం ప్రచురితమైన వార్తాకథనానికి ఏపీ మెడికల్ కౌన్సిల్ స్పందించింది. తురకపాలెంలో ఆర్ఎంపీ క్లినిక్‌లను సందర్శించిన డాక్టర్ శ్రీహరిరావు వారు రోగులకు ఇస్తున్న మందులను పరిశీలించారు. పలు క్లినిక్‌ల్లో వైద్యుల పర్యవేక్షణలో వాడాల్సిన స్టెరాయిడ్, యాంటీబయాటిక్స్ ఉండటాన్ని గుర్తించారు. అలాగే ఆర్ఎంపీలు తమ పేర్ల ముందు డాక్టర్ అని రాసుకోవడాన్ని కూడా ఆయన గమనించారు.

విచక్షణరహితంగా మందుల వాడకం

ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ శ్రీహరిరావు విలేకరులతో మాట్లాడుతూ... తురకపాలెంలో చనిపోయిన వారిలో చాలా మంది ఈ ప్రథమ చికిత్స కేంద్రంలో సెలైన్లు, యాంటీబయాటిక్స్ విచక్షణారహితంగా వాడినట్టు చెప్పారు. ఆర్ఎంపీ, పీఎంపీలు సెలైన్లు పెట్టడం, యాంటీబయాటిక్ మందులు రాయడం, స్టెరాయిడ్లు ఇవ్వడం ప్రజారోగ్యానికి ఎంతో హానికరమన్నారు. నకిలీ వైద్యులు నిర్వహించే ప్రథమ చికిత్స కేంద్రాలకు వెళ్లడం ఎంత మాత్రం మంచిది కాదని సూచించారు. డాక్టర్ నందకిశోర్ మాట్లాడుతూ.. గ్రామీణులు తమ ప్రాంతాల్లో అందుబాటులో ఉండే పీహెచ్‌సీల్లో చికిత్సలు పొందాలని సూచించారు.


ఆర్ఎంపీ క్లినిక్‌ను పరిశీలిస్తున్న శ్రీహరిరావు, నందకిశోర్, విజయలక్ష్మి

తురకపాలెంలో గుర్తించిన బ్యాక్టీరియా అంత ప్రమాదకరం కాదని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. తొలుత ఏపీ కౌన్సిల్, ఐఎంఏ ప్రతినిధులు గ్రామంలో ఆరోగ్యశాఖ నిర్వహిస్తున్న వైద్యశిబిరాన్ని సందర్శించి అక్కడ ప్రజలకు అందిస్తున్న వైద్యసేవల గురించి తెలుసుకున్నారు.

తురకపాలెంపై నిఘా పెంచండి: మంత్రి సత్యకుమార్

- 4 శాతం మందిలో మెలియోయిడోసిస్ గుర్తించిన అధికారులు

అమరావతి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తురకపాలెంలో మరణాలకు కారణాలపై వారంలో సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అధికారులను ఆదేశించారు. ఈ గ్రామంలో సీనియర్ వైద్యుల పర్యవేక్షణ కొనసాగుతూనే ఉండాలని సూచించారు. తురకపాలెంలో మరణాలు, స్థానికుల నుంచి సేకరించిన రక్తనమూనాలు, వాటి ఫలితాల గురించి శుక్రవారం మధ్యాహ్నం సచివాలయంలో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆ గ్రామంలో నమోదైన వరుస మరణాల గురించి జిల్లా అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో విఫలమయ్యారని అన్నారు. ఈ గ్రామంలో 4శాతం మందిలోనే మెలియోయిడోసిస్ ఉన్నట్లు గుర్తించామని అధికారులు వివరించారు. తురకపాలెం సమీపంలోని కొత్తరెడ్డిపాలెం గ్రామస్తులకు కూడా పరీక్షలు చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ గ్రామంపై కూడా ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు.

పీ4 ఫౌండేషన్ కార్యకలాపాలకు 'ఎస్‌వోపీ'

ప్రణాళిక శాఖ ఉత్తర్వులు జారీ

అమరావతి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్ (ఎస్‌పీపీఎఫ్) ఆర్థిక, ఆర్థికేతర కార్యకలాపాలకు సంబంధించి ఎస్‌వోపీ (ప్రామాణిక కార్యచరణ విధానాలు) విడుదల చేస్తూ ప్రణాళిక శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఆర్థికేతర కార్యకలాపాలకు ఎస్‌పీపీఎఫ్ సీఈవో అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు. పోర్టల్ ద్వారా మార్గదర్శి బంగారు కుటుంబాల ఆమోదం పొందడం, జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు ఉంటే చేపట్టడం, భాగస్వామ్య సంస్థలతో, వాలంటీర్లతో సమన్వయం చేసుకోవడం, ఎస్‌పీపీఎఫ్ సిబ్బంది వ్యవహారాల అంశాలను సీఈవో అంతర్గతంగా నిర్వహిస్తారు. అదే విధంగా ఆర్థిక అంశాలకు సంబంధించి ఆర్థిక లావాదేవీలు, ప్రాజెక్టు, చట్టపరమైన అంశాలపై ఎగ్జిక్యూటివ్ కమిటీ ఆమోదం తీసుకుంటారు. సీఎస్ఆర్ నిధులతో చేపట్టే విద్య, ఆరోగ్యం, జీవనోపాధి, మౌలిక వసతుల ప్రాజెక్టుల ఆమోదం, పంచాయతీ, నియోజకవర్గం, జిల్లా స్థాయిలో భాగస్వామ్య సంస్థల నిధుల విడుదల, వినియోగం, కన్సల్టెంట్లు, వెండర్లను నియమించుకోవడం వంటివి ఎగ్జిక్యూటివ్ కమిటీ ఆమోదం ద్వారా చేపడతారు. రూ.50 లక్షలకు పైబడి నిధుల వినియోగానికి ప్రభుత్వ ఆమోదం పొందాల్సి ఉంటుంది. పారదర్శకత, జవాబుదారీతనం కోసం ఈ-ఆఫీసును వినియోగించి ఫైల్ ప్రాసెస్ చేపడతారు.

15 మంది డీసీఎఫ్‌లకు పోస్టింగ్‌లు

- అటవీశాఖ ఉత్తర్వులు

అమరావతి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అటవీశాఖలో 2024-25 ప్యానల్ సంవత్సరానికి 15 మంది అసిస్టెంట్ కన్జర్వేటర్లకు డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (డీసీఎఫ్)గా స్టేట్ క్యాడర్‌లో తాత్కాలిక పదోన్నతి లభించింది. వీరికి పోస్టింగులు ఇస్తూ అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతీలాల్‌దండే శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బాపట్ల డీఎఫ్‌వోగా ఎస్ రవిశంకర్, తిరుపతి సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వోగా జీఎస్ పవన్‌కుమార్, శ్రీసత్యసాయి జిల్లా డీఎఫ్‌వోగా టీ చక్రపాణి, అన్నమయ్య జిల్లా సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వోగా ఎస్ శివకుమార్ సంగల, హెచ్‌వోఎఫ్ఎఫ్ ఆఫీస్‌లో డీసీఎఫ్(ఏసీ)గా కె.సోమశేఖరం, అనంతపురం సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వోగా ఎం.గురుప్రభాకర్, హెచ్‌వోఎఫ్ఎఫ్ ఆఫీస్‌లో వైల్డ్‌లైఫ్ డీసీఎఫ్‌గా ఎ.శ్రీనివాసులు, రాజమండ్రిలోని ఫారెస్ట్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్‌గా వి.హరిగోపాల్, అనకాపల్లి సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వోగా ఎం.సోమసుందరం, హెచ్‌వోఎఫ్ఎఫ్ ఆఫీస్‌లో డీసీఎఫ్(పీఎంయూ2)గా సీహెచ్.నాగభూషణం, శ్రీసత్యసాయి జిల్లా సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వోగా జి.శ్రీనివాసులు, కోనసీమ జిల్లా డీఎఫ్‌వోగా ఎంవీ.ప్రసాదరావులకు పోస్టింగులు ఇచ్చారు. పంచాయతీరాజ్‌శాఖలో జాయింట్ కమిషనర్(ప్లాంటేషన్)గా పనిచేస్తున్న ఎస్‌వీ. శివరాంప్రసాద్, ఔషధ, సుగంధ మొక్కల బోర్డు సీఈవో ఎ.చంద్రశేఖర్‌ను తిరిగి అవే పోస్టులో కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మరో అసిస్టెంట్ కన్జర్వేటర్ ఎం.రవిశంకర్‌శర్మకు డీసీఎఫ్‌గా పదోన్నతి కల్పించి, తిరుపతిలోని ఎర్రచందనం సెంట్రల్ డిపో డీఎఫ్‌వోగా నియమించారు.

మద్దువలస, ఏలేరు రిజర్వాయర్లలో కేజ్ కల్చర్

అమరావతి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా మద్దువలస, కాకినాడ జిల్లా ఏలేరు రిజర్వాయర్లలో పైలట్ ప్రాతిపదికన కేజ్ కల్చర్ చేపట్టడానికి యూఎస్ఏకు చెందిన మెస్సర్స్ ఫిషిన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

రంగా వర్సిటీ నాన్‌టీచింగ్ సిబ్బందికి పదోన్నతులు

అమరావతి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 105 మంది నాన్ టీచింగ్ సిబ్బందికి పదోన్నతులు లభించాయి. జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్ నుంచి సీనియర్ ఆఫీస్ అసిస్టెంట్‌లుగా పదోన్నతులు దక్కాయి. విశ్వవిద్యాలయం ఏర్పాటు చేశాక నాన్ టీచింగ్ సిబ్బందికి ఇంత భారీ స్థాయిలో పదోన్నతులు ఇవ్వడం ఇదే ప్రథమమని ఆంగ్రూ నాన్ టీచింగ్ సిబ్బంది సెంట్రల్ అసోసియేషన్ ఓ ప్రకటనలో వర్సిటీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపింది.

నిధి భవన్ ఎదుట కాంట్రాక్టర్ల నిరసన

మంగళగిరి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ (సబ్కా) ఆధ్వర్యంలో కాంట్రాక్టర్లు శుక్రవారం మంగళగిరి ఆటోనగర్‌లోని నిధి భవన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లుల సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. నిరసనలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి సుమారు 200 మంది కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. సమస్యలపై నిధి భవన్ సీఈవో గౌతమ్‌కు వినతిపత్రం అందజేశారు.

జనాభా దామాషాలో 'స్థానికం'లో బీసీలకు సీట్లు కేటాయించాలి

- రేపు విజయవాడలో సమావేశం: రామకృష్ణ

అమరావతి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థలలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి బీసీ కులాల హక్కులను సాధించుకునేందుకు సీపీఐ ఆధ్వర్యంలో బీసీ కుల సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల ప్రతినిధులను ఆహ్వానించి 14న విజయవాడలో సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

'రుషికొండ'ను మ్యూజియంగా మార్చండి

- అమరావతిలో జూ, బొటానికల్ గార్డెన్ ఏర్పాటు చేయాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబుకు బీవీ రాఘవులు లేఖ

అమరావతి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం రుషికొండపై నిర్మించిన అత్యాధునిక భవనాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సైన్సు, ఆర్ట్స్, హెరిటేజ్ మ్యూజియం ఏర్పాటు చేయాలని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ఇలాంటి మ్యూజియం రాష్ట్రంలోని బాలబాలికల మనోవిజ్ఞాన వికాసాలకు, టూరిజం అభివృద్ధికి ఉపయోగపడుతుందని తెలిపారు. రుషికొండ రిసార్ట్స్‌ను ఎలా వినియోగించాలన్న అంశంపై సూచనలు చేసేందుకు ముగ్గురు మంత్రులతో కమిటీని ఏర్పాటు చేసిన ప్రభుత్వం... నిర్ణయం తీసుకునే ముందు తన అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుంటుందని ఆశిస్తున్నానంటూ సీఎం చంద్రబాబుకు శుక్రవారం లేఖ రాశారు. అన్ని ప్రముఖ నగరాల్లో ప్రసిద్ధిగాంచిన సైన్స్ మ్యూజియంలు ఉన్నాయన్న విషయాన్ని గమనించాలని కోరారు. కొత్త రాష్ట్రానికి అన్ని హంగులతో నిర్మిస్తున్న రాజధాని అమరావతిలో భవిష్యత్తు తరాల విజ్ఞాన, వినోద సాధనాలుగా సైన్స్ మ్యూజియం, జంతు ప్రదర్శనశాల, బొటానికల్ గార్డెన్ ఏర్పాటు గురించి కూడా రాష్ట్ర ప్రభుత్వం పరిశీలన చేయాలని రాఘవులు కోరారు.

సమస్యలపై ఉద్యమాలను ఉధృతం చేయండి

పట్టణాల్లో ప్రజా సమస్యలపై ఉద్యమాలను ఉధృతం చేయాలని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు తమ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సీపీఎం పట్టణ ప్రాంత కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పట్టణాల్లో మురికివాడలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉపాధి సిబ్బంది సమస్యల పరిష్కారానికి కసరత్తు

- సీవో, టీఏలతో గ్రామీణాభివృద్ధిశాఖ అధికారుల భేటీ

అమరావతి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పనిచేసే సిబ్బంది సమస్యల పరిష్కారానికి గ్రామీణాభివృద్ధి శాఖ కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే క్షేత్రస్థాయి సిబ్బంది అయిన ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశమై చర్చించిన అధికారులు.. శుక్రవారం కంప్యూటర్ ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. ఉపముఖ్యమంత్రి ఓఎస్‌డీ వెంకటకృష్ణ, ఉపాధి హామీ పథకం డైరెక్టర్ షణ్ముక్‌కుమార్, అడిషనల్ కమిషనర్ శివప్రసాద్, మెంబర్ సెక్రటరీ మద్దిలేటి ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కంప్యూటర్ ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్ల గ్రేడ్ ఫిక్సేషన్, 2021లో నిలిపేసిన ఇన్సెంటివ్‌ను పునరుద్ధరించాలని, ఉపాధి హామీ ఉద్యోగులకు పీఆర్‌సీ 23 శాతం అమలు, జీతాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని సిబ్బంది కోరారు. సిబ్బంది సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, వీలైనంత త్వరలో ప్రభుత్వ ఆదేశాలతో పరిష్కారం చూపుతామని అధికారులు పేర్కొన్నారు.

'విజన్ ఇండియా'తో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఒప్పందం

అమరావతి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగావకాశాల కల్పన, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ కోసం విజన్ ఇండియా అనే ప్రైవేటు కంపెనీతో నైపుణ్యాభివృద్ధి సంస్థ శుక్రవారం మంగళగిరిలోని కార్యాలయంలో ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందంతో రాష్ట్ర యువతకు నైపుణ్యాలు, ఉద్యోగావకాశాలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ జి.గణేష్ కుమార్ తెలిపారు. విద్య, నైపుణ్యం, పరిశ్రమ రంగాల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించి.. తద్వారా మెరుగైన నైపుణ్యం కలిగిన యువతను తయారు చేయడం ప్రభుత్వ లక్ష్యమన్నారు.

ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతి

చింతూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా సరిహద్దు ఛత్తీస్‌గఢ్‌లో శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందారు. బీజాపూర్ జిల్లా గంగులూర్ పోలీసుస్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగినట్టు పోలీసులు ధ్రువీకరించారు. ఘటనా స్థలంలో రెండు 303 తుపాకులు, పేలుడు సామగ్రిని బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.

వాటర్ బాటిల్ మూత మింగి బాలుడి మృతి

అనంతపురం క్రైం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆడుకుంటూ పొరపాటున వాటర్ బాటిల్ మూత మింగి ఏడాదిన్నర చిన్నారి ప్రాణాలు కోల్పోయాడు. అనంతపురం నగరానికి చెందిన మౌనిక గుత్తి పట్టణ సమీపంలోని ఎస్‌పీటీసీ ట్రాన్స్‌కో విభాగంలో ఏడీఈగా విధులు నిర్వహిస్తున్నారు. ఆమె భర్త యుగంధర్ అనంతపురంలో ఆర్అండ్‌బీ ఏఈగా పనిచేస్తున్నారు. వీరికి ఏడాదిన్నర వయసున్న కుమారుడు రక్షిత్ రామ్ ఉన్నారు. మౌనికకు నైట్ షిఫ్ట్ ఉండటం, కుమారుడు ఇంకా తల్లిపాలను మానకపోవడంతో వెంట తీసుకుని విధులకు వచ్చారు. వీరి వెంట ఆమె మామ కూడా ఉన్నారు. మౌనిక విధి నిర్వహణలో ఉన్న సమయంలో బాలుడు ఆడుకుంటూ పొరపాటున వాటర్ బాటిల్ మూత మింగేశాడు. అది గొంతులో ఇరుక్కోవడంతో ఊపిరి అందక విలవిల్లాడాడు. మౌనిక వెంటనే బాలుడిని గుత్తి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లగా సీపీఆర్ చేశారు. ఎంత ప్రయత్నించినా చిన్నారిని కాపాడటం సాధ్యం కాలేదని తెలిపారు. కన్న కొడుకు మృతితో మౌనిక గుండెలవిసేలా రోదించారు.

గిడ్డంగుల సంస్థకు నలుగురు డైరెక్టర్లు

అమరావతి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు నలుగురు నాన్ ఆఫీషియల్ డైరెక్టర్లను ప్రభుత్వం నియమించింది. ఎ.ఎం.రంగనాథ్, డి.సత్యనారాయణ, కె.శ్రీనివాసులు, ఎం.శ్రీధర్ డైరెక్టర్లుగా నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

15వ ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్ ప్రమాణం

- చేయించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- మోదీ, ఖర్గే, కేంద్ర మంత్రులతో పాటు మాజీ ఉపరాష్ట్రపతులు వెంకయ్య, హన్సారీ, ధన్‌ఖడ్ హాజరు
- ఏపీ సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్ కూడా..
- హాజరు కాని రాహుల్ గాంధీ, ఇతర విపక్షాల నేతలు



ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌ను అభినందిస్తున్న సీఎం చంద్రబాబు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): భారత 15వ ఉపరాష్ట్రపతిగా చంద్రపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్ బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం ఉదయం ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనతో పదవీప్రమాణం చేయించారు. రాధాకృష్ణన్ తమిళ సంప్రదాయ దుస్తులు, ఎర్ర కుర్తా ధరించి వచ్చిన ఆయన.. భగవంతుడిపై ఆంగ్లంలో ప్రమాణం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు, చంద్రబాబు సహా ఎన్‌డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మాజీ ఉపరాష్ట్రపతులు వెంకయ్యనాయుడు, హమీద్ అన్సారీ, పార్లమెంటు సభ్యులు కూడా పాల్గొన్నారు. మాజీ ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ సైతం భార్యాసమేతంగా హాజరవడమే గాక.. అందరినీ నవ్వుతూ పలకరించడంగమనార్హం. జూలై 21న రాజీనామా చేశాక ఆయన బహిరంగంగా కనిపించడం ఇదే ప్రథమం. ఉపరాష్ట్రపతిగా ప్రమాణం చేసిన రాధాకృష్ణన్ ఇక రాజ్యసభ చైర్మన్‌గానూ వ్యవహరించనున్నారు. 2030 సెప్టెంబరు 11 వరకు ఆయన పదవిలో కొనసాగుతారు. ఆయన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే, సీపీఎం ఎంపీ జాన్ బ్రిటాస్ మాత్రమే కనిపించారు. ఖర్గేతో రాధాకృష్ణన్ కరచాలనం చేశారు. మిగతా ప్రతిపక్షాల నేతలెవరూ రాలేదు. 2022లో ఉపరాష్ట్రపతిగా ధన్‌ఖడ్ ప్రమాణ స్వీకారానికి కూడా విపక్ష నేతలెవరూ హాజరుకాకపోవడం గమనార్హం. కాగా.. ప్రమా ణస్వీకారం అనంతరం రాధాకృష్ణన్ రాజ్‌ఘాట్‌ను సందర్శించారు. మహాత్మాగాంధీకి నివాళులర్పించారు. సదైవ్ అటల్ (స్మారక చిహ్నం) వద్ద మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ పేయికి, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ మార్గ్‌లోని పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ స్మారక చిహ్నం వద్ద, కిసాన్ ఘాట్ వద్ద మాజీ ప్రధాని చౌదరి చరణ్‌సింగ్‌కు నివాళులు అర్పించారు. ఆ తర్వాత రాజ్యసభ చైర్మన్ చాంబర్లో బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్, కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు స్వాగతం పలికారు. అనంతరం పార్లమెంటు ప్రాంగణంలోని ప్రేరణాస్థల్ వద్ద దేశ ప్రసిద్ధ నేతలు, స్వాతంత్ర్య సమర యోధులు, సంఘ సంస్కర్తల విగ్రహాలకు ఆయన నివాళులు అర్పించారు.

మోదీ అభినందనలు

కొత్త ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ తన పదవీకాలాన్ని విజయవంతంగా నిర్వహించాలని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. ప్రజాజీవితం, ప్రజాస్వామ్య విలువలకు ఆయన జీవితాంతం కట్టుబడుతూ వచ్చారని 'ఎక్స్'లో పేర్కొన్నారు. దేశ నిర్మాణం, సామాజిక సేవ, ప్రజాస్వామ్య విలువల బలోపేతానికి తన జీవితాన్ని అంకితం చేశారని తెలిపారు.

మలేసియా వెళ్లడానికి రాహుల్‌కు టైముందా?

ఉపరాష్ట్రపతి ప్రమాణ స్వీకారానికి లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ గైర్హాజరుపై బీజేపీ మండి పడింది. మలేసియా వెళ్లడానికి ఆయనకు టైముంటుందని ఆ పార్టీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ ఎద్దేవాచేశారు.

త్వరలో భారత్‌కు ట్రంప్!

- క్వాడ్ సదస్సుకు హాజరయ్యే అవకాశం
- భారత్‌ను చైనాకు దూరం చేయడమే లక్ష్యం
- భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ వెల్లడి

వాషింగ్టన్, సెప్టెంబరు 12: భారత్‌లో త్వరలో జరగనున్న క్వాడ్ దేశాధినేతల సదస్సుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హాజరయ్యే అవకాశం ఉందని భారత్‌కు అమెరికా రాయబారిగా ట్రంప్ ఇటీవల నియమించిన సెర్గియో గోర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ, ఈ సదస్సుకు హాజరవడంతో పాటు క్వాడ్ బలోపేతానికి ట్రంప్ కట్టుబడి ఉన్నారని చెప్పారు. ఈ ఏడాది చివర్లో క్వాడ్ దేశాధినేతల సదస్సును భారత్ నిర్వహించనుంది. దీనికి సంబంధించిన తేదీ ఇంకా ఖరారు కాలేదు. ఈ సమావేశానికి హాజరు కావాలని ఫిబ్రవరిలో ట్రంప్‌ను ప్రధాని మోదీ ఆహ్వానించారు. కాగా, భారత్‌తో సంబంధాలు బలోపేతం చేసుకోవడమే తమకు అత్యంత ప్రాధాన్యమని గోర్ స్పష్టం చేశారు. భారత్‌ను అమెరికాకు చేరువ చేయడంతో పాటు చైనాకు దూరం చేయడమే లక్ష్యమన్నారు. ప్రస్తుతం అమెరికా, భారత్ మధ్య నెలకొన్న అడ్డంకులు త్వరలోనే తొలగిపోతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. భారత్‌తో దశాబ్దాల నుంచి తమకు సత్సంబంధాలు ఉన్నాయని, చైనీయులతో కంటే కూడా అమెరికన్లతోనే వారికి సాన్నిహిత్యం ఎక్కువని గోర్ వ్యాఖ్యానించారు.

ట్రంప్ చంచల మనస్కుడు: థరూర్

సింగపూర్, సెప్టెంబరు 12: ట్రంప్ తీరుపై తనదైనశైలిలో కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ వ్యాఖ్యలు చేశారు. ట్రంప్‌ని 'మెర్క్యూరియల్ ఇండివిడ్యువల్'.. అనగా ఏ క్షణంలో ఎలా ప్రవర్తిస్తాడో తెలియని చంచల మనస్కుడైన వ్యక్తిగా అభివర్ణించారు. ట్రంప్ సుంకాలతో సూరత్‌లో రత్నాభరణాల రంగంలో 1.35 లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయారని.. సీఫుడ్, ఉత్పత్తి రంగాల్లోనూ గణనీయంగా ఉద్యోగాలు పోతున్నాయని.. ఆందోళన వ్యక్తం చేశారు.

భారత సైనికుల్ని కరిగించటానికి చైనా ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ ఆయుధం!

వాషింగ్టన్, సెప్టెంబరు12: ఐదేళ్ల కిందటి గల్వాన్ ఘర్షణ సందర్భంగా భారత సైనికుల మీద చైనా ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ ఆయుధాన్ని ప్రయోగించిందని అమెరికా సెనేటర్ బిల్ హ్యాగెర్టీ తెలిపారు. 'ఐదేళ్ల కిందట ఓ సరిహద్దు గొడవపై ఇరుదేశాలు ఘర్షణకు దిగాయి. ఈ సందర్భంలో భారత్ సైనికుల్ని కరిగించడానికి చైనా ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ ఆయుధాన్ని ఉపయోగించింది' అని ఆరోపించారు. అయితే, ఈ ఆరోపణల్లో వాస్తవం ఎంతన్నది నిర్ధారణకాలేదు. గల్వాన్ ఘర్షణ సమయంలోనూ ఈ తరహా ఆయుధం గురించి ఎలాంటి వార్తలు వెలువడలేదు. చైనాకు ఇండియా దగ్గరవుతున్న వేళ హ్యాగెర్టీ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

ఆసక్తికరంగా 'నేనెవరు?'



రాజేంద్రప్రసాద్ ముఖ్య పాత్రధారిగా తెరకెక్కిన చిత్రం 'నేనెవరు?'. చిరంజీవి తన్నీరు దర్శకత్వంలో అండేకర్ జగదీశ్‌బాబు నిర్మించారు. దసరా సందర్భంగా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవలే చిత్ర బృందం ఆడియో విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ 'నా సినీ జీవితంలో 'నేనెవరు' ఓ మంచి చిత్రంగా నిలిచిపోతుంది. సామాజిక బాధ్యతతో దర్శకుడు ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. కథ మీద నమ్మకంతో జగదీశ్‌బాబు ఈ సినిమాను నిర్మించేందుకు ముందుకొచ్చారు' అని చెప్పారు. 'ప్రతి ఒక్కరి జీవితానికి అన్వయించుకునే కథ ఇది. దర్శకుడు వినోద భరితంగా నడిపిస్తూనే భావోద్వేగాలను ఆవిష్కరించే ప్రయత్నం చేశారు' అని నిర్మాత తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి, దర్శకుడు వి. సముద్ర తదితరులు పాల్గొన్నారు.

ముక్కోణ ప్రేమ కథ



సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా నీరజా కోన తెరకెక్కిస్తోన్న చిత్రం 'తెలుసు కదా'. శ్రీనిధి శెట్టి, రాశీ ఖన్నా కథానాయికలు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. అక్టోబరు 17న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ టీజర్‌ని విడుదల చేశారు. ముక్కోణ ప్రేమ కథ అని టీజర్‌ను చూస్తే అర్థమవుతోంది. ఇందులో సిద్ధు చాలా స్టైలిష్‌గా కనిపించారు. హీరో, ఇద్దరు హీరోయిన్లతో చిత్రీకరించిన సన్నివేశాలు ఆసక్తిగా ఉన్నాయి. వైవా హర్ష తన నటనతో ఆకట్టుకున్నారు.


అలరించే అందెల రవమిది



సంప్రదాయ సంగీతం ఇతివృత్తంగా రూపుదిద్దుకున్న చిత్రం 'అందెల రవమిది'. ఇంద్రాణీ దావలూరి ప్రధాన పాత్ర పోషిస్తూ, స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. తనికెళ్ల భరణి కీలకపాత్ర పోషించారు. ఈనెల 19న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. ఇంద్రాణి మాట్లాడుతూ "స్వర్ణకమలం' చిత్రం స్ఫూర్తితో 'అందెల రవమిది' తెరకెక్కించాను' అని చెప్పారు. 'టైటిల్‌కు తగ్గట్లే ఇంద్రాణి తన సినిమాను ఒక కళాఖండంలా తీర్చిదిద్దారు' అని నిర్మాత కేఎస్ రామారావు అభినందించారు.

అత్యుత్తమ కళాకారుడు బ్రహ్మానందం

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



హాస్య నటుడు బ్రహ్మానందం దేశ సినీ చరిత్రలోనే అత్యుత్తమ కళాకారుడని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కొనియాడారు. 30 ఏళ్లకు పైగా సుదీర్ఘమైన తన నటజీవితంలో 1200కు పైగా చిత్రాలలో నటించి కోట్లాది మంది ప్రేక్షకుల మనసులలో చిరస్థానం సంపాదించుకున్నారని అన్నారు. శుక్రవారం, ఫారిన్ కరస్పాండెంట్ క్లబ్ ఆఫ్ సౌత్ ఏషియాలో 'మీ బ్రహ్మానందం', 'మే అప్‌కా బ్రహ్మానందం' పేరుతో తెలుగు, హిందీ భాషల్లో రూపొందించిన జీవితచరిత్ర పుస్తకాలను ముఖ్యఅతిథి వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. తెలుగు, కన్నడ, మలయాళం, తమిళం, హిందీ, ఇంగ్లీష్‌లో బ్రహ్మానందం రాసిన పుస్తకం విడుదల కావడం చాలా గొప్ప విషయమని అన్నారు. బ్రహ్మానందం మాట్లాడుతూ.. సాధారణ రైతు కుటుంబంలో పుట్టి అంచలంచెలుగా ఎదిగి దేశ ఉపరాష్ట్రపతిగా పనిచేసిన వెంకయ్యనాయుడు తన పుస్తకావిష్కరణకు రావడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని అన్నారు.

న్యూఢిల్లీ (ఆంధ్రజ్యోతి)

ఈ సినిమా విజయం నాకో తీపి జ్ఞాపకం

- బన్నీ వాసు



'మంచి కంటెంట్ ఉన్న సినిమాను ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారన్న నమ్మకంతో 'లిటిల్ హార్ట్స్' చిత్రాన్ని థియేటర్లలో విడుదల చేశాం. మా అంచనా నిజమైంది. ప్రేక్షకుల నుంచి ఈ చిత్రానికి అపూర్వ స్పందన దక్కుతోంది. నా బీవీ వర్క్స్ బేనర్ మీద విడుదల చేసిన తొలి చిత్రమే ఇంత గొప్ప విజయం అందుకోవడం నాకో తీపి జ్ఞాపకం' అని నిర్మాత బన్నీ వాసు అన్నారు. మౌళీ తనుజ్, శివాని నాగరం జంటగా సాయి మార్తాండ్ దర్శకత్వంలో ఆదిత్య హాసన్ నిర్మించిన చిత్రమిది. నిర్మాత వంశీ నందిపాటితో కలసి బన్నీ వాసు విడుదల చేశారు. ఇటీవలే విడుదలై చక్కని ప్రేక్షకాదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం సక్సెస్‌మీట్‌ను నిర్వహించింది. వంశీ నందిపాటి మాట్లాడుతూ "లిటిల్ హార్ట్స్' విజయం ఎంతో సంతృప్తినిస్తోంది. దర్శకుడిగా సాయి మార్తాండ్‌కే ఈ ఘనత దక్కుతుంది. మౌళి, శివాని నటన ప్రేక్షకులను అలరిస్తోంది. బన్నీ వాసుతో కలసి ఈ సినిమాను పంపిణీ చేసినందుకు సంతోషంగా ఉంది' అన్నారు.

సంజయ్ మొదటి భార్య పరిస్థితి ఏమిటి?




అపర కుబేరుడు సంజయ్ కపూర్ ఈ ఏడాది జూన్ 12న హఠాత్తుగా గుండెపోటుతో మరణించి అందరినీ విషాదానికి గురి చేశారు. సంజయ్ మరణించి రెండు నెలలు అయిందో లేదో ఆయన మాజీ భార్య కరిష్మా కపూర్, ప్రస్తుత భార్య ప్రియా సచ్‌దేవ్ మధ్య కీచులాటలు మొదలయ్యాయి. దానికి కారణం సంజయ్ కపూర్‌కు రూ. 30 వేల కోట్ల ఆస్తి ఉండడమే. ఆ ఆస్తి మాదేనంటూ మాజీ భార్య, ఇప్పటి భార్య ఇద్దరూ ఘర్షణకు దిగితే, కరిష్మా ఇద్దరు పిల్లలు ఏకంగా కోర్టు గుమ్మం ఎక్కేసి ఆస్తిలో వాటా ఇవ్వకుండా తమ పినతల్లి మోసం చేస్తోందంటూ కేసు పెట్టారు. ప్రియ వెనక్కి తగ్గకుండా ఇప్పటికే ఈ పిల్లలకు కపూర్ కుటుంబం నుంచి రూ. 1900 కోట్లు వచ్చాయనీ, ఇంకా ఎంత డబ్బు కావాలంటూ అసహనంతో తను కూడా కోర్టులో వాదించారు. ఇలా సంజయ్ ఇద్దరు భార్యలూ కోర్టులో వాదులాడుకుంటుంటే , తాజాగా నందితా మత్వానీ వెలుగులోకి వచ్చారు. ఈవిడ ఎవరనుకుంటున్నారు.. సంజయ్ కపూర్ మొదటి భార్య.. ఫ్యాషన్ డిజైనర్ అయిన నందితను 1996లో సంజయ్ పెళ్లి చేసుకున్నారు. నాలుగేళ్లు కాపురం చేసిన తర్వాత వీరిద్దరూ విడిపోయారు. ఆ తర్వాత నందిత చాలా కాలం వార్తల్లో నిలిచారు. హీరో రణబీర్ కపూర్‌తో, డినో మోరియాతో ప్రేమ వ్యవహారాలు నడిపి, చివరికి నటుడు విద్యుత్ జమ్వాల్‌తో సెటిల్ అయ్యారు. తన మాజీ భర్త సంజయ్ రూ. 30 వేల కోట్ల ఆస్తిలో వాటాల గురించి ఇంత గొడవ జరుగుతుంటే నందిత ఎందుకు మౌనంగా ఉన్నారు? నాకూ వాటా కావాలంటూ కోర్టుకి ఎందుకు రాలేదు? ఈ ప్రశ్నలకు సింపుల్ సమాధానం సంజయ్, నందితకు పిల్లలు లేకపోవడమే! కరిష్మాకు ఇద్దరు పిల్లలు, ప్రియకు ఓ కొడుకు.. సంజయ్ వల్ల కలిగారు. అందుకే వారసుల మధ్య ఇప్పుడు ఆస్తి కోసం యుద్ధం జరుగుతోంది. సంజయ్ వల్ల తనకు సంతానం కలగక పోవడంతో ఈ వివాదానికి నందిత దూరంగా ఉన్నారు.

అలాంటి వ్యక్తినే పెళ్లి చేసుకుంటా

తమన్నా భాటియా



హీరోయిన్ తమన్నా భాటియా ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో దూసుకుపోతున్నారు. విజయ్ వర్మతో బ్రేకప్ అయ్యాక పూర్తిగా తన కెరీర్‌పైనే దృష్టి సారించారు. పలు సందర్భాల్లో తన ప్రేమ, పెళ్లి గురించి అడిగిన ప్రశ్నలకు సమాధానం దాటవేస్తూ వచ్చారు. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పెదవి విప్పారు. 'నేను మంచి జీవిత భాగస్వామిగా ఉండాలనుకుంటున్నాను. అతను కూడా అలాంటి వాడే అయి ఉండాలి. 'ఏ జన్మలో చేసుకున్న పుణ్యమో తమన్నా నాకు భార్యగా దొరికింది' అని అతను ఫీలవ్వాలి. అలాంటి అదృష్టవంతుడిని కచ్చితంగా పెళ్లి చేసుకుంటా. ఆ శుభతరుణం త్వరలోనే వస్తుంది' అని అన్నారు. తమన్నా వ్యాఖ్యలు నెట్టింట వైరల్ అయ్యాయి. ఈమె ఎవరితోనో లవ్‌లో ఉందంటూ నెటిజన్లు కామెంట్లు పెట్టారు.



ఓపెన్ అవినీతి!

ఓపెన్ స్కూల్స్ ఫలితాల వెనుక భారీ దందా!

ఉమ్మడి కృష్ణాజిల్లాలో రూ.10 కోట్ల వరకు వసూలు!

విద్యాశాఖ ఓపెన్ స్కూల్ కేటగిరీలో ఉమ్మడి కృష్ణాజిల్లాలో అవినీతి తిమింగలాలు రాజ్యమేలుతున్నాయి. ఓపెన్ స్కూల్స్ నిర్వహణ పేరుతో అందినకాడికి విద్యార్థుల నుంచి దండుకుంటున్నాయి. తాము సూచించిన ఓపెన్ స్కూల్స్‌లో చేరితే పాస్ గ్యారంటీ అని ప్రచారం చేస్తున్నాయి. జిల్లా విద్యాశాఖ కార్యాలయాలలో పనిచేసే కొందరి సహాయ సహకారాలతో ఓపెన్ స్కూల్స్‌కు చెందిన ఒక అధికారి, గతంలో పని చేసిన అధికారి, ఓ ఆపరేటర్ గ్యాంగ్‌గా ఏర్పడి అక్రమ వసూళ్లకు పాల్పడినట్టుగా విమర్శలు వస్తున్నాయి.

- వైసీపీ ప్రభుత్వ హయాంలో మొదలు పెట్టిన ఓ గ్యాంగ్
- మూడేళ్లుగా కొనసాగుతున్న వ్యవహారం
- విద్యాశాఖ అధికారుల కార్యాలయంలోని వారితో కుమ్మక్కై..
- గతంలో ఆరోపణలు వచ్చినా.. మొక్కుబడిగా చర్యలు
- రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, కమిషనర్‌కు ఫిర్యాదులతో విషయం వెలుగులోకి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఇటీవల జరిగిన ఓపెన్ స్కూల్స్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగటం సంచలనం సృష్టించింది. విద్యాశాఖ కార్యాలయంలోని కొందరు అధికారులతో సంబంధాలు కలిగిన వసూళ్ల గ్యాంగ్ ఈ భారీ స్కామ్‌కు పాల్పడినట్టుగా తెలుస్తోంది. ఉమ్మడి కృష్ణా ఓపెన్ స్కూల్స్‌లో జరుగుతున్న అవినీతి వ్యవహారాలపై తాజాగా మంత్రి నారా లోకేశ్‌కు ఫిర్యాదు అందటంతో లోగుట్టు వ్యవహారాలు వెలుగు చూశాయి. విద్యాశాఖ కమిషనర్‌కు కూడా ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో ఉమ్మడి కృష్ణా ఓపెన్ స్కూల్స్ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఓపెన్ స్కూల్స్ విభాగంలో రూ.10 కోట్ల మేర స్కామ్ జరిగినట్టుగా విద్యాశాఖ కమిషనర్‌కు అందిన ఫిర్యాదును బట్టి తెలుస్తోంది.



వందకుపైగా స్కూళ్లు!

ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్స్ నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం, ప్రైవేటు యాజమాన్యాల ఆధ్వర్యంలో వందకుపైగానే ఓపెన్ స్కూల్స్ ఉన్నాయి. ఓపెన్ స్కూల్స్‌లో మంచి ఫలితాలే వచ్చేవి. మాస్ కాపీయింగ్ ఆరోపణలు ఉండటం వల్ల కూడా ఫలితాలు ఎక్కువగా ఉండేవన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. అయితే ఉన్నట్టుండి ఇటీవల కాలంలో కృష్ణా జిల్లాలో ఓపెన్ స్కూల్స్ ఫలితాల శాతం దారుణంగా పడిపోయింది. దీని వెనుక లోగుట్టు ఎవరికీ అర్థం కాలేదు. ఓపెన్ స్కూల్ పరీక్షలను అత్యంత కఠినంగా మిగతా 6లో..

ఉన్నతాధికారులకు ఫిర్యాదులు

ఈ గ్యాంగ్ వ్యవహారం కృష్ణాజిల్లాలో కొంత మందికి తెలియటంతో వారు జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులపై విద్యాశాఖ ఉన్నతాధికారులు పూర్తి స్థాయి చర్యలు చేపట్టలేదు. ఒక ఆపరేటర్‌ను ఎన్టీఆర్ జిల్లాకు బదిలీ చేసి చేతులు దులుపుకున్నారు. ఆ తర్వాత ఎన్టీఆర్ జిల్లాలో కూడా ఇదే విధానాన్ని ఈ గ్యాంగ్ అమలు చేసింది. సడెన్‌గా ఉత్తీర్ణతా శాతాన్ని పడగొట్టి.. గతంలో కృష్ణా జిల్లాలో అనుసరించిన విధానాన్నే అనుసరించింది. కోచింగ్ సెంటర్ల నిర్వాహకులతో చేతులు కలిపి వారి ద్వారా ఓపెన్ స్కూల్స్‌కు అడ్మిషన్లు సాగించారు. కిందటి ఆగస్టు నెలలో ఈ తతంగాన్ని నడిపించారు. దీని వెనుక కూడా భారీ డీల్ నడిచిందని తెలుస్తోంది. రాష్ట్ర విద్యాశాఖాధికారులు జోక్యం చేసుకుంటే తప్ప .. ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఓపెన్ స్కూల్స్ ప్రక్షాళన కాలేని పరిస్థితి నెలకొంది.

నాన్నపై నేరాల చిట్టా!

కుమార్తె హత్య కేసులో నిందితుడిపై పిట్ ఎన్డీపీఎస్

- ఇంకా లభించని బాలిక మృతదేహం
- నిందితుడిపై పది కేసులు
- దోపిడీ, హత్యాయత్నం కేసుల్లోనూ నిందితుడు



(ఆంధ్రజ్యోతి-విజయవాడ): ఒక యువకుడితో ప్రేమాయణం నడుపుతోందని రెండో భార్య కుమార్తెను హత్య చేసిన నిందితుడి నేరాల చిట్టాను పోలీసులు బయటకు తీస్తున్నారు. నిందితుడిపై మొత్తం పది కేసులు ఉన్నట్టు తెలిసింది. దోపిడీ, హత్యాయత్నం కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. మొత్తం నాలుగు గంజాయి కేసులు ఉన్నాయి. ఇప్పటికే పోలీసుల అదుపులో ఉన్న అతడిపై పిట్ ఎన్డీపీఎస్ చట్టాన్ని ప్రయోగించడానికి అధికారులు రంగం సిద్ధం చేశారు. నిందితుడు కుమార్తె మృతదేహాన్ని ఎక్కడ పడేశాడన్నది ఇప్పటికీ స్పష్టంగా చెప్పలేదు. పోలీసులు మాత్రం అటు అటవీ ప్రాంతాల్లో, ఇటు మధిర చెరువుల్లో డ్రోన్లతో గాలిస్తున్నారు. బాలిక హత్యకు సంబంధించిన వివరాలను పోలీసులు రెండు రోజుల్లో వెల్లడించబోతున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచే సమయంలో పిట్ ఎన్డీపీఎస్ వివరాలను సమర్పించాలని పోలీసులు యోచిస్తున్నారు. పిట్ ఎన్డీపీఎస్‌కు సంబంధించి ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చింది. బాలిక హత్య కేసులో ఇప్పటి వరకు జరిగిన దర్యాప్తులో తండ్రి పాత్ర మాత్రమే తేలినట్టు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. బాలికను హత్య చేసే సమయంలో మొదటి భార్య, ఆమె ఐదుగురి కుమార్తెలు ఉన్నట్టు తెలుస్తోంది. అందుకు సంబంధించిన ఆధారాలు లభించలేదని పోలీసులు చెబుతున్నారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న మునేరు

మునేటికి వరద ప్రవాహం

పెనుగంచిప్రోలు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో మునేటికి గురువారం రాత్రి నుంచి వరద ప్రవాహం పెరుగుతోంది. దీంతో తిరుపతమ్మ దేవస్థానం వద్ద మునేటిలో దిగకుండా రహదారిని మూసివేశారు. భక్తులు అటువైపు వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు. తహసీల్దార్ ఎ.శాంతి లక్ష్మి ఆధ్వర్యంలో పోలీసులు, రెవెన్యూ సిబ్బంది అప్రమత్తమయ్యారు.

దసరా ఉత్సవాల ఏర్పాట్లు ముమ్మరం 6

అదుపులో డయేరియా!

న్యూరాజరాజేశ్వరిపేటలో డయేరియా పరిస్థితి అదుపులోనే ఉంది. కానీ అక్కడక్కడ సంభవిస్తున్న కొత్త కేసులు స్థానికులను కొంత కలవర పెడుతున్నాయి. శుక్రవారం తాజాగా మరో వ్యక్తి మృతి చెందాడు. అయితే ఈ మరణాలకు డయేరియాకు సంబంధం లేదని వైద్యాధికారులు స్పష్టం చేస్తున్నారు. స్థానికులు మాత్రం వారు వాంతులు, విరేచనాలతో చనిపోయారని అంటున్నారు. తాజా మరణానికి డయేరియా కారణం కాదని, అతిగా మద్యం తాగడం వల్లేనని వైద్యులు పేర్కొంటున్నారు.

న్యూరాజరాజేశ్వరిపేటలో తగ్గిన తీవ్రత

చనిపోయిన మరో వ్యక్తి

- డయేరియా కాదంటున్న అధికారులు
- 483 నీటి శాంపిళ్లలో కనిపించని కలుషితం
- ఇంకా రాని బయాలజీ, బ్యాక్టీరియాలజీ నివేదిక



న్యూరాజరాజేశ్వరిపేటలో చికిత్స పొందుతున్న బాధితులు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ): న్యూరాజరాజేశ్వరిపేటలో శుక్రవారం పెద్దగా కొత్త కేసులు నమోదు కాలేదు. అయితే పరిస్థితి అదుపులో ఉందనుకుటున్న సమయంలో మరొకరు చనిపోయారు. మసీదు ప్రాంతానికి చెందిన గద్వాల నరసింహ వీధుల్లో బ్యానర్లు కట్టే పని చేస్తుంటాడు. ఆయన కుటుంబం వేరే ఊరు వెళ్లడంతో ఆయన ఒక్కడే ఇంట్లో ఉంటున్నాడు. రెండు రోజులుగా నరసింహారావు వాంతులు, విరేచనాలతో బాధపడుతూ ఇంట్లోనే ఉండిపోయాడు. కుటుంబ సభ్యులు ఊరి నుంచి శుక్రవారం వచ్చి చూసే సరికి ఆయన చాలా నీరసంగా కనిపించాడు. అతడిని వెంటనే కేర్ అండ్ షేర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి తరలించారు. ఇక్కడి సిబ్బంది ప్రాథమిక వైద్యంజేసి ఉన్నత చికిత్స కోసం అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయాడు. వైద్యాధికారులు మాత్ర అతడు డయేరియా లక్షణాలతో చనిపోలేదని చెబుతున్నారు. తీవ్రంగా మద్యం తాగడం వల్ల ప్రాణాలు కోల్పోయాడని స్పష్టం చేస్తున్నారు. డయేరియా మొదలైన తర్వాత ఇద్దరు చనిపోయారు. ఆ మరణాలకు కూడా డయేరియాతో ఎలాంటి సంబంధం లేదని అధికారులు ఇప్పటికే ప్రకటించారు. మంత్రులు సత్యకుమార్ యాదవ్, నారాయణ న్యూఆర్ఆర్ పేట ప్రాంతంలో పర్యటించి స్థానికులకు భరోసా ఇచ్చారు. అధికారులు, ప్రజాప్రతినిధులు భరోసా ఇస్తున్నప్పటికీ అక్కడ జరుగుతున్న పరిణామాలతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. ప్రభుత్వాస్పత్రిల్లో ప్రస్తుతం 72 మంది చికిత్స పొందుతున్నారు. వారిలో 13 మందిని శుక్రవారం ఇళ్లకు పంపించారు. పాత ప్రభుత్వాసుపత్రిలో తొమ్మిది మంది, మిగతా 6లో..

అటకెక్కిన విచారణ!

తాడిగడప మున్సిపాల్టీలో గతంలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

- ఫ్లాట్ల కొనుగోలుదారుల నుంచి భారీగా అపరాధ రుసుము వసూలు
- వైసీపీ హయాంలో జరిగిన అక్రమాలపై ఫిర్యాదు చేసిన బాధితులు
- పూర్వ కమిషనర్లపై విచారణకు ఆదేశించిన కూటమి ప్రభుత్వం
- విచారణాధికారిని నియమిస్తూ జీవో జారీ
- ఇప్పటి వరకు విచారణకు రాని అధికారి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): తాడిగడప పురపాలక సంఘంలోని టౌన్ ప్లానింగ్ విభాగం పరిధిలో జరిగిన అవినీతి వ్యవహారాలపై విచారణ ఇంకా పెండింగ్‌లోనే ఉంది. అక్రమాలపై వచ్చిన ఫిర్యాదులతో పూర్వ మునిసిపల్ కమిషనర్లపై శాఖాపరమైన విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించి నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు విచారణ జరగలేదు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తాడిగడప పురపాలక సంఘంలోని టౌన్ ప్లానింగ్ విభాగం నిబంధనలను మీరి అడ్డగోలుగా అనధికారిక కట్టడాలకు అనుమతులు ఇచ్చింది. సాధారణంగా 450 చదరపు గజాల స్థలంలో స్టిల్ట్ + గ్రౌండ్ + నాలుగు అంతస్తులకు అనుమతులు ఇస్తారు. కానీ 200 - 250 చదరపు గజాల లోపు ఉన్న స్థలాలకు కూడా అపార్ట్‌మెంట్ల తరహాలో స్టిల్ట్ + గ్రౌండ్ + నాలుగు అంతస్తులకు



అనుమతులు ఇచ్చేశారు. ఇలా అనధికారికంగా అనుమతులు ఇవ్వటం ఒక ఎత్తు అయితే.. వీటిలోని ఫ్లాట్లను కొనుగోలు చేసిన బాధితులను లక్ష్యంగా చేసుకుని బీపీఎస్ అమల్లో లేకపోయినా.. కొనుగోలుదారుల నుంచి అపరాధ రుసుమును వసూలు చేశారు. ఈ అపరాధ రుసుమును కూడా ఆస్తి పన్నులో కలిపి వసూలు చేశారు. వీటిపై కొందరు బాధితులు కూటమి ప్రభుత్వం వచ్చాక సాక్ష్యాధారాలతో సహ మిగతా 6లో..

మీరే తేల్చుకోండి!

తహసీల్దార్ల అడ్‌హక్ పదోన్నతులపై కృష్ణా డీఆర్వో ఆఫర్!

- రెగ్యులర్ డీటీలు, ప్రొబేషనరీ డీటీల మధ్య చర్చలు ప్రారంభం
- 70-30 విధానంలో కేటాయింపునకు ఒప్పందం!
- రెగ్యులర్ డీటీలకు 16 పోస్టులు, ప్రొబేషనరీ డీటీలకు 4 పోస్టులు కేటాయించే అవకాశం
- ఆ ఒప్పందాన్ని వ్యతిరేకిస్తున్న పలువురు రెగ్యులర్ డీటీలు

తహసీల్దార్ల అడ్‌హక్ పదోన్నతులపై మీరే తేల్చుకుని రావాలంటూ రెగ్యులర్ డిప్యూటీ తహసీల్దార్‌లు, ప్రొబేషనరీ డిప్యూటీ తహసీల్దార్‌లకు కృష్ణాజిల్లా రెవెన్యూ యంత్రాంగం ఆఫర్ ఇచ్చింది. ఈ మేరకు కృష్ణా డీఆర్వో రెండు వర్గాలకు సూచించారు. రెవెన్యూలో తహసీల్దార్ల ఖాళీల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అడ్‌హక్ పదోన్నతులు ఇస్తున్నప్పటికీ ఉమ్మడి కృష్ణాజిల్లాలో మాత్రం ఇవి జరగటం లేదు. దీనిపై 'ఆంధ్రజ్యోతి' ఇటీ వల ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దీనిపై కృష్ణాజిల్లా రెవెన్యూ యంత్రాంగంలో కదలిక వచ్చింది. ఇరువర్గాలు ఒక ఒప్పందానికి వస్తే అడ్‌హక్ పదోన్నతులు కల్పించేందుకు సిద్ధమైంది.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఉమ్మడి కృష్ణాజిల్లాలో మొత్తం 20 మంది తహసీల్దార్ల కొరత ఉన్న నేపథ్యంలో 23 మంది రెగ్యులర్ డీటీలు, 18 మంది పీడీటీలు అడ్‌హక్ పదోన్నతుల కోసం పోటీ పడుతున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లా జోన్ - 2 పరిధిలో ఉంది. ఉమ్మడి కృష్ణాతో పాటు పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాలు కూడా ఉన్నాయి. జోన్ - 2 పరిధిలో సీసీఎల్ఏ సీనియారిటీ జాబితా ప్రకారం చూస్తే రెగ్యులర్ డీటీలే ఉన్నారు. దీంతో పీడీటీలు కోర్టు మెట్లెక్కారు. దీనిపై స్టే వస్తే ఎటూ తేల్చని పరిస్థితి ఏర్పడుతోంది. 'ఆంధ్రజ్యోతి' కథనం నేపథ్యంలో కృష్ణాజిల్లా డీఆర్వో ఉభయ వర్గాలను పిలిచి.. అడ్‌హక్ పదోన్నతులు ఇవ్వటానికి అంగీకారం మిగతా 6లో..

ప్రాణాలు నిలిపే 'ప్రథమ చికిత్స'
నేడు ఫస్ట్ ఎయిడ్ డే సందర్భంగా ప్రత్యేక కథనం 6

ఉల్లితో అక్రమ వ్యాపారం
రైతు బజారు ఎస్టేట్ అధికారులు, మార్కెటింగ్ శాఖ అధికారుల నిర్వాకం 8

ప్రజారోగ్య పరిరక్షణకు చిత్తశుద్ధితో పనిచేస్తాం
మంత్రి సత్యకుమార్ యాదవ్

పవన్‌కల్యాణ్‌పై వైసీపీ కార్యకర్త అనుచిత వ్యాఖ్యలు

● ఆర్ఎంపీ ఇంటి వద్ద జనసైనికుల ధర్నా
● సత్రంపాలెంలో ఉద్రిక్తత ● ఇరువర్గాలపై కేసులు నమోదు

మచిలీపట్నం క్రైమ్ సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై వైసీపి కార్యకర్త, ఆర్ఎంపీ గిరిధర్ అనుచిత వ్యాఖ్యలు చేయడంతో బందరు మండలం సత్రంపాలెంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. జనసైనికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆర్ఎంపీ ఇంటి వద్ద ధర్నా చేసి, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆర్ఎంపీ గిరిధర్‌కు మాజీ మంత్రి పేర్ని నాని మద్దతు తెలిపారు. డాక్టర్‌పై జనసైనికులు దాడి చే యడాన్ని పేర్ని ఖండించారు. డీఎస్పీతో పేర్ని ఫోన్‌లో మాట్లాడారు. అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు డాక్టర్‌పై, దురుసుగా ప్రవర్తించి నం దుకు జనసై నికులపై పోలీసులు కేసులు నమోదు చేశారు.

అబ్బురపరుస్తున్న 11 అడుగుల బెండ చెట్టు



పటమట, సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి) : సాధారణంగా బెండ చెట్లు నాలుగు, ఐదు అడుగులు పెరిగి కాపునిస్తాయి. అశోక్‌నగర్ కొల్లి రామచంద్ర రావు వీధిలో నివసిస్తున్న సీని యర్ సిటిజన్ కొండపల్లి మాధ వరావు ఇంటి ఆవరణలో మాత్రం బెండ చెట్టు సుమారు 11 అడుగులు పెరిగి అబ్బుర పరుస్తోంది. కాపు వచ్చినప్పు డల్లా కిలో వరకు బెండకా యలు కాస్తోంది. అరుదులైన బెండ చెట్టును చూసి స్థాని కులు ఆశ్చర్యానికి లోనవుతున్నారు. ఆయన తనకున్న 200 గజాల ఖాళీ జాగాలో అరటి, నిమ్మ, దానిమ్మ లాంటి మొక్కను పెంచి వ్యవసాయంపై తనకున్న మక్కువను చాటుకున్నారు.

గెజిటెడ్ ఆఫీసీర్స్ ఎంప్లాయిమెంట్ విభాగం ఎన్నికలు నేడు

భారతీనగర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అసోసియేషన్ ఆఫ్ గెజిటెడ్ ఆఫీసర్స్, ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ డిపార్ట్‌మెంట్ (ఎంప్లా యిమెంట్ వింగ్) సంఘం రాష్ట్ర స్థాయి ఎన్నికలు శనివారం నిర్వహి స్తున్నట్లు ఎన్నికల అధికారి తోట కృష్ణ కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎన్నికలకు సంబంధించి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నామినేషన్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 3.30 నిమిషాల వరకు నామి నేషన్ల ఉప సంహరణ, అనంతరం సాయంత్రం గం.4.30 నిమిషాలకు ఎన్నికలు జరు గుతాయన్నారు. సాయంత్రం గం. 5.30 నిమిషాలకు కౌంటింగ్ నిర్వ హించి ఫలితాలు ప్రకటిస్తామన్నారు.



ఇంద్రకీలాద్రిపై వాటర్ ప్రూఫ్ టాప్‌ల నిర్మాణ పనులు



ఘాట్ రోడ్డులో క్యూలైన్ల నిర్మాణం



ఫ్లై ఓవర్ కింద పనులు పర్యవేక్షిస్తున్న ఏసీపీ దుర్గారావు

దసరా ఉత్సవాల ఏర్పాట్లు ముమ్మరం

● శరవేగంగా పనులు ● షెడ్ల నిర్మాణం, బారికేడ్ల ఏర్పాట్లు

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానంలో నిర్వహించే దసరా మహోత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఉపరితల ఆవర్తనం కారణంగా రెండు మూడు రోజుల్లో వానలు పడకుం టే ఇంతకుముందు అధి కారులు చెప్పినట్లుగా ఈనెల 15 నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యే అవకాశం ఉంది. షెడ్ల పనులు రెండు మూడు రోజుల్లో పూర్తి కానున్నాయి. కొండ దిగు వన, కొండ ఎగువన బారికేడ్ల ఏర్పాటు ముమ్మరంగా జరుగుతోంది. కెనాల్ రోడ్డు లోని వినాయకుడి గుడి నుంచి క్యూలు ప్రారంభమవుతాయి. మూడు లైన్లుగా బారికేడ్లను అమర్చారు. భక్తులకు ఒత్తిడి లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. వాటర్ ప్రూఫ్ టాప్‌లను వేయా ల్సి ఉంది. సీత మ్మవారి పాదాల వద్ద ఏర్పాటు చేస్తున్న తాత్కాలిక కేశఖండనశాల షెడ్లు, భక్తులు వేచి ఉండే ఏరియాల్లో షెడ్లు, కనకదుర్గానగర్‌లో ఇంకా మరికొన్ని పనులు, రోడ్లు, స్థలాల చదును పనులను యుద్ధప్రాతిప దికన చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.



భక్తుల రద్దీని నిలువరించేందుకు పూల మార్కెట్ పక్కన ఖాళీ స్థలాన్ని చదును చేయిస్తున్న దేవస్థానం సిబ్బంది

కొండ దిగువన, కొండ ఎగువన విద్యుద్దీక రణ పనులు పూర్తి కావాల్సి ఉంది. అన్న ప్రసాదాల తయారీ పోటు, లడ్డూ ప్రసా దాల తయారీ పోటు, తదితరాలు పూర్తి కావాల్సి ఉంది. యాగశాల ఏర్పాట్లు పూర్తి కావస్తున్నాయి. ఇప్పటి వరకు 70 శాతం పనులు పూర్తి అ య్యాయని సమాచారం. వాతావరణంలో మార్పులు లేకుండా ఉంటే మిగతా పనులు రానున్న రెండు, మూడు రోజుల్లో పూర్తయ్యే అవకాశం ఉంది. ఈ దసరాకు కిందటి సంవత్సరం కంటే ఎక్కువ మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. దేవస్థానంలో దసరా సందర్భంగా నిర్వహించే పూజలకు సంబంధించిన రుసుముల విష యంలో ఇంకా స్పష్ట త రాలేదు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, పోలీ సు కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు, కమిషనర్ ధ్యానచంద్ర పనులను పరిశీలించారు.



దసరా పనుల కాంట్రాక్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

దసరా పనుల్లో నాణ్యత పాటించాలి : కలెక్టర్ లక్ష్మీశ

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : దసరా పనుల్లో నాణ్యత పాటించా లని, అలసత్వం వహించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎన్టీఆర్ కలె క్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. తన కార్యాలయంలో శుక్రవారం దుర్గగుడి ఈవో, ఇంజనీ రింగ్ అధికారులు, దసరా మహోత్సవాల పనుల కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. భక్తులకు చేసే ఏర్పాట్లు విషయంలో ఎలాంటి అలసత్వం వహించవద్దన్నారు. భక్తితో పని చేయాలని, నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. సమన్వ యంగా పనిచేసి దసరా ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించడానికి దోహదపడా లన్నారు. ఫిర్యాదులు లేదా సమస్యలు ఉంటే నేరుగా ఈవో, దేవదాయశాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువస్తే తక్షణమే చర్యలు తీసుకుని పరిష్కరిస్తామన్నారు.

నారికంపాడు భూమి దేవుడిమాన్యం కాదు

● అబద్ధపు రాతలతో విషం చిమ్ముతోన్న జగన్ పత్రిక
● తప్పుడు కథనాలపై ఎమ్మెల్యే కొలికపూడి ఖండన



తిరువూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జగన్ పత్రిక తప్పుడు కథనాలతో అసత్యాలతో ప్రజల్ని గందరగోళానికి గురి చేస్తూ విషం చిమ్ముతోందని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు విమర్శించారు. క్యాంప్ కార్యాలయంలో శుక్ర వారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం నారికంపాడులో 1036 ఎక రాల దేవుడి భూమి నిషేధిత జాబితా నుంచి తొలగించి కూటమి నాయకులు ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నా రంటూ జగన్ పత్రికలో వచ్చిన కథనాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. నారికింపాడులోని భూములు దేవుడి మాన్యం కాదని, భూ సంస్కరణల చట్టం ద్వారా జమిందారీ భూ ముల్ని పట్టాలుగా ఇచ్చారన్నారు. నారికంపాడు ప్రాంతం గతంలో జమిందారీ పాలనలో ఉండేదన్నారు. రాష్ట్రం ఏర్ప డిన తర్వాత భూసంస్కరణల చట్టాల్లో భాగంగా, జమిం దారీ వ్యవస్థను రద్దు చేశారన్నారు. నారికంపాడులో ఉన్న1036 ఎకరాల జమిందారీ భూముల్ని అప్పట్లో సాగుచే సుకుంటున్న వారికే రైతువారీ పట్టాలు ఇచ్చారన్నారు. 2014లో రాష్ట్ర విభజన అనంతరం 1036 ఎకరాల్లో దాదాపు 500 ఎకరాలు ఖమ్మం జిల్లా పరిధిలోకి వెళ్లాయన్నారు. ప్రస్తుతం నారికంపాడు వద్ద ఉన్న 532 ఎకరాలు దేవుడి మాన్యం కాదని, రైతుల పట్టాభూములు మాత్రమే అన్నారు. గతంలో 1036 ఎకరాలు రైతులకు పట్టాలు ఇచ్చేసమయంలో వినగడప వేణుగోపాలస్వామి ఆలయానికి ప్రతిసంవత్సరం ఎకరానికి ఒక్క రూపాయి చొప్పున రైతులు చెల్లించాలనే షరతు విధించారన్నారు. ఆ నిబంధనల ప్రకారం 2014 వరకు ప్రతి సంవత్సరం జిల్లా కలెక్టర్ ద్వారా రూ.1036 ఆలయానికి చెల్లించే వారన్నారు. 2016లో కృష్ణాజిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహించిన ప్రభాకరరెడ్డి ఈ 1036 ఎకరాల భూముల్ని హోల్డ్‌లో పెట్టి, భూముల రిజిస్ట్రేషన్లు నిలుపు చేశారన్నారు. నాటినుంచి ప్రజలు తమ భూముల్ని నిషేధిత భూముల జాబితా నుంచి తొల గించాలని కోరుతూ వస్తున్నారన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం 532 ఎకరాల భూమిని నిషేధిత జాబి తా నుంచి తొలగించాలని దేవదాయ మంత్రి, రెవెన్యూ మంత్రిని కలిసి విజ్ఞప్తి చేయగా, సమస్య పరిష్కారం దిశగా కలెక్టర్ చర్యలు తీసుకుంటున్నారన్నారు. దీనిపై జగన్ పత్రిక బురద జల్లే కుట్రకు పూనుకుందన్నారు. నారికం పాడు ప్రాంతంలో రైతులతో శనివారం సమావేశం నిర్వహి స్తానని తెలిపారు. రాజవరపు శ్రీనివాసరావు, వాకదాని లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

అమరావతిపై జగన్ కుట్రలు మళ్లీ మొదలయ్యాయి!

● మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు



గొల్లపూడి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అమరావతి పై జగన్ కుట్రలు మళ్లీ మొదలయ్యా యని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. గొల్లపూ డిలో శుక్రవారం ఆయన విలేకరు లతో మాట్లాడారు. ప్రజా రాజధాని అమరావతిపై జగన్ రెడ్డి కుట్రలు మొదలు పెట్టా రని ఆరోపించారు. జగన్ అనుచరులు సజ్జల రామకృష్ణారెడ్డి, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిల ద్వారా అసలు కుట్రలు బయట పడుతున్నాయన్నారు. జగన్‌రెడ్డి ఆధ్వర్యంలో మరోసారి అమరావతిపై అసత్య ప్రచారాలు, దుష్ప్రచారాలు జరుగుతు న్నాయన్నారు. అమరావతి రైతులపై పెట్టిన కేసులు, మహిళలపై చేసిన దాష్టీకాలు ప్రజలు ఇంకా మరచిపోలేదన్నారు. మూడు ముక్కలాటతో రాష్ట్రాన్ని చీల్చాలని కుట్రలు చేసి, అభివృద్ధిని వెనక్కి నెట్టిన వారికి అమరావతి గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. ప్రజలు తిరస్కరించిన నేత తిరిగి మళ్లీ ఏ ముఖం పెట్టుకొని రాజధాని గురించి మాట్లాడతారని ప్రశ్నించారు. ఎన్ని కుట్రలు చేసినా, అమరావతిని ప్రజల రాజధానిగా, విశాఖను ఐటీ హబ్‌గా, రాయలసీమను అగ్రికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దే బాధ్యత చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమికే చెల్లుతుందన్నారు.

మీరే తేల్చుకోండి!

(5వ పేజీ తరువాయి)

తెలిపారు. అడ్‌హక్ పదోన్నతులు ఇవ్వాలంటే ఉభయ వర్గాలు ఒక అవ గాహనకు రావాల్సిందిగా సూచించారు. అడ్‌హక్ పదోన్నతులకు సంబం ధించి 50 - 50 లేదా 70 - 30 విధానంలో మీ మధ్య ఆమోదయోగ్యమైన ఒప్పందం చేసుకుని రావాల్సిందిగా ఆఫర్ ఇచ్చారు. దీనిపై పీడీటీలు సుము ఖంగానే ఉన్నా.. రెగ్యులర్ డీటీలు మాత్రం తర్జన భర్జనలు పడుతున్నారు. రెగ్యులర్ డీటీలు మొత్తం 23 మంది ఉన్నారు. సీసీఎల్ఏ సీనియారిటీ జాబితా ప్రకారం చూసినా వీరిలో 20 మందికే అడ్‌హక్ పదోన్నతులు వస్తాయి. ముగ్గురు వేచి చూడాల్సి వస్తోంది. పూర్తిగా అందరికీ పదోన్న తులు రావు. దీనిని దృష్టిలో పెట్టుకుని రెగ్యులర్ డీటీలు, పీడీటీలతో సమా వేశమై 70 - 30 విధానంలో అడ్‌హక్ పదోన్నతులను పంచుకుందామని లోపాయికారీగా ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. రెగ్యులర్ డీటీలు 23 మందిలో ముగ్గురు అడ్‌హక్ పదోన్నతులను స్వీకరించబోమని.. తమకు నేరుగా ప్రమోషన్లు వచ్చినపుడే స్వీకరిస్తామని చెప్పటంతో ప్రస్తుతం 20 మందే రంగంలో ఉన్నారు. ఈ 20 మందిలో మరో నలుగురు పీడీటీలతో 70 - 30 ఒప్పందాన్ని వ్యతిరేకిస్తున్నారు. దీనిని కనుక అంగీకరిస్తే నలుగు రికి పదోన్నతులు రావు. పీడీటీలతో కుదుర్చుకున్న 70 - 30 ఒప్పందం ప్రకారం చూస్తే 20 రెగ్యులర్ డీటీలలో 16 మందికి మాత్రమే అవకాశం లభిస్తుంది. పీడీటీల విషయానికి వస్తే మొత్తం 18 మంది అడ్‌హక్ పదోన్న తుల కోసం ఎదురుచూస్తున్నారు. వీరిలో నలుగురికి మాత్రమే పదోన్నతు లకు అవకాశం కలుగుతుంది. రెగ్యురల్ డీటీలు నలుగురు 70-30 ఒప్పం దాన్ని వ్యతిరేకిస్తుండటంతో .. ప్రస్తుతం అడ్‌హక్ పదోన్నతులకు అడ్డంకిగా మారింది. ఈ కారణం చేత నలుగురు రెగ్యులర్ డీటీలను బుజ్జగించే ప్రయ త్నాలు చేస్తున్నారు. ఇవి కనుక ఒక కొలిక్కి వస్తే .. అడ్‌హక్ పదోన్నతులకు లైన్ క్లియర్ అవుతుంది. ప్రస్తుతం వారిని బుజ్జగించే పనిలో రెగ్యులర్ డీటీలు ఉన్నారు.

జాప్యం జరిగే అవకాశం!

కృష్ణాజిల్లా రెవెన్యూ యంత్రాంగం తీసుకుంటున్న చర్యలు మంచివే అయినప్పటికీ.. అడ్‌హక్ పదోన్నతులలో ఉభయులను ఒప్పందం చేసుకో మనటం వివాదాస్పదంగా మారుతోంది. రెగ్యులర్ పదోన్నతులకు సంబం ధించి ఉభయుల మధ్యన వివాదం నడుస్తోంది. ఈ వివాదం తేలే వరకు రెగ్యులర్ పదోన్నతులు ఇవ్వకపోయినా ఇబ్బంది ఉండదు. కానీ ప్రజల సమస్యలను దృష్టిలో పెట్టుకుని అవసరాలరీత్యా వేసే అడ్‌హక్ పదోన్నతు లకు సంబంధించి నిర్ణయం తీసుకునే విషయంలో ఉభయ పక్షాలను పిలి పించాల్సిన అవసరం లేదన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి. ఏది ఏమై నప్పటికీ ఉభయులను మాట్లాడుకుని రావాల్సిందిగా ఇచ్చిన ఆఫర్ మంచిదే అయినా.. వాళ్ల మధ్య సంధి కుదరకపోతే మాత్రం అడ్‌హక్ పదోన్నతులు జాప్యమయ్యే అవకాశాలు ఉన్నాయి.

అదుపులో డయేరియా!

(5వ పేజీ తరువాయి)

కొత్త ప్రభుత్వాసుపత్రిలో 53 మంది ఉన్నారు. వారిలో 25 మందిని శనివారం ఇళ్లకు పంపిస్తా మని ఆసుపత్రి అధికారులు చెబుతున్నారు.

ఆ రెండు నివేదికలే కీలకం

న్యూఆర్ఆర్ పేటలో ప్రస్తుతం ఉన్న పరిస్థితికి కారణం ఏమిటన్నది ఇంకా తెలియలేదు. నీటి ద్వారా వచ్చిన వైరస్ కారణంగా ఈ పరిస్థితి వచ్చిందని భావిస్తున్నప్పటికీ అందుకు తగిన ఆధా రాలు లభించలేదు. అధికారులు న్యూఆర్ఆర్‌పేటలో మొత్తం 485 నీళ్ల శాంపిల్స్‌ను సేకరించారు. వాటిలో 483 శాంపిల్స్‌కు సంబంధించిన నివేదికలు వచ్చాయి. అవన్నీ నెగిటివ్ అని వచ్చాయి. ఇంకా మరో రెండు శాంపిళ్ల పరీక్షల నివేదికలు రావాల్సి ఉంది. దీంతోపాటు బయాలజీ, బ్యాక్టీరియా లజీ పరీక్షల నివేదికలు రావాల్సి ఉంది. ఈ రెండు నివేదికల్లో ప్రస్తుత పరిస్థితికి సంబంధించిన కారణం తెలియవచ్చని అధికారులు భావిస్తున్నారు. మరోపక్క అధికారులు న్యూఆర్ఆర్‌పేటలో ఇంటింటికి వెళ్లి ఆరోగ్య సర్వే చేయిస్తున్నారు. ఇంట్లో ఎంతమంది నివసిస్తున్నారు, వారికి ఎలాంటి లక్షణాలు ఉన్నాయి వంటి వివరాలను సిబ్బంది తెలుసుకుంటున్నారు. కేర్ అండ్ షేర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి శుక్రవారం మొత్తం 150 మంది వచ్చారు. వారిలో 45 మందికి లక్ష ణాలు ఉన్నట్టు గుర్తించారు. న్యూఆర్ఆర్‌పేట పక్క నుంచే బుడమేరు వాగు ప్రవహిస్తోంది. వాస్త వానికి ఒకప్పుడు ఇది చాలా స్వచ్ఛంగా ఉండేది. చుట్టూ జనావాసాలు పెరిగిన తర్వాత స్వచ్ఛతను కోల్పో యింది. ఈ బుడమేరులో ఉన్న మురుగు భూగర్భ జలాల్లోకి ప్రవేశించడం ద్వారా ఈ పరి స్థితి వచ్చిం దా అన్న కోణంలో పరీక్షలు చేయించబోతున్నారు. ఇదే విషయాన్ని మంత్రులు ప్రజ లకు చెప్పారు.

భూగర్భ జలాలు కలుషితమయ్యాయా అనే కోణంలో పరిశీలిన



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న మంత్రి సత్యకుమార్

అజిత్‌సింగ్‌నగర్ : డయేరియాకు కారణం బుడమేరు కారణంగా భూగర్భ జలాలు కలుషిత మయ్యాయా అనే కోణంలో పరిశీలన చేస్తున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, మున్సిపల్ మంత్రి నారాయణ అన్నారు. న్యూ రాజరాజేశ్వరిపేటలోని కేర్ అండ్ షేర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని మంత్రులు సత్యకుమార్ యాదవ్, నారాయణ, ఎంపీ కేశినేని చిన్ని, కలెక్టర్ లక్ష్మీశా, నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రలు శుక్రవారం పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. న్యూ ఆర్ఆర్‌పేటలో ఇంటింటికి అందజేస్తున్న మినరల్ వాటర్ ప్రక్రియను పరిశీలించారు. న్యూ ఆర్ఆ ర్‌పేటలో ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని ప్రభుత్వ పరంగా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుం టున్నామని చెప్పారు. మంచినీటి శ్యాంపిళ్లను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించామన్నారు. ప్రతి ఇంటిని సర్వే చేసి మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్నామని తెలియజేశారు. నేతలు ఎరుబోతు రమణారావు, నవనీతం సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

నియంత్రణలో కేసులు : కలెక్టర్ లక్ష్మీశ

న్యూ రాజరాజేశ్వరిపేటలో డయేరియా కేసు లు నియంత్రణలో ఉన్నాయని, ప్రత్యే వైద్య బృం దాల పర్యవేక్షణలో బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. న్యూ రాజరాజేశ్వరిపేటలోని కేర్ అండ్ షేర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని, నగరంలోని ప్రభుత్వాసుపత్రిలో డయేరియా లక్షణాలతో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు వైద్య చికిత్స తీరును ఆయన పరిశీలించారు. న్యూ ఆర్ఆర్‌పేటలో తాగునీటి సరఫరా ప్రక్రియను తనిఖీ చేశారు. కలెక్టర్ లక్ష్మీశా మా ట్లాడుతూ వైద్య అందించేందుకు తగిన సిబ్బంది, మందులు, ఇతర సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. సమస్యకు కారణం తెలుసుకునేందుకు బ్యాక్టీరియాతో పాటు వైరల్, ఫంగల్ పరీక్షలు చేస్తున్నట్లు వివరించారు. మినరల్ వాటర్‌ను ఇంటింటికి పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్ నెం 9154970454 సంప్రదించాల్సిందిగా తెలిపారు.

ప్రాణాలు నిలిపే ప్రథమ చికిత్స

నేడు ఫస్ట్ ఎయిడ్ డే సందర్భంగా ప్రత్యేక కథనం

(ఇబ్రహీంపట్నం-ఆంధ్రజ్యోతి)

సారీ...సమయానికి తీసుకొచ్చి ఉంటే ప్రాణాన్ని కాపాడేవాళ్లం..., సమయానికి తీసుకురాబట్టే ప్రాణాలు కాపాడగలిగాం.. ఇలాంటి పదాలు తీవ్రంగా గాయాలు పాలైన రోగుల గురించి పలు సందర్భాల్లో వైద్యులు నోట వింటుంటాం. గాయాల పాలైన, సడన్‌గా అనారోగ్యానికి గురైన వారికి ప్రథమ చికిత్స (ఫస్ట్ ఎయిడ్) ఎంత అవసరమో వారి మాటలను చూస్తే అర్థం అవుతుంది. ఫస్ట్ ఎయిడ్ అంటే ఏమిటి? దాని ప్రాముఖ్యత ఏమిటో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈనెల 13న శుక్రవారం ఫస్ట్ ఎయిడ్ డేపై ప్రత్యేక కథనం

ఫస్ట్ ఎయిడ్ డే లక్ష్యం

1. అవగాహన పెంచడం : ఫస్ట్ ఎయిడ్ ప్రాముఖ్యతను తెలియజేయడం, అవగాహన పెంపొందించడం, ప్రాథమిక చికిత్సతో ప్రాణాలను ఎలా రక్షించాలో వివరించడం.
2. నైపుణ్యాలను నేర్పడం : ప్రజలకు ప్రథమ చికిత్స నైపుణ్యాలను నేర్పడం ద్వారా అత్యవసర సందర్భాల్లో ఆత్మ విశ్వాసంతో, సమర్థవంతంగా ప్రతి స్పందించడానికి సిద్ధం చేయడం.
3. జీవిత రక్షణ : ప్రమాదాలు లేదా అనారోగ్య పరిస్థితుల్లో తక్షణమే సరైన ప్రాథమిక చికిత్స అందించడం ద్వారా ప్రాణ నష్టం లేదా తదుపరి వచ్చే ఇబ్బందులను తగ్గించడం.
4. సామాజిక బాధ్యత: ప్రతి ఒక్కరూ సమాజంలో ఇతరుల జీవితాలను రక్షించడంలో భాగస్వామ్యం కలిగి ఉండేలా ప్రోత్సహించడం.



గుండె పోటుకు గురైన వ్యక్తికి ప్రాథమిక వైద్యం చేస్తున్న డాక్టర్

ఫస్ట్ ఎయిడ్ ఎందుకంటే.

అత్యవసర పరిస్థితులు ఎప్పుడైనా, ఎక్కడైనా సంభవిస్తాయి. ఫస్ట్ ఎయిడ్ చేయడం పట్ల అవగాహన ఉంటే ప్రమాద సమయలోఓ గాయపడిన వ్యక్తి జీవితాన్ని రక్షించవచ్చు. గాయం తీవ్రతను లేదా అనారోగ్యం తీవ్రతను తగ్గించవచ్చు. విద్యుదాఘాతం, గుండెపోటు, రక్త స్రావం, శ్వాస అవరోధం, కాలిన గాయాలు వంటి అత్యవసర పరిస్థితుల్లో నిర్దిష్టమైన ఫస్ట్ ఎయిడ్ చర్య చేయాలి.



ఫస్ట్ ఎయిడ్ నైపుణ్యం అవశ్యం

ఏ రోగికైనా, ప్రమాదాలకు గురైన వారికైనా ప్రథమ చికిత్స ఎంతో అవసరం. ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడేందుకు తొలిగా చేయాల్సిన పనే ఫస్ట్ ఎయిడ్. తక్షణం ఫస్ట్ ఎయిడ్ అందితే ప్రాణాపాయం నుంచి కాపాడుకునే వీలుంటుంది. ప్రతి ఒక్కరికీ ఫస్ట్ ఎయిడ్ నైపుణ్యం ఎంతైనా అవసరం.

- డాక్టర్ విజయ్‌కుమార్, ఇబ్రహీంపట్నం పట్టణ ఆరోగ్యకేంద్రం



అత్యవసర సమయంలో ఫస్ట్ ఎయిడ్ తప్పనిసరి

అత్యవసర సమయంలో ఫస్ట్ ఎయిడ్ ఎంతో అవసరం. గుండెపోటు వచ్చిన సమయంలో సీపీఆర్ చేసి వైద్యశాలకు తరలించవచ్చు. పాము కాటుకు గురైన వారికి ఫస్ట్ ఎయిడ్ చేసి విషం శరీరం మొత్తం పాకకుండా చేయవచ్చు. ఫస్ట్ ఎయిడ్ అనేది కేవలం వైద్య వృత్తిలో ఉన్న వారే కాదు, వలంటీర్లు చేయవచ్చు. జీవితాన్ని కాపాడేదాన్ని ఫస్ట్ ఎయిడ్ అంటారు.

- డాక్టర్ ప్రసన్నరాణి, జి.కొండూరు పీహెచ్‌సీ

ఓపెన్ అవినీతి!

(5వ పేజీ తరువాయి)

నిర్వహించటం వెనుక ఓ గ్యాంగ్ హస్తం ఉందన్నది ఆ తర్వాత కానీ బోధపడలేదు. ప్రైవేటు సంస్థల పరిధిలో నిర్వహించే ఓపెన్ స్కూల్స్‌కు, ఈ గ్యాంగ్‌కు మంచి సంబంధాలు ఉండేవి. వాటితో ఈ గ్యాంగ్‌కు ఇబ్బంది ఉండేది కాదు. ప్రభుత్వ స్కూళ్లలో, కాలేజీలలో నిర్వ హించే ఓపెన్ స్కూల్స్ విషయంలో మాత్రం తాము వేసిన వసూళ్ల ప్రణాళికకు అనుగుణంగా కృష్ణాజిల్లాలో నిర్వహించిన పరీక్షలను ఈ గ్యాంగ్ టార్గెట్‌గా చేసుకున్నట్టు తెలుస్తోంది. పథకం ప్రకారం ఉత్తీర్ణతా శాతం పడగొట్టిన తర్వాత ఈ గ్యాంగ్ నేతృత్వంలోనే జెడ్పీ పాఠశా లలు, ప్రభుత్వ కళాశాలల్లో మరికొన్ని స్టడీ సెంటర్లను ప్రారంభించారని తెలుస్తోంది. రెండు జిల్లాల్లో తాము ఏర్పాటు చేయించిన ఓపెన్ స్కూల్స్‌లో చేరిన వారికి పాస్ గ్యారంటీ అన్న హామీ ఇచ్చి తెర వెనుక వందలాది మందికి ఆఫర్ ఇచ్చి అడ్మిషన్లు ఇప్పించినట్టు తెలు స్తోంది. ఇలా అడ్మిషన్లు పొందిన వారి నుంచి ఒక్కొక్కరి దగ్గర వేలాది రూపాయలను వసూలు చేసినట్టు తెలుస్తోంది. తమ ఆఫర్ల ద్వారా అడ్మిషన్లు పొందిన విద్యార్థులను పాస్ చేయించటానికి విద్యాశాఖ అధికారుల కార్యా లయంలోని కొందరు అధికారులతో తమకు ఉన్న సన్నిహిత పరిచయాల కారణంగా ప్రభుత్వ పాఠశాలల టీచర్లను, హెచ్ఎంలను పరీక్షల సూ పరింటెండెంట్లుగా, ఇన్విజిలేటర్లుగా నియమించ టంలో సఫలీకృ తమైనట్టు సమాచారం. వీరి ద్వారా పరీక్షలలో మాస్ కాపీయింగ్ చేయించి 99 శాతం ఉత్తీర్ణత తీసుకువచ్చారని తెలిసింది. అసలు అభ్యర్థుల బదులు నకిలీ అభ్యర్థులతో కూడా పరీక్షలు రాయించినట్టు సమాచారం. ఈ వ్యవహారాలను గత మూడు సంవత్సరాలుగా గుట్టుగా నడిపిస్తున్నారని, ఈ పేరుతో రూ.10 కోట్ల వరకు వసూలు చేశారని తెలుస్తోంది.

అటకెక్కిన విచారణ!

(5వ పేజీ తరువాయి)

ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రభుత్వం గతంలో పనిచేసిన మునిసిపల్ కమిషనర్లు ముగ్గురుపై శాఖాపరమైన విచారణకు ఆదేశించింది. ఏకంగా విచారణాధికారిగా డీటీసీపీలో పనిచేసే జీవీజీఎ సీ ప్రసాద్ అనే అధికారిని విచారణాధికారిగా నియమించింది. నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఆయన తాడిగడప మునిసిపాలిటీకి వచ్చి పరిశీలించింది లేదు. విచారించింది లేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణాధికారి కనీసం తెలుసుకునే ప్రయత్నం కూడా చేయలేదు. దీనిపై ఫిర్యాదుదారులు ఆ విచారణాధికారి దగ్గరకు వెళ్లి అడగ్గా తనను విచారణ అధికారిగా నియమించినట్టు కాపీ రాలేదని చెప్పటం సంచలనం సృష్టిస్తోంది. ప్రభుత్వం జీవో జారీ చేసిన తర్వాత.. సదరు విచారణాధికారికి ఎందుకు కాపీ వెళ్లలేదో అర్థం కాని విషయంగా మారింది. తనకు కాపీ వచ్చినా ఉద్దేశ్యపూర్వకంగా విచారణాధికారి పక్కన పెట్టాడా అన్న ఆరోపణలు కూడా వస్తున్నాయి. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని విచారణాధి కారి నుంచి వివరణ తీసుకోవాల్సిన అవసరం ఉంది.

12 బార్‌లు లాటరీ పద్ధతిన కేటాయింపు 18న

మచిలీపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లాలోని 12 బార్ అండ్ రెస్టారెంట్‌లకు ఈనెల 18వ తేదీన కలెక్టరేట్‌లో లాటరీ పద్ధతిన కేటాయించడం జరుగుతుందని ఎక్సైజ్ విభాగం సూపరింటెండెంట్ జి గంగాధరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17వ తేదీ సాయంత్రం 6గంటల వరకు బార్ అండ్ రెస్టారెంట్లకు దరఖాస్తుల స్వీకరించనున్నట్లు ఆయన తెలిపారు. గుడివాడలో 6, మచిలీపట్నంలో 4, పెడన పురపాలకసంఘంలో ఒకటి, మంగినపూడిలో ఒకటూరిజం బార్‌కు దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందన్నారు. మచిలీపట్నం, గుడివాడలలోని బార్‌లకు ఏడాదికి రూ.55 లక్షలు, పెడన, మంగినపూడిలోని టూరిజం బార్‌లకు ఏడాదికి రూ.35 లక్షల చొప్పున లైసెన్స్‌ఫీజుగా నిర్ణయించినట్లు తెలిపారు. వివరాలకు జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్ 140,149, 160
చికెన్ విత్ స్కిన్ 268
చికెన్ స్కిన్‌లెస్ 278
నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 545

వాతావరణ పరిస్థితులపై చిత్రలేఖనం పోటీలు

పటమట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఓజోన్ దినం సందర్భంగా గోరా సైన్స్ సెంటర్ ఆధ్వర్యంలో విజయవాడ నాస్తిక్ కేంద్రంలో ఈ నెల 16న ఉదయం 10గంటలకు వాతావరణ పరిస్థితులు మారబోతున్నాయి అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నామని సంస్థ డైరెక్టర్ జి.నియంత తెలియజేశారు. ఈ పోటీల్లో ఏ వయస్సు వారైనా పాల్గొనవచ్చునని తెలిపారు. 9490754655 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

దసరా ఉత్సవాలకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు

● 19 ప్రాంతాల్లో 405 తాత్కాలిక మరుగుదొడ్లు ● పారిశుధ్య నిర్వహణకు మూడు షిఫ్ట్‌ల్లో 1490 మంది సిబ్బంది
● ఆరు ప్రాంతాల్లో క్లోక్‌రూమ్‌లు, చెప్పుల స్టాండ్‌లు ● వీఎంసీ కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షణ

నగర కమిషనర్ ధ్యానచంద్ర

కార్పొరేషన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రుల ఉత్సవానికి ఏర్పాట్లు పూర్తిస్థాయిలో జరుగుతున్నాయని నగర కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. ఉత్సవ ఏర్పాట్లలో భాగంగా శుక్రవారం ప్రధాన కార్యాలయం వద్ద నూతనంగా ఏర్పాటు చేయనున్న హోల్డింగ్ ఏరియాను పరిశీలించారు. కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మీశ ఆదేశాల మేరకు వీఎంసీ పక్కనే ఉన్న ఏపీసీపీడీసీఎల్ ఆఫీస్ ప్రాంగణంలో హోల్డింగ్ ఏరియాను ఏర్పాటు చేసేందుకు అక్కడ ఉన్న చెత్త వ్యర్థాలు, చెట్లను, పిచ్చి మొక్కలను తొలగించే పనులు చేపట్టారు. ఆ పనులను కమిషనర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. దసరా శరన్నవరాత్రుల సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నగరపాలక సంస్థ తాగునీరు,


హోల్డింగ్ ప్రాంతంలో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

మరుగుదొడ్లు, ఉచిత చెప్పుల స్టాండ్ తదితర ఏర్పాట్లు చేస్తోందన్నారు. 39 ప్రాంతాల్లో 25 లక్షల వాటర్ బాటిల్స్, 35 లక్షల వాటర్ ప్యాకెట్లను ఏర్పాటు చేయనున్నామన్నారు. 19 ప్రాంతాల్లో 405 తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక దృష్టి సారించారని, భక్తులకు పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించేందుకు 1490 మంది సిబ్బందితో 24గంటలు మూడు షిఫ్ట్‌లలో పారిశుధ్య నిర్వహణ, ప్రజల సౌకర్యార్థం ఆరు ప్రాంతాల్లో ఉచిత చెప్పుల స్టాండ్లు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. మౌలిక సదుపాయాలలో ఎటువంటి అవసరతలు ఉన్నా వెంటనే వీఎంసీ కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా సమాచారం తెలుసుకొని 24గంటలు మూడు షిఫ్ట్‌లలో సిబ్బంది పనిచేస్తారన్నారు. మోడల్ గెస్ట్ హౌస్‌లో శాఖల సమన్వయంతో అక్కడ కూడా సిబ్బంది పని చేయటానికి ఏర్పాట్లు చేశామని కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు.


కనకదుర్గ నగర్ కాలనీ సమీపంలో మురుగు నీరు
కరెన్సీనగర్ కాలనీ సమీపంలో కాలువలో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు
శ్రీరామ చంద్రనగర్ కాలనీ సమీపంలో కాలువలో పేరుకుపోయిన చెత్త

పూడికతో నిండిన మురుగుకాల్వలు

● రోజుల తరబడి నిల్వ ఉంటున్న వైనం
● దుర్వాసనతో స్థానికుల అగచాట్లు

భారతీనగర్, ఆంధ్రజ్యోతి: పూడికతో నిండిన మురుగు కాలువతో శివారు కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గురునానక్ కాలనీ నుంచి భారతీనగర్, నాగార్జున నగర్, శ్రీరామ చంద్రనగర్, కరెన్సీనగర్, కనకదుర్గ నగర్ తదితర కాలనీల మధ్య గుండా మురుగు కాలువ ప్రవహిస్తోంది. ప్రస్తుతం మురుగు కాలువ పలు చోట్ల చెత్త, ఇతర వ్యర్థాలతో నిండిపోయింది. దీంతో కరెన్సీనగర్, కనకదుర్గానగర్ కాలనీ సమీపంలో కాలువ లోని మురుగు నీరు సరిగా ప్రవహించడంలేదు. కాలువలోని మురుగునీరు రోజుల తరబడి నీరు నిల్వ ఉండడంతో దుర్వాసన వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు నీటిలో దోమలు వృద్ధిచెంది, పగలు, రాత్రి అనే తేడా లేకుండా విజృంభిస్తున్నాయి స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటి బారిన పడి ఎక్కడ అనారోగ్యానికి గురవవుతారోనని స్థానికులు భయపడుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


అనుమతులు లేని వాటర్ ప్లాంట్‌ను సీజ్ చేస్తున్న ప్రజారోగ్య సిబ్బంది

51 ప్రైవేట్ వాటర్ ప్లాంట్‌ల సీజ్

చిట్టినగర్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో ట్రేడ్ లైసెన్స్, ల్యాబ్ టెస్ట్ రిపోర్ట్ లేని ప్రైవేట్ ఆర్వో వాటర్ ప్లాంట్‌లను ప్రజారోగ్య సిబ్బంది శుక్రవారం సీజ్ చేశారు. నగర పరిధిలో మొత్తం 216 ప్రైవేట్ వాటర్ ప్లాంట్‌లను పూర్తిస్థాయిలో పరిశీలించి, 51 ట్రేడ్ లైసెన్స్, ప్రస్తుత వాటర్ టెస్టింగ్ ల్యాబ్ రిపోర్ట్ లేనివిగా గుర్తించి సీజ్ చేశారు. 57వ డివిజన్ కొత్త రాజరాజేశ్వరి పేట పరిధిలో తొమ్మిది చికెన్ షాపులు, ఒక బీఫ్ షాప్‌ను వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి. సోమశేఖర్ రెడ్డి బృందం మూసేశారు. ఫుడ్‌సేఫ్టీ నగరపాలక సంస్థ సంయుక్త పరిశీలనలో 57వ డివిజన్ కొత్తరాజరాజేశ్వరి పేట పరిధిలో 51ఆహార దుకాణాలను మూసేశారు.

వేంకటేశ్వరస్వామి మండలాభిషేకం రేపు

లబ్బీపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆధ్వర్యంలో పున్నమ్మతోటలో వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గత నెలలో అష్టబంధన మహాసంప్రోక్షణ జరిగిన సందర్భంగా వైఖానస ఆగమశాస్త్ర రీత్యా ఈ నెల 14న మండలాభిషేకం అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నామని ఆలయ పర్యవేక్షకులు మల్లికార్జున తెలిపారు. శనివారం సాయంత్రం అంకురార్పణతో ప్రారంభమై ఆదివారం ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అగ్ని ప్రతిష్ఠాపన, శాంతి హోమం, అష్టోత్తర శతకలశాభిషేకం, పూర్ణాహుతి, అక్షతారోపణ, సాయంత్రం శాంతికల్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు స్వామిని దర్శించి, అన్నప్రసాద వితరణ స్వీకరించాలని ఆయన కోరారు.

పేదలకు అండ సీఎం సహాయనిధి : ఎమ్మెల్యే గద్దె

పటమట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేదలకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఐదో డివిజన్‌కు చెందిన బి.గిరిజకు రూ.2.50లక్షలు, శశికుమార్‌కు రూ.10లక్షల ఎల్‌వోసీ చెక్కులను ఆయన స్వయంగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలో సొంతంగా వైద్యఖర్చులు పెట్టుకున్న పేదలు తమ కార్యాలయం ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకుంటే వారు చేసిన వైద్యఖర్చుల్లో అత్యధిక శాతాన్ని తిరిగి పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, రేపాకుల శ్రీను, పెనుగొండ శ్రీను, షరీఫ్, అనీఫ్, వెంకట్రావు, రాజేష్, రవి, తదితరులు పాల్గొన్నారు.


సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

చవితి పందిరిలో అన్నదానం


క్రాంతికుమార్‌కు వినాయకుడి పటాన్ని అందజేస్తున్న కమిటీ సభ్యులు, కాలనీ పెద్దలు

భారతీనగర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భారతీనగర్ బాయ్స్ ఆధ్వర్యంలో భారతీనగర్ మెయిన్ రోడ్డులో జరిగిన వినాయక చవితి అన్నదాన కార్యక్రమంలో టీడీపీ యువనాయకుడు గద్దె క్రాంతి కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత వినాయక మందిరంలో గద్దె క్రాంతి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. టీడీపీ నాయకులు దేవినేని చందు, గల్లా సదాశివరావు, గద్దె హేమాన్స్ కాట్రగడ్డ నాని, వెంకట్, రాజు, రూపేష్, పాల్గొన్నారు.

ఐజీ రవికృష్ణ ఇండ్లాస్ శాంతివన్ సందర్శన

లబ్బీపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇండ్లాస్ శాంతివన్‌ను ఐజీ రవికృష్ణ సందర్శించారు. రెండు గంటలకు పైగా అక్కడ గడిపిన ఆయన అక్కడి రోగుల బాగోగులను అడిగి తెలుసుకోవడంతో పాటు వారి జీవిత కథలను తెలుసుకొని వారికి ధైర్యం చెప్పారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైదీలు, మాదక ద్రవ్యాలను మాని వారి జీవితాల్లో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాలని, ఇప్పటి వరకు జీవితంలో ఎదుర్కొన్న సమస్యలను మర్చిపోయి గత అనుభవాలే పాఠాలుగా ముందుకు సాగాలని వారికి సూచించారు. అనంతరం అక్కడ సందర్శకుల పుస్తకంలో శాంతివన్‌లో ఖైదీలకు అందించే అసాధారణ సేవలకు, డాక్టర్ విశాల్ నాయకత్వాన్ని, అక్కడి బృందం అత్యుత్తమ సేవలను ప్రశంసించారు.


ఐజీ రవికృష్ణను సత్కరిస్తున్న శాంతివన్ ఉద్యోగులు


మాట్లాడుతున్న గౌరవాధ్యక్షుడు బాబూరావు

కొత్త చట్టాలతో షాపు ఉద్యోగులకు పనిభారం

షాపు ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు సీహెచ్ బాబూరావు

గవర్నర్‌పేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు తీసుకువచ్చిన కొత్త చట్టాలతో షాపు ఉద్యోగులపై పనిభారం మరింత పెరిగిందని, పని గంటలు పెంచడం దుర్మార్గమని షాపు ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు సీహెచ్ బాబూరావు అన్నారు. షాపు ఎంప్లాయీస్ యూనియన్ 15వ మహాసభ శుక్రవారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో జరిగింది. ముందుగా యూనియన్ జెండాను యూనియన్ నగర కార్యదర్శి వై. సుబ్బారావు ఆవిష్కరించారు. మహాసభలో బాబూరావు మాట్లాడుతూ ఏపీలో కార్మికులకు మేలు చేస్తుందని కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేస్తే కేంద్ర ప్రభుత్వ విధానాలనే అమలు చేస్తోందని తెలిపారు. షాపుల్లో పనిచేసే మహిళలకు కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడం, ఖాళీ సమయాల్లోనూ షాపుల్లో కూర్చునే అవకాశం లేకపోవడం వల్ల వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. షాపు వర్కర్స్‌కు సదుపాయాలు కల్పనపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని, కనీస వేతనం అమలు చేసే విధంగా చట్టాలు చేయాలని కోరారు. జిల్లా శ్రామిక మహిళా కన్వీనర్ ఏ. కమల మాట్లాడుతూ పురుషులతో పాటు మహిళలు సమాన పని చేసినప్పటికీ వారితోపాటు సమాన వేతనం ఇవ్వడం లేదన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏ. వెంకటేశ్వరరావు, సెంట్రల్ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు దుర్గారావు, సుధాకర్, నేతలు పాల్గొన్నారు.

హస్తకళాకారుల జీవన ప్రమాణ స్థాయి పెరగాలి

లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్ డిజైన్ పోటీ 2025 అవార్డుల కార్యక్రమం

మొగల్రాజపురం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): హస్తకళాకారుల జీవన ప్రమాణ స్థాయి పెరిగినపుడే ఆ కళలు భవిష్యత్ తరాలకు అందుబాటులోకి వస్తాయని లేపాక్షి చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ తెలిపారు. మొగల్రాజపురం సున్నబట్టీల సెంటర్‌లో ఉన్న ఆంధ్రామోటార్ మర్చంట్స్ (అమ్మ) అసోసియేషన్ హాలులో రాష్ట్ర స్థాయి గాంధీ శిల్పబజార్ పేరుతో నిర్వహిస్తున్న లేపాక్షి హస్తకళల ప్రదర్శనలో లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్ డిజైన్ పోటీ 2025 అవార్డుల కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హస్తకళలు, జౌళి శాఖ (పరిశ్రమలు, వాణిజ్యం) ప్రత్యేక కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా అధ్యక్షత వహించారు. నూతక్కి శ్రీనివాసరావు (కొండపల్లి బొమ్మలు -శ్రీనివాసకల్యాణం), టాంగేటి అయ్యన్న (ఏటి కొప్పాక బొమ్మలు - మల్టీపర్పస్ యాటిలిటీ బాక్స్), దలవాయి అనంతమ్మ (తోలుబొమ్మలు - టేబుల్ ల్యాంప్ షేడ్) సుబ్రహ్మణ్య ఆచార్య (వుడ్ కార్వింగ్- షోకేస్ ఐటం), కేవీఎస్ఎన్ కిషోర్ (కలంకారీ బ్లాక్‌ప్రింటింగ్) బంగారు పతకాలు గెలుచుకున్నారు. అదనంగా ఐదుగురు శిల్పకళాకారులకు ప్రత్యేక అవార్డుల కింద ఒక్కొక్కరికి రూ.10వేలు, సర్టిఫికెట్‌లు ఇచ్చారు. మొత్తం 15 అవార్డులకు బంగారు,వెండి, రజిత పతకాలతో పాటు సర్టిఫికెట్‌లు, నగదు బహుమతులు కలిపి మొత్తం రూ.3 లక్షల వరకు పంపిణీ చేశారు. ఈ ప్రదర్శన ఈ నెల 14 వరకు ఉంటుందని ఏపీ హస్తకళల అభివృద్ధి సంస్థ ఉపాధ్యక్షులు మేనేజింగ్ డైరెక్టర్ విశ్వమనోహర్ తెలిపారు.


విజేతలతో లేపాక్షి చైర్మన్ హరిప్రసాద్, హస్తకళలు, జౌళి శాఖ ప్రత్యేక కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా తదితరులు

విజయవాడ ఉత్సవ్‌ను జయప్రదం చేయండి : ఏకే బాష



న్యాయవాదుల ర్యాలీ

విజయవాడ లీగల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విజయవాడ ఉత్సవ్‌ను జయప్రదం చేయాలని కోరుతూ బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏకే బాష పిలుపునిచ్చారు. బార్ కౌన్సిల్ మెంబర్ చలసాని అజయ్‌కుమార్ అధ్యక్షతన విజయవాడ ఉత్సవ్‌ను జయప్రదం చేయాలని కోరుతూ విజయవాడ సిటీసివిల్ కోర్టుల నుంచి బెంజిసర్కిల్ మీదుగా బీసెంట్‌రోడ్డు నుంచి కోర్టుల వద్దకు బైక్‌లపై ర్యాలీగా చేరుకొన్నారు. ఈ సందర్భంగా బార్ అధ్యక్షుడు ఏకే బాష మాట్లాడుతూ ఈ విజయవాడ ఉత్సవ్‌ను అందరం కలిసిమెలసి మన ఇంట్లో పండుగలా జరుపుకోవాలని, ఈ ఉత్సవ్ ఆర్థికపరంగా మన విజయవాడ అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతుందని దీనిని అందరం విజయవంతం చేయాలని కోరారు. బార్ కౌన్సిల్ మెంబర్ చలసాని అజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉత్సవ్ కార్యక్రమానికి మా వంతుగా న్యాయవాదులందరూ సహకరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ కార్యవర్గసభ్యులు జి.వరాహలక్ష్మి, బార్ మాజీ అధ్యక్షుడు చేకూరి శ్రీపతి తదితరులు పాల్గొన్నారు.


ఓడోర్ కంట్రోల్ యూనిట్ ప్రారంభం

రామలింగేశ్వరనగర్ సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దుర్వాసన నియంత్రణ పరికరం (ఓడోర్ కంట్రోల్ యూనిట్)ను సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ అధికారులు ప్రారంభించారు. 15వ డివిజన్ ప్రజలు ప్రధానంగా రామలింగేశ్వరనగర్, సాయినగర్ ప్రాంత వాసులు సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ) పెట్టిన నాటి నుంచి నేటి వరకు వాయుకాలుష్యం, జలకాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నారు. ఏసీ, ఫ్రిజ్ తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు తరచూ మరమ్మతులకు గురవుతున్న విషయం విదితమే. అయితే ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం, సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ అధికారులు ఆ ప్రాంత ప్రజలు పడుతున్న ఇబ్బందులు గమనించి సమస్య మళ్లీ పునరావృతం కాకుండా రూ.70 లక్షల వ్యయంతో దుర్వాసన నియంత్రణ పరికరం (ఓడోర్ కంట్రోల్ యూనిట్) ను ప్రారంభించారు. ఈ పరికరం దుర్వాసనలను తొలగించి నిరంతరం సురక్షితమైన వాసనలేని గాలినే విడుదల చేస్తుందని, దీని వలన ప్రజలకు ఊరట లభిస్తుందని అధికారులు వెల్లడించారు.


దుర్వాసన నియంత్రణ పరికరం

ఉల్లితో అక్రమ వ్యాపారం

- రైతు బజార్లలో దళారులతో కలిసి ఈవోలు, మార్కెటింగ్ అధికారుల ఆగడాలు
- స్థానిక రైతులకు తప్పని కష్టాలు



విజయవాడ కల్చరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలోని రైతు బజార్లలో ఉల్లిపాయలను భారీ ధరలకు అమ్ముకొని సొమ్ము చేసుకొంటున్నారని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గొల్లపూడి హోల్‌సేల్ మార్కెట్‌లో ఏకంగా కిలో రూ.23 నుంచి 25 వరకు పలుకుతోంది. అంటే కేజీకి రూ.9 లాభంతో వినియోగదారుల జేబులకు చిల్లుపెడుతున్నారు. సోలాపూర్ నుంచి దిగుమతి చేసుకొంటున్న ఉల్లిపాయలను గొల్లపూడి మార్కెట్‌లో రూ.16కు అమ్ముతున్నారు. రైతు బజార్‌లో మార్కెటింగ్ శాఖ నియమాల ప్రకారం హోల్‌సేల్ మార్కెట్‌కి మించి రూ.2 లాభంతో మాత్రమే అమ్మాలి. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల రైతు బజార్లలోని ఇటు ఉల్లిపాయల వ్యాపారులు అటు రైతు బజారు ఎస్టేట్ అధికారులు, మార్కెటింగ్ శాఖ అధికారులు, దళారీ వ్యవస్థను సృష్టించి అధిక ధరలను అమ్ముకొంటూ జేబులు నింపుకొంటున్నారని వారు ఆరోపిస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో పటమట రెండు రైతు బజార్లు 10 టన్నులు గాంధీనగర్, కేదారేశ్వరపేట రైతు బజార్‌లో 12 టన్నులు, పాయకాపురం, సింగ్‌నగర్‌లో 6 టన్నులు, భవానీపురం, కృష్ణలంక 8 టన్నులు, జగ్గయ్యపేట, కంచికచర్ల, నందిగామలో 23 టన్నులు, ఉయ్యూరు, కంకిపాడు కృష్ణాజిల్లాలో కూచిపూడి, గన్నవరం, గుడివాడ, బందరు, చల్లపల్లి రైతు బజార్‌లో 31 టన్నులు మొత్తంగా కలిసి 80 నుంచి 90 టన్నులకు పైగా రోజుకు ఉల్లిపాయల అమ్మకాలు సాగుతుంటాయి. 90 టన్నుల అమ్మకాలపై దాదాపుగా వచ్చిన రూ. 5 నుంచి 6 లక్షల లాభాలు దళారులతో పాటు ఎస్టేట్ అధికారులు కిందిస్థాయి మార్కెటింగ్ శాఖ అధికారులు పంచుకొంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్థానిక ఉల్లి రైతులకు నష్టాలు

ఇంకోవైపు స్థానికంగా ఉల్లి పండించే రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. మార్కెట్‌లో ధరలు లేక తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో రైతుబజార్ వ్యాపారులు మహారాష్ట్రలోని సోలాపూర్‌లో రూ.1200 వరకు కొని దిగుమతి చేసుకోవడం విశేషం. మన రాష్ట్రంలోని కర్నూల్ జిల్లాలో ప్రస్తుతం ఉల్లి రైతులు ధరల లేక రూ.500 లేక రూ.600కే అమ్మకం చేయడానికి సిద్ధంగా ఉన్నారు. వారి వద్ద ఆ మాత్రం ధర పెట్టుకొనే వాళ్ల లేకపోవడంతో ఉల్లిపాయలను రోడ్లపైన, నదుల్లో పారవేస్తూ మార్కెటింగ్ శాఖకు నిరసన తెలుపుతున్నారు. మార్కెటింగ్ శాఖ తక్కువ ధరకే కర్నూల్ రైతు వద్ద కొని రైతుబజార్‌లో అమ్మకాలు చేయిస్తే అటు రైతులకు ఇటు వినియోగదారులకు తక్కువ ధరలో ఉల్లిపాయలు దొరికే అవకాశం ఉంటుందని కొందరు రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

మంత్రి సత్యకుమార్‌కు దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రిక



ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో ఈనెల 22 నుంచి జరగనున్న దసరా మహోత్సవాలకు రావల్సిందిగా మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు శుక్రవారం వెలగపూడిలోని ఆయన కార్యాలయంలో దుర్గగుడి ఈవో వీకే శీనానాయక్, ప్రధాన అర్చకుడు లింగంబొట్ల దుర్గాప్రసాద్ దసరా మహోత్సవాల ఆహ్వాన పత్రికను అందించారు. ఈవో, ప్రధాన అర్చకుడు మంత్రికి అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం అందించగా, పురోహితులు వేదాశీర్వచనం అందజేశారు.



ఐఏఎస్ అధికారులు హిమాన్షు శుక్లా, కృతికా శుక్లా దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనానాయక్

దుర్గమ్మ సన్నిధిలో ఐఏఎస్ అధికారులు

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో కనక దుర్గమ్మను ఐఏఎస్ అధికారులు హిమాన్షు శుక్లా, కృతికా శుక్లా శుక్రవారం దర్శించుకున్నారు. ఈవో వీకే శీనానాయక్ వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులు వారికి వేద ఆశీర్వచనం అందజేశారు. ఈవో వారికి అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా హిమాన్షు శుక్లా నియామకం కాగా, పల్నాడు కలెక్టర్‌గా కృతికా శుక్లా నియమితులయ్యారు.

నవంబరు 8న ఇళయరాజా మ్యూజికల్ షో

విజయవాడ సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో మ్యాస్ట్రో ఇళయరాజా మ్యూజికల్ షోను నవంబర్ 8న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ట్రెండ్ సెట్టర్ ఈవెంట్స్ అధినేత సుధాకర్ తెలిపారు. ఈ మేరకు పోస్టర్‌ను మంత్రి టీజీ భరత్ శుక్రవారం ఆవిష్కరించారు. ఇళయరాజా అమరగీతాలను ప్రత్యక్షంగా ఆస్వాదించే అవకాశం విజయవాడ, ఆంధ్రా ప్రజలకు దొరికిన అపూర్వ అవకాశంగా ఈవెంట్‌ను మంత్రి అభివర్ణించారు. సంగీత అభిమానులకు ఆ రోజు గుర్తుండి పోయే అనుభవమన్నారు.

రేపు కబడ్డీ బాలబాలికల జట్ల ఎంపిక

లబ్బీపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా కబడ్డీ జూనియర్ బాలుర, బాలికల జిల్లా జట్టు సెలక్షన్స్ 14న ఆదివారం నిర్వహిస్తున్నట్టు ఆర్గనైజింగ్ సెక్రెటరీ టీ సుధాకర్ తెలిపారు. ఈ ఎంపికలు రైల్వే స్టేడియంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి జరుగుతాయని, పాల్గొనే క్రీడాకారులు 20ఏళ్ల లోబడి ఉండాలన్నారు. బాలుర విభాగంలో 75 కేజీలు, బాలికల విభాగంలో 65 కేజీలు లోపుండాలని, అలాగే మ్యాట్ షూ, ఆధార్‌కార్డు ఒరిజనల్ తప్పనిసరిగా తీసుకువెళ్లాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు గొల్లపూడిలో ఈ నెల 25 నుంచి 28 వరకు జరిగే పోటీల్లో పాల్గొంటారని, ఇతర వివరాలకు ఫోన్ నెంబర్స్ 7702959293, 9491960547 నందు సంప్రదించాలని తెలిపారు.



మాట్లాడుతున్న శాస్త్ర సాంకేతిక మండలి మెంబర్, సెక్రటరీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ శరత్‌కుమార్

విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

శాస్త్ర సాంకేతిక మండలి మెంబర్ డాక్టర్ శరత్‌కుమార్

పీబీ సిద్ధార్థలో ముగిసిన తొలి అణు విజ్ఞాన ప్రదర్శన

మొగల్రాజపురం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జ్ఞానం అవధులు లేనిది అణు విజ్ఞానం వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయని విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకుని దేశానికి సేవలు చేయాలని ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి మెంబర్, సెక్రటరీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ కే శరత్‌కుమార్ అన్నారు. పీబీ సిద్ధార్థ కళాశాల భౌతిక శాస్త్ర విభాగం, ఇందిరా గాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రీసెర్చ్ సంయుక్త నిర్వహణలో రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా నిర్వహించిన అణు విజ్ఞానం సైన్సు ఎగ్జిబిషన్ ముగింపు సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ మాట్లాడుతూ శరత్‌కుమార్ సిద్ధార్థ పూర్వవిద్యార్థి కావడం ఆనందంగా ఉందన్నారు. భౌతికశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాస కృష్ణ మాట్లాడుతూ ఈ అణు ఎగ్జిబిషన్‌ను 5 రోజుల్లో 8,300 మంది సందర్శించారన్నారు. డాక్టర్ కే శరత్‌కుమార్‌ను, ఐజీసీఏ రీసెర్చ్ సాంకేతిక, ప్రజాసమన్వయ విభాగం హెడ్ జలజామదన్‌మోహన్, సైంటిఫిక్ ఆఫీసర్ కే పార్థీపన్, శాస్త్రవేత్త ఎస్ రాములును ఘనంగా సత్కరించారు. డైరెక్టర్ వేమూరి బాబురావు, డిప్యూటీ హెడ్ డాక్టర్ ఎం తీస్నీమ్, డాక్టర్ మ స్వరీన్, డాక్టర్ విజయకృష్ణ, రాజశేఖర్, టి పూజిత పాల్గొన్నారు.

పీటీడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

- పీటీడీ సంఘం ప్రతినిధులు

విజయవాడ సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ (ఏపీ పీటీడీ) ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై చొరవ చూపాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబును ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధులు కోరారు. రాష్ట్ర సచివాలయంలో టీ ఆర్అండ్‌బీ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉద్యోగ బాధ్యతలు తీసుకున్న కృష్ణబాబును సంఘ నేతలు మర్యాదపూర్వకంగా కలుసుకుని దుశ్శాలువాతో సత్కరించారు. పెండింగ్‌లోని ఉద్యోగుల ఉద్యోగోన్నతిపై జీవో విడుదల చేయాలని, పీఆర్ ద్వారా ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు. సంఘం అధ్యక్ష కార్యదర్శులు పీవీ రమణారెడ్డి, వై శీనివాసరావు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, కోశాధికారి పీవీ మోహన్, ప్రతినిధులు సుజాత, అనంత రాములు, వినోద్‌బాబు, తులసి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు చిత్తశుద్ధితో పనిచేస్తాం

- మంత్రి సత్యకుమార్ యాదవ్
- నందిగామలో 100 పడకల వైద్యశాల పనులకు ఎంపీ కేశినేని, ఎమ్మెల్యే సౌమ్యతో కలిసి శంకుస్థాపన



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

నందిగామ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు సాగుతోందని వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం నందిగామ పట్టణంలో వంద పడకల వైద్యశాల పనులకు ఎంపీ కేశినేని శివనాథ్, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్యతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యానికి గురైన వంద పడకల వైద్యశాల కోసం సౌమ్య ఎంతో కృషి చేశారన్నారు. పనులు త్వరగా పూర్తి చేసేందుకు సహకారం అందిస్తానన్నారు. ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ వంద పడకల వైద్యశాల నిర్మాణంతో నియోజకవర్గ ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. సౌమ్య చిత్తశుద్ధితో పని చేయడం వల్లే ఇంత త్వరగా నందిగామకు వంద పడకల వైద్యశాల అందిందన్నారు. ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య మాట్లాడుతూ మాజీ మంత్రి దేవినేని వెంకటరమణ కృషితో పీహెచ్‌సీ స్థాయి నుంచి ఏరియా వైద్యశాలకు అప్‌గ్రేడ్ అయిందన్నారు. ఆయన మరణానంతరం అప్పటి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కృషితో సకల వసతులతో వైద్యశాల అభివృద్ధి జరిగిందన్నారు. పెరుగుతున్న జనాభాతో ఈ వైద్యశాల విస్తరణకు గత టీడీపీ ప్రభుత్వంలోనే ప్రతిపాదనలు చేయగా, ఎన్నికలు రావడంతో నిలిచిపోయిందన్నారు. అనంతరం వైసీపీ అధికారంలో వచ్చిందని, అప్పటి పాలకుల నిర్వాకంతో వైద్యశాల ఉనికి కోల్పోయిందన్నారు. కూటమి అధికారంలోకి రాగానే అడిగిన వెంటనే సీఎం చంద్రబాబు, మంత్రి సత్యకుమార్ యాదవ్ వంద పడకల వైద్యశాలకు నిధులు ఇచ్చారన్నారు. వైద్యశాల సాధనకు ఎంపీ కేశినేని శివనాథ్ సహకారం మరువలేనిదన్నారు. వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ వేపూరి నాగేశ్వరరావు, ఎన్ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు, ఏఎంసీ చైర్మన్లు కోగంటి బాబు, పిట్టల శ్రీదేవి, నియోజకవర్గ పరిశీలకుడు బచ్చుల సుబ్రహ్మణ్యం, మునిసిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, డీసీహెచ్ఎస్ మాధవీదేవి, సూపరింటెండెంట్ సత్యనారాయణ, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



ఉత్తమ కంపెనీలకు బిజినెస్ ఎక్సలెన్సు అవార్డులను ప్రదానం చేస్తున్న మంత్రులు, ఎంపీ కేశినేని చిన్ని

బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానం

హాజరైన మంత్రులు టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్, కొల్లు రవీంద్ర, ఎంపీ శివనాథ్

పెనమలూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బిజినెస్ ఎక్సలెన్సు-2025 అవార్డులను ఆంధ్రప్రదేశ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ (ఏపీ ఛాంబర్స్) శుక్రవారం విజయవాడ పోరంకిలోని మురళీ రిసార్ట్సులో రాష్ట్ర మంత్రుల చేతుల మీదుగా అందించింది. వైభవంగా జరిగిన ఈ అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రులు టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్, కొల్లు రవీంద్ర, ఎంపీ కేశినేని శివనాథ్, ఫుడ్ ప్రాసెసింగ్ కార్యదర్శి డాక్టర్ చిరంజీవ్ చౌదరి అతిథులుగా హాజరై విజేతలకు అవార్డులను అందజేశారు. పరిశ్రమ, ఆవిష్కరణ, సమాజాభివృద్ధికి అసాధారణమైన సేవలందించిన వివిధ రంగాల్లోని వ్యాపార సంస్థలను, పారిశ్రామికవేత్తలను గుర్తించి గౌరవించడానికి ఏపీ చాంబర్స్ ఈ బిజినెస్ ఎక్సలెన్సు అవార్డులను ఏర్పాటు చేసిందని సంస్థ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి బీ రాజశేఖర్, కోశాధికారి ఎస్ అక్కయ్యనాయుడు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 600 మంది పారిశ్రామికవేత్తలు, ఉన్నతాధికారులు, వ్యాపారవేత్తలు హాజరయ్యారు. అవార్డుల జ్యూరీ సభ్యులుగా ఐఏఎస్ అధికారి జే సత్యనారాయణ, ప్రపంచ ఆర్థిక వేదికకు చెందిన సెంటర్ ఫర్ ది ఫోర్త్ ఇండస్ట్రియల్ రెవెల్యూషన్ ఇండియా ముఖ్య సలహాదారు, భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ మాజీ చైర్మన్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్, ఏపీ మాజీ ఎలక్షన్ కమిషనర్ అజిత్ రంగ్నేకర్, ఆర్ఐసీహెచ్ డైరెక్టర్ జనరల్, ఐఎస్‌బీ హైదరాబాద్ మాజీ డీన్‌లు వ్యవహరించారు. ఈ ఏడాది ఉత్తమ స్టార్టప్ కంపెనీగా వేపూరి ఆగ్రో ప్రొడక్ట్సు ఎంపికవగా ఫ్రెష్‌బౌల్ హార్టికల్చర్ కంపెనీ, ఎప్పానిక్స్ సిస్టమ్సు కంపెనీలు ఉత్తమ ఎంఎస్ఎంఈలుగా, ఎగుమతుల్లో ఉత్తమ కంపెనీగా జ్యోతి గ్రానైట్సు ఎక్స్‌పోర్ట్సు కంపెనీ, ఉత్తమ కంపెనీ (లార్జ్)గా మా మహామాయ ఇండస్ట్రీస్, పరమేశు బయోటెక్ ఫుడ్ ప్రాసెసింగ్‌లో ఉత్తమ కంపెనీగా, మోహన్ స్పింటెక్స్ ఇండియా లిమిటెడ్ టెక్స్‌టైల్స్‌లో ఉత్తమ కంపెనీగా, ఈఏడాది ఉత్తమ మహిళా పారిశ్రామికవేత్తగా రావుస్ సెక్యూరిటీ, హౌస్ కీపింగ్ ఏజెన్సీ అధినేత పీ రమణి అవార్డులు పొందారు. శరత్ చటర్జీ లిమిటెడ్ కంపెనీ లాజిస్టిక్స్‌లో ఉత్తమ కంపెనీగా, ఇన్ఫ్రా, రియల్ ఎస్టేట్‌లో కేఎంవీ స్పేసెస్, సర్క్యులర్ ఎకానమీలో ఉత్తమ కంపెనీగా హోలోసేన్ ఎకో సొల్యూషన్స్, ఆటోమొబైల్స్‌లో ఉత్తమ కంపెనీగా అవేరా ఏఐ మొబిలిటీ, ఉత్తమ సీఎస్ఆర్ చొరవగా దీపక్ నెక్స్‌జెన్ ఫీడ్స్‌లు ఎంపికయ్యాయి. ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ స్వర్గీయ రామోజీరావు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ప్రత్యేక జీవిత సాఫల్య పురస్కారాన్ని సీసీఎల్ ప్రొడక్ట్సు ఇండియా లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ చల్లా రాజేంద్రప్రసాద్‌కు ప్రదానం చేశారు.

నేర నియంత్రణకు పర్యావరణహిత సాంకేతికత

- సీపీటీఈడీ జాతీయ సదస్సులో 20 సూత్రాల చైర్మన్ లంకా దినకర్
- భావోద్వేగాలను నియంత్రించగలిగితే నేరాల అదుపు సాధ్యం

విజయవాడ సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగరాలు, పట్టణాలు, నగర పంచాయతీల్లో జరుగుతున్న నేరాలను నియంత్రించి వికసిత్ భారత్-2047, స్వర్ణాంధ్ర-2047 లక్ష్యం సాధనకు కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని 20 సూత్రాల కమిటీ రాష్ట్ర చైర్మన్ లంకా దినకర్ సూచించారు. దీనికోసం అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాల్సిన అవశ్యకత ఉందని అభిప్రాయపడ్డారు. పట్టణ, నగరాల్లో ముందస్తు నేరాల నివారణ వాతావరణ రూపకల్పన (క్రైం ప్రివెన్షన్ త్రో ఎన్విరానమెంటల్ డిజైన్-సీపీటీఈడీ, ఏఐ ఇన్ అర్బన్ ఏరియాస్) అనే అంశంపై విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (ఎస్‌పీఏ) కాలేజీలో శుక్రవారం జరిగిన జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దురలవాట్లకు బానిసైనవారు, తీవ్ర భావోద్వేగానికి గురైన వ్యక్తులు నేరాలు చేస్తారని, ఏ సమయంలో ఎలాంటి నేరం చేస్తారో గుర్తించడం కష్టమన్నారు. ఇలాంటి వ్యక్తులను గుర్తించేందుకు సాంకేతిక సాయం అవసరమన్నారు. రాష్ట్రంలోని 6 కోట్ల జనాభాలో సుమారు 35శాతం మంది 17నగరాలు, 78 పట్టణాలు, 31 నగర పంచాయతీల్లో నివసిస్తున్నారన్నారు. పూర్తిస్థాయి నేరాల నియంత్రణకు సీపీటీఈడీ జాతీయ వర్క్‌షాప్ నిర్వహించిన ఎస్‌పీఏ కాలేజీ యాజమాన్యాన్ని అభినందించారు. ఇప్పటికే ఫేషియల్ రికగ్నేషన్, సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ సాధనాలను ఉపయోగిస్తున్నామన్నారు. నేరస్థులు సైతం ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ పోలీస్ శాఖకు సవాల్ విసురుతున్నారన్నారు. దీనికి చెక్ పెట్టేందుకు ఏఐ టెక్నాలజీని ఉపయోగించుకుని మరింత సమర్థవంతమైన టూల్స్‌ను రూపొందించాలన్నారు. దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాంకేతిక సాధనాలను సమకూర్చాలన్నారు. సీపీటీఈడీ వర్క్‌షాప్‌లో వెల్లడైన వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని వివరించారు. డీసీపీ కేజీవీ సరిత, ఎస్‌పీఏ విజయవాడ డైరెక్టర్ రమేష్, ప్రొఫెసర్ వీరేంద్రకుమార్ పాల్, ఐబీఎం శాస్త్రవేత్త రవికుమార్‌రెడ్డి, డీపీ శ్రీనివాస్ పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న 20 సూత్రాల చైర్మన్ లంకా దినకర్

కేడీసీసీబీని దేశంలో అగ్రగామిగా నిలపాలి

- తుదిశ్వాస విడిచే వరకు ప్రజా సేవలోనే.. ● తాతయ్యతో అరమరికలు లేవు.. అభివృద్ధిలో రాజీలేదు : నెట్టెం



నెట్టెం రఘురాంను సత్కరిస్తున్న సొసైటీ ప్రతినిధులతో శ్రీరాం తాతయ్య, మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్

జగ్గయ్యపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎల్ఎంబీ బ్యాంకు డైరెక్టర్‌గా 1981లో నాటి చైర్మన్ అభ్యర్థిపై సాధించిన సంచలన విజయమే తన రాజకీయ భవిష్యత్‌కు పునాది వేసిందని, నేడు చైర్మన్‌గా కేడీసీసీ బ్యాంకును దేశంలో అగ్రగామిగా నిలబెట్టటమే లక్ష్యమని బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం అన్నారు. చివరి క్షణం వరకు ప్రజలకు అందుబాటులో ఉంటానని ఉద్విగ్నతకు గురయ్యారు. జగ్గయ్యపేట బీ కన్వెన్షన్‌లో జగ్గయ్యపేట నియోజకవర్గ సొసైటీల అధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ అభినందన సభలో నెట్టెం మాట్లాడారు. ప్రస్తుతం తన ముందు జాతీయస్థాయిలో రెండో స్థానంలో ఉన్న కేడీసీసీని నెంబర్ వన్ చేయటమేకాక, రూ.12000 కోట్ల టర్నోవర్‌ను రూ. 13,500 కోట్లకు పెంచటం, వాణిజ్య బ్యాంకులకు దీటుగా ప్రజలకు సేవలందించేలా చూస్తానన్నారు. అలాగే త్రీమెన్ కమిటీ సభ్యులు రైతులకు అండగా ఉండాలని కోరారు. మొదటి నుంచి ఆప్కాబ్ మాజీ చైర్మన్ టీడీ జనార్ధన్‌తో ఎలా ఉన్నానో, ఇప్పుడు ఎమ్మెల్యే తాతయ్యతోను అలాగే ఉన్నానని నెట్టెం చెప్పారు. అభివృద్ధిలో రాజీలేదని నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి అంతా కలిసి పనిచేస్తామన్నారు. తనపై పేట ప్రజలు, రైతులు, పార్టీ కార్యకర్తలు చూపుతున్న ఆత్మీయతకు కృతజ్ఞతలు తెలిపారు.

డిఫెన్స్ క్లస్టర్‌తో మారనున్న పేట దిశా దశ

జగ్గయ్యపేట దిశా దశ డిఫెన్స్ క్లస్టర్‌తో మారిపోతుందని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. విజయవాడ గొప్పదనాన్ని ప్రపంచానికి చాటి చెప్పేందుకు విజయవాడ ఉత్సవ్ నిర్వహిస్తున్నామన్నారు. పోలంపల్లి మునేరు డ్యామ్ సమస్య పరిష్కారానికి, రింగ్ బండ్ నిర్మాణానికి రెండు రోజుల్లో ఎంపీ ల్యాడ్స్ కేటాయిస్తామన్నారు. విలక్షణ రాజకీయ నేతగా ఉన్న నెట్టెం వల్ల కేడీసీసీ బ్యాంకు చైర్మన్ పదవికి వన్నె వచ్చిందన్నారు. ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ రాజకీయాల్లో అజాతశత్రువుగా నెట్టెం సుదీర్ఘకాలం కొనసాగారని ప్రశంసించారు. అనంతరం స్వయం సహాయక సంఘాల మహిళలకు, రైతులకు రూ. 12,30,75,000 చెక్‌లను ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డు చైర్మన్ బాలకోటయ్య, మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్ధన్‌తో కలిసి కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం అందజేశారు. చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, సొసైటీ అధ్యక్షుడు కట్టా నరసింహారావు, ధూళిపాళ లక్ష్మణరావు, యానాల గోపీచంద్, మల్లెల గాంధీ, టీ జగన్మోహనరావు, వడ్లమూడి రాంబాబు, చింతల సీతారామయ్య, టీ నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు. ఎమ్మెల్యే తాతయ్యను నియోజకవర్గ సొసైటీల చైర్మన్లు ఘనంగా సత్కరించారు. రైతులకు క్షేత్రస్థాయిలో సేవలందించాలని తాతయ్య కోరారు.

ఎన్టీఆర్ పుస్తకం ఆవిష్కరణ 16న

ఎన్టీఆర్‌పై తాను, పోలా విక్రమ్ రచించిన పుస్తకాన్ని సీఎం చంద్రబాబు, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఈ నెల 16న విజయవాడ మురళీ రిసార్ట్‌లో ఆవిష్కరిస్తారని ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్ చెప్పారు. జిల్లా నుంచి టీడీపీ కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు భారీగా తరలి రావాలని కోరారు.

ఏడు రోజుల్లో జ్యోతిర్లింగ సహిత దక్షిణ్ యాత్ర

హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ స్టేషన్ నుంచి ఈ నెల 23న జ్యోతిర్లింగ సహిత దివ్య దక్షిణ్ యాత్ర భారత్ గౌరవ్ ప్రత్యేక టూరిస్టు రైలు బయలుదేరనుంది. వారం రోజుల్లో తిరువణ్ణామలై, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేంద్రం, తిరుచ్చి, తంజావూరులోని ఆలయాలను దర్శించుకునేందుకు వీలుగా తీర్థయాత్ర ఐఆర్‌సీటీసీ రూపొందించింది. సికింద్రాబాద్ నుంచి బయలుదేరే ఈ టూరిస్టు రైలు విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్లలో ఆగుతుంది. ప్రయాణికులకు ప్యాకేజీలోనే క్యాటరింగ్ (ఉదయం టీ, అల్పాహారం, లంచ్-డిన్నర్) ఏర్పాట్లు చేసినట్టు ఐఆర్‌సీటీసీ అధికారులు తెలిపారు. ప్యాకేజీ ధర (ఒక్కొక్కరికి)ఎకానమీ రూ.14100, స్లీపర్ 3 ఏసీ రూ.22,500, కంఫర్ట్ 2ఏసీలో రూ.29,500గా ఖరారు చేసినట్టు వివరించారు. బుకింగ్‌కు 9701360701, 9281030726, 9281030740, 9281495845 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

యూపీఎస్సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు: కలెక్టర్

కలెక్టరేట్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల 14న జరగనున్న యూపీఎస్సీ నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నేవల్ అకాడమీ (2), కంబైన్డ్ డిఫెన్స్ అకాడమీ (2) పరీటల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని, అభ్యర్థులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎన్‌డీఏ అండ్ ఎన్ఏ, సీడీఎస్ పరీక్షల నిర్వహణపై కలెక్టర్ లక్ష్మీశ, యూపీఎస్సీ అబ్జర్వర్ హరీష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఇలక్కియాతో కలిసి లైజన్ ఆఫీసర్లు, పరీక్ష కేంద్రాల పర్యవేక్షకులు, వైద్య ఆరోగ్యం, విద్యుత్, రెవెన్యూ, రవాణా, పోస్టల్ తదితర శాఖల అధికారులతో కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. డీఆర్ఓ ఎం.లక్ష్మీ నరసింహం, విజయవాడ ఆర్డీఓ కావూరి చైతన్య వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం చేయకుండా అప్రమత్తంగా ఉండండి

శుక్రవారం రాత్రి న్యూ రాజరాజేశ్వరీపేట, పరిసర ప్రాంతాల్లోని 11వ వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ప్రతిరోజు ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహణ, డయేరియా బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడం తదితరాలపై సూచనలు చేశారు. ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక కరపత్రాలతో అవగాహన కల్పించాలన్నారు. ఈ కరపత్రాలను ప్రతి ఇంటికీ పంపిణీ చేయాలని సూచించారు.

అమరావతిలో మౌలిక వసతులపై

వరల్డ్ బ్యాంక్ ప్రతినిధుల సంతృప్తి

కలెక్టరేట్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధాని అమరావతి నగర అభివృద్ధి, మౌలిక వసతులపై ప్రాజెక్టు కింద అమలవుతున్న పర్యావరణ, సామాజిక రక్షణ కార్యకలాపాలను పరిశీలించేందుకు రెండు రోజుల పాటు వరల్డ్ బ్యాంక్, ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్ బృందం అమరావతిలో చేపట్టిన పర్యటన శుక్రవారం ముగిసింది. అమరావతిలో నిర్మాణ పనులు చేపట్టిన ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీల ప్రతినిధులు తమ క్యాంపు సైట్లలో అమలుచేస్తున్న పర్యావరణ, సామాజిక రక్షణ కార్యకలాపాలను, కార్మికుల భద్రతకై అమలవుతున్న విధానాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

రవాణా రంగ సమస్యలపై ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించండి

విజయవాడ సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రవాణా సమస్యలపై ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించాలని రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబును ఏపీ లారీ యజమానుల సంఘం ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు కోరారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీగా ఉద్యోగ బాధ్యతలు తీసుకున్న కృష్ణబాబును లారీ యజమానుల సంఘం నేతలు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకుని సన్మానించారు. కృష్ణాజిల్లా లారీ యజమానుల సంఘం అధ్యక్షకార్యదర్శులు ఎన్.రాజా, రావి శరత్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి 9

నవ్య


కుటుంబ కదంబం

శనివారం • 13 సెప్టెంబరు 2025

భోజన కుతూహలం

కలుపు మొక్కే కదా అని వదిలేయవద్దు!

కలుపు మొక్కలను పొలాల నుంచి పీకి పారేస్తూ ఉంటాం. కానీ మనం కలుపు మొక్కలుగా భావించే వాటిలో కొన్నింటికి అపూర్వమైన ఔషధ గుణాలు ఉంటాయి. అలాంటి వాటిలో పిత్తపాపడ మొక్క ఒకటి. వరి, గోధుమ చేలలో పెరిగే ఈ మొక్క గురించి కొందరు రైతులకు తెలుసు. అందుకే వారు చిన్న చిన్న ఆరోగ్య సమస్యల పరిష్కారానికి ఈ మొక్కను వాడతారు. ఈ మొక్క ఆకులు చిరు చేదుగా ఉంటాయి. భోజన కుతూహలంలోని 12వ అధ్యాయంలో ఈ ఆకుల గురించి వర్ణనతో పాటుగా వీటిని ఏ విధంగా వాడాలనే విషయం కూడా ఉంది. ఇక ఈ ఆకులకు ఉన్న ఔషధ గుణాలేమిటో తెలుసుకుందాం.



- ఈ మొక్క పిత్త, కఫ దోషాలను నివారిస్తుంది. వేడి, పైత్యం వల్ల వచ్చే జ్వరాలను నివారిస్తుంది.
- ఈ మొక్క ఆకులను ఎండబెట్టి వాటితో టీ కాచుకొని తాగితే వెంటనే చెమటలు పట్టి జ్వరం తగ్గుతుంది.
- కొందరికి ప్రతి రోజూ రాత్రి అరికాళ్లలో మంటలు వస్తూ ఉంటాయి. వారికి ఈ మొక్క ఆకులు మంచి ఔషధంలా పనిచేస్తాయి.
- ఈ మొక్క ఆకులు అజీర్తిని తగ్గిస్తాయి. గ్యాస్ బాధకు ఇవి మంచి విరుగుడు.
- ఈ ఆకులు చర్మవ్యాధులను తగ్గిస్తాయి. అలర్జీల వల్ల చర్మంపై కలిగే దురదను నివారిస్తాయి. ఈ ఆకుల రసాన్ని రాస్తే చర్మం మృదువుగా మారుతుంది.
- ఈ ఆకులతో షడంగ పానీయం తయారుచేస్తారు. మంచి నీటిని తీసుకొని దానిలో పిత్తపాపడ ఆకులను వేసి బాగా మరిగించాలి. మామూలు నీళ్ల బదులుగా వీటిని తాగితే శరీరంలోని రకరకాల దోషాలు తొలగిపోతాయి. రోగనిరోధక శక్తి కూడా బాగా పెరుగుతుంది.
- ఈ ఆకులకు బైల్ అనే పిత్తస్రావాన్ని పెంచే శక్తి ఉంది. పిత్తస్రావం పెరిగితే కామెర్లు తగ్గుతాయి. కాలేయంలో వాపు ఉన్నా తగ్గుతుంది. చికెన్‌గున్యా, డెంగ్యూ వంటి జ్వరాల వచ్చినప్పుడు కూడా వీటిని తాగుతారు.

• గంగరాజు అరుణాదేవి

వంటిల్లు

వెలక్కాయతో వెరైటీ రుచులు...



వెలక్కాయలో పుల్లటి గుజ్జు ఉంటుంది. దానితో రకరకాల వంటకాలు చేస్తూ ఉంటాం. అదే వెలక్కాయ పండితే గుజ్జుకు కొద్దిగా తియ్యదనం వస్తుంది. ఈ గుజ్జులో బెల్లం లేదా చక్కెర కలుపుకొని పిల్లలు ఇష్టంగా తింటూ ఉంటారు. సీజనల్‌గా దొరికే పుల్లటి వెలక్కాయలతో చేసే వెరైటీ రుచులు మీకోసం...



వెలక్కాయ పులిహోర

కావాల్సిన పదార్థాలు

- బియ్యం- ఒక కప్పు, వెలక్కాయ- ఒకటి, నూనె- రెండు చెంచాలు, ఆవాలు- అర చెంచా, జీలకర్ర- అర చెంచా, పచ్చి శనగపప్పు- ఒక చెంచా, మినప్పప్పు- ఒక చెంచా, పల్లీలు- కొన్ని, జీడిపప్పు- కొన్ని, ఎండు మిర్చి- రెండు, ఇంగువ- చిటికెడు, పసుపు- పావు చెంచా, కరివేపాకు- కొద్దిగా, పచ్చిమిర్చి- మూడు, ఉప్పు- అర చెంచా

తయారీ విధానం

- బియ్యాన్ని కడిగి నీళ్లు పోసి పావుగంటసేపు నానబెట్టాలి. తరువాత పొడి పొడిగా ఉండేలా అన్నం వండుకోవాలి.
- వెలక్కాయను పగులగొట్టి లోపలి గుజ్జును పళ్లెంలోకి తీయాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి అర కప్పు నీళ్లు పోసి మరిగించాలి. అందులో వెలక్కాయ గుజ్జు వేసి బాగా కలిపి నాలుగు నిమిషాలు ఉడికించి దించాలి.
- స్టవ్ మీద వెడల్పాటి గిన్నె పెట్టి నూనె వేసి వేడి చేయాలి. ఆవాలు, జీలకర్ర, ఇంగువ, పసుపు, ఎండు మిర్చి, పల్లీలు, పచ్చి శనగపప్పు, మినప్పప్పు, కరివేపాకు, పచ్చిమిర్చి చీలికలు, జీడిపప్పు వేసి దోరగా వేపాలి. తరవాత ఉడికించిన వెలక్కాయ గుజ్జు, ఉప్పు వేసి కలిపి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ తాలింపు మిశ్రమాన్ని అన్నంలో వేసి బాగా కలపాలి. అంతే... కమ్మని వెలక్కాయ పులిహోర రెడీ..!

వెలక్కాయలో ఉండే సి విటమిన్, యాంటీ ఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. గుండె జబ్బులను నివారిస్తాయి. వాంతులు, విరేచనాలు, జ్వరం, మలబద్ధకం, అల్సర్ లాంటి సమస్యలకు వెలక్కాయ ఔషధంలా పనిచేస్తుంది.

కాల్చిన వెలక్కాయతో పచ్చడి

కావాల్సిన పదార్థాలు

- వెలక్కాయలు- రెండు, పచ్చిమిర్చి- పది, జీలకర్ర- ఒక చెంచా, ఉప్పు- తగినంత, బెల్లం- చిన్న ముక్క, కొత్తిమీర- కొద్దిగా



తయారీ విధానం

- వెలక్కాయలను కొద్దిగా పగులగొట్టాలి. వాటి మీద చిన్న బీటలు వస్తే చాలు. స్టవ్ వెలిగించి, గ్రిల్ పెట్టి దాని మీద వెలక్కాయలను ఉంచి, అన్ని వైపులకూ తిప్పుతూ నల్లగా కాల్చాలి. ఆపైన స్టవ్ మీద నుంచి తీసి చల్లార్చాలి. వాటి లోపల ఉండే గుజ్జును చెంచా సహాయంతో ఒక పళ్లెంలోకి తీయాలి. కొత్తిమీరను కాడలు తుంచి నీళ్లతో శుభ్రంగా కడగాలి. మిక్సీలో జీలకర్ర, కొత్తిమీర, పచ్చిమిర్చి ముక్కలు, బెల్లం, ఉప్పు వేసి కచ్చాపచ్చాగా గ్రైండ్ చేయాలి. వెలక్కాయ గుజ్జును కూడా వేసి మరోసారి గ్రైండ్ చేయాలి. తరువాత గిన్నెలోకి తీసి ఉప్పు సరిచూడాలి. ఇలా తయారుచేసుకున్న పచ్చడిని వేడి అన్నంలో కలుపుకొని తింటే రుచిగా ఉంటుంది.

వెలక్కాయతో చేసిన వంటకాలు తినడం వల్ల పొట్టలో పేరుకున్న గ్యాస్ తొలగిపోతుంది. అలసట, నీరసం, మూత్రపిండాల సమస్యలు మాయమవుతాయి. కాలేయం పూర్తిగా శుభ్రపడుతుంది. జీర్ణక్రియ వేగవంతమవుతుంది. మధుమేహం నియంత్రణలో ఉంటుంది.

వెలక్కాయ క్యాండీ

కావాల్సిన పదార్థాలు

- పండిన వెలక్కాయ- ఒకటి, బెల్లం- ఒక కప్పు, నిమ్మరసం- రెండు చెంచాలు, నల్ల ఉప్పు- అర చెంచా, కారం- అర చెంచా, జీలకర్ర పొడి- అర చెంచా, పంచదార పొడి- అర కప్పు, నెయ్యి- పావు చెంచా

తయారీ విధానం

- పండిన వెలక్కాయ నుంచి గుజ్జు తీయాలి. స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి రెండు గ్లాసుల నీళ్లు పోసి మరిగించాలి. అందులో వెలక్కాయ గుజ్జు వేసి బాగా కలుపుతూ అయిదు నిమిషాలు ఉడికించి దించాలి. ఈ గుజ్జును స్ట్రయినర్‌లో వేసి చిక్కని రసాన్ని వడబోయాలి. ఈ రసాన్ని బ్లెండర్‌తో బాగా కలపాలి. లేదంటే మిక్సీలో వేసి రెండు నిమిషాలు గ్రైండ్ చేసినా సరిపోతుంది.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి అందులో వెలక్కాయ రసం, బెల్లం వేసి బాగా కలపాలి. బెల్లం పూర్తిగా కరిగాక అందులో నిమ్మరసం, నల్ల ఉప్పు, కారం, జీలకర్ర పొడి వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమం... గిన్నెకు అంటుకోకుండా దగ్గరకు వచ్చే దాకా ఉడికించాలి. తరువాత నెయ్యి రాసిన పళ్లెంలోకి తీసి సమంగా పరచాలి. చల్లారిన తరవాత ముక్కలుగా కోయాలి. ఈ ముక్కల మీద చక్కెర పొడి చల్లి బాగా కలపాలి. పుల్లగా, తియ్యగా ఉండే ఈ క్యాండీలు ఆర్నెల్లపాటు నిల్వ ఉంటాయి.



సెలబ్ టాక్

పుట్టింది... పంజాబీ కుటుంబంలో. పెరిగింది ముంబయిలో. తెరంగేట్రం తెలుగులో. ఆరంభంలో తడబడినా... 'గదార్2'తో బాలీవుడ్‌లో మెగా హిట్ కొట్టారు సిమ్రత్ కౌర్ రంధ్వా. ప్రస్తుతం వివేక్ అగ్నిహోత్రి 'ది బెంగాల్ ఫైల్స్'లో ప్రధాన పాత్ర పోషిస్తున్న ఆమె జర్నీలో ఆసక్తికర అంశాలు కొన్ని.

ఆ పాత్ర పేరుతో పిలుస్తున్నారు



సిమ్రత్ కౌర్ మొట్టమొదట వెండితెరపై కనిపించింది 'ప్రేమతో మీ కార్తిక్' చిత్రంతో. 2017లో విడుదలైన ఆ సినిమాలో హీరో కార్తికేయకు జతగా నటించారు. ఆ తరువాత 'డర్టీ హరీ, బంగార్రాజు' తదితర చిత్రాలు చేశారు. అయితే రెండేళ్ల కిందట విడుదలైన 'గదార్2'తో బాలీవుడ్‌లో మెగా ఎంట్రీ ఇచ్చారు సిమ్రన్. 'ముస్కాన్'గా నటించి అందరి మనసులు కొల్లగొట్టారు. అందుకే తన కెరీర్ గురించి మాట్లాడాలంటే... 'గదార్2'కు ముందు... తరువాత అంటారు సిమ్రన్. ఆ వెంటనే హిందీలోనే 'వన్‌వాస్' చేశారు. ప్రస్తుతం ప్రముఖ దర్శకుడు వివేక్ అగ్నిహోత్రి తెరకెక్కిస్తున్న 'ది బెంగాల్ ఫైల్స్'లో భారతి బెనర్జీ పాత్ర పోషిస్తున్నారు. ఈ పాత్ర చుట్టూనే కథ తిరుగుతుంది. "ఇది యువతరం చూడాల్సిన చిత్రం. ఎందుకంటే వాళ్లకు మన చరిత్ర తెలియాలి. ఇక ఇందులో ప్రముఖ నటులు మిథున్ చక్రవర్తి, అనుపమ్‌ఖేర్, దర్శన్ కుమార్, పల్లవి జోషి తదితరులు కనిపిస్తారు. ఎవరికివారే అద్భుతంగా నటించారు" అంటున్న సిమ్రత్ చేతిలో ఇప్పుడు మరో భారీ బడ్జెట్ చిత్రం 'గదార్3' కూడా ఉంది.

అనుకోకుండా ఇటు వైపు...

ముంబయి డాన్ బాస్కో ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ చదివిన సిమ్రత్... నటి అవుతానని ఎప్పుడూ అనుకోలేదట. మరి ఇటువైపు ఎలా వచ్చారని అడిగితే... "నటిని కావాలని నేను ఎప్పుడూ కోరుకోలేదు. అసలు సినిమాల్లో ప్రయత్నాలు కూడా చేయలేదు. ఏదో అలా జరిగిపోయింది అంతే. కానీ ఇక్కడ అవకాశాలు తెచ్చుకోవడమే కాదు, నిలదొక్కుకోవడం కూడా ఎంతో కష్టం. ముఖ్యంగా పరిశ్రమలో మనకంటూ ఎవరూ లేనప్పుడు... ఎటు వెళ్లాలి? ఎలా వెళ్లాలి? అనేవి తెలియవు. అడుగడుగునా ఇబ్బందులు, సవాళ్లు ఎదురవుతాయి. పరిశ్రమకు చెందిన వాళ్లకైనా ఇక్కడ పని దొరకడం అంత సులువు కాదు" అని ఓ సందర్భంలో గతాన్ని గుర్తు చేసుకున్నారు.

వెనక్కి తిరిగి చూసుకోలేదు...

అయితే 'గదార్2' తన జీవితాన్నే మార్చేసింది అంటారు సిమ్రత్. "2023 ఆగస్టు 10 వరకు నేను కేవలం సిమ్రత్‌ను మాత్రమే. ఆగస్టు 11 నుంచి జనం నన్ను 'ముస్కాన్' అంటూ పిలుస్తున్నారు. అంటే నా పాత్ర వారిని అంతగా ఆకట్టుకుందనే కదా. ఆ తరువాత నేను వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. ప్రస్తుతం బాలీవుడ్‌లో నా మూడో చిత్రం చేస్తున్నా. అది కూడా భారీ బడ్జెట్ ప్రాజెక్ట్"

అంటూ ఆనందంగా చెబుతున్న ఈ భామ... కొన్ని మ్యూజిక్ వీడియోల్లో కూడా సిమ్రత్ నటించారు. యూట్యూబ్‌లో వాటిని లక్షలమంది వీక్షించారు.

అనుభవ పాఠాలు...

బాలీవుడ్‌లో ఎంట్రీతోనే బ్లాక్‌బస్టర్‌ను చూసినా... ఆ తరువాత సిమ్రత్ చేసిన చిత్రాలు తక్కువే. సాధారణంగా అంతపెద్ద హిట్ తరువాత కొత్త ప్రాజెక్ట్‌లు వెతుక్కొంటూ వస్తాయి. ఇదే విషయం ఆమెను అడిగితే... ఎన్ని సినిమాలు చేసేమనే దానికన్నా చేసినవాటిలో ఎన్ని పాత్రలు గుర్తున్నాయన్నది ముఖ్యమంటారు. ఎనిమిదేళ్ల కెరీర్‌లో ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నానని, వాటి నుంచి పాఠాలు నేర్చుకున్నాని చెబుతారు. "హృదయరేఖ నేరుగా వెళితే మనం చనిపోయినట్టు. ఆ రేఖ ఎప్పుడూ ఎత్తుపల్లాలుగానే ఉండాలి'... ఈ మాటలే నాకు నిత్య స్ఫూర్తి. కిందకు పడిపోయిన సందర్భాలు నాకు తిరిగి పుంజుకొనే శక్తినిస్తాయి" అంటూ చెప్పుకొచ్చిన సిమ్రత్... ఈ ఎనిమిదేళ్లల్లో ఎనిమిదే సినిమాల్లో కనిపించారు. ఇప్పుడు ఒక చిత్రం విడుదలకు, మరొక మెగా ప్రాజెక్ట్ పట్టాలు ఎక్కడానికి సిద్ధంగా ఉన్నాయి.



ప్రేరణ

హూలా హూప్ క్వీన్

ఫ్లో ఆర్ట్‌లో భాగమైన హూలా హూప్‌లో రాణిస్తూ, ఆ క్రీడను అటు వృత్తిపరంగా, ఇటు ప్రవృత్తిపరంగా రెండు విధాలా సద్వినియోగం చేసుకుంటోంది బెంగుళూరుకు చెందిన సుప్రియ శ్రీవాత్సవ. మానసిక, శారీరక వికాసానికి ఈ క్రీడ తోడ్పడుతుందంటున్న సుప్రియ ఔత్సాహికుల కోసం శిక్షణ కేంద్రాన్ని కూడా నడుపుతోంది. మరిన్ని వివరాలు ఆమె మాటల్లోనే...

2015లో హూప్స్ పట్ల నాకు ఆసక్తి యాదృచ్ఛికంగా ఏర్పడింది. అందుకు ఒక రష్యా మహిళకు ధన్యవాదాలు చెప్పుకోవాలి. ఆ సమయంలో నేను గోవాలో ఒక హాస్టల్‌లో ఉన్నాను. అక్కడే బస చేస్తున్న ఒక రష్యన్ మహిళ... భారతీయ మహిళలను చులకనగా మాట్లాడడం మొదలుపెట్టింది. దాంతో మన మహిళల సత్తాను నిరూపించడానికి అక్కడే ఉన్న ఒక హూప్‌ను తీసుకుని నడుముకు తగిలించుకుని గుండ్రంగా తిప్పే ప్రయత్నం చేశాను. నిజానికి హూప్‌ను ఉపయోగించడం నాకదే మొదటిసారి. అయినా ఎంతో అనుభవం ఉన్నట్టు హూప్‌ను గిరగిరా తిప్పేసి, అందర్నీ ఆశ్చర్యానికి గురి చేశాను. హూప్‌తో అనుబంధం నాకు ఆ సమయంలోనే ఏర్పడింది. అయితే అప్పటికే అమెజాన్‌లో పనిచేస్తున్నాను. ఎక్కువ గంటలు పని చేయడం వల్ల హూప్‌తో ఆడడానికి ఎక్కువ సమయం దొరికేది కాదు. అయినా వారాంతాల్లో, తీరిక దొరికిన ప్రతిసారీ హూప్‌ను సాధన చేయడం మొదలుపెట్టాను. శ్రావ్యమైన సంగీతం వింటూ, హూప్‌ను నడుముకు తగిలించుకుని గిరగిరా తిప్పుతుంటూ ఉంటే, ఒత్తిడి తొలగి మనసు తేలికవడంతో పాటు శరీర దారుఢ్యం కూడా పెరుగుతున్నట్టు క్రమేపీ గ్రహించాను. అలా ఒక ఏడాదిలోనే హూలా హూప్‌లో పరిణతి సాధించాను.



కుంగుబాటు నుంచి కోలుకుని...

'విద్య పంచుకుంటే పెరుగుతుంది' అని నా కుటుంబం నేర్పింది. అలాంటి కుటుంబం నుంచి వచ్చాను కాబట్టి హూలా హూప్‌తో ఒరిగే ప్రయోజనాలను నలుగురికీ నేర్పించాలనుకున్నాను. అందుకే యూట్యూబ్ ఛానల్ నడపడంతో పాటు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ తరగతులు మొదలుపెట్టేశాను. అలాగే వేడుకల్లో హూలా హూప్ విన్యాసాలను ప్రదర్శించి అందరికీ అవగాహన కల్పించడం కొనసాగించాను. నిజానికి మానసిక సమస్యలతో కుంగిపోయిన నాకు ఈ కొత్త అభిరుచి కొత్త జీవితాన్ని అందించింది. నా మీద నాకు నమ్మకం ఏర్పడింది. నాలా ఎన్నో రకాల కుంగుబాట్లకు లోనై, నిరాశా నిస్పృహలతో జీవితాలను వెళ్లదీస్తున్నవాళ్లు ఎంతోమంది ఉంటారు. నా జీవితంలో ఊహించని సంఘటనలు జరిగాయి. 21 ఏళ్ల వయసులో లైంగిక వేధింపులకు గురయ్యాను. ఆ ప్రభావం నన్ను ఆరు నెలల పాటు కుంగదీసింది. అయినా కోలుకొని ఆ తర్వాత మింత్రలో, అమెజాన్‌లో వృత్తి జీవితాన్ని కొనసాగించాను. ఏడేళ్ల పాటు పర్పుల్ ఫిల్టర్ అనే ఫ్రీలాన్స్ ఏజెన్సీని కూడా నడిపాను. ఓ పక్క హూలా హూప్ సాధన చేస్తూనే, వృత్తి జీవితాన్ని కొనసాగించాను. చివరకు 2023 డిసెంబరు నుంచి, ఫ్లో ఆర్ట్‌నే పూర్తి స్థాయి వృత్తి జీవితంగా మార్చుకున్నాను.



వృత్తిగా మలుచుకోవచ్చు

హూప్స్ అనగానే అందరికీ సర్కస్ కళాకారులు గుర్తొస్తారు. దాంతో ఈ కళను చులకనగా చూస్తూ ఉంటారు. కానీ నిజానికి శరీరాకృతి, బరువుకు తగిన హూప్‌ను ఎంచుకుంటే సులభమైన విన్యాసాలు సాధ్యపడతాయి. ఫ్లో ఆర్ట్‌ను వృత్తిగా మలుచుకునేవాళ్లు శరీర భంగిమ, ఆకృతి, బరువుల మీద దృష్టి పెట్టాలి. శరీరం స్పందించే తీరుకు తగ్గట్టు విన్యాసాలను రూపొందించుకోవాలి. హూప్‌ను ఒక గమ్యంగా కాకుండా ఒక ప్రయాణంగా భావించి, తగిన మెలకువలను అనుసరిస్తూ, సృజనాత్మకతను ప్రదర్శించగలిగితే ఈ కళలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు.

మేకప్

చిట్కాలతో చమక్కు

మేకప్‌తో అన్ని లోపాలనూ సరిదిద్దడం సాధ్యపడకపోవచ్చు. కానీ వేసుకునే మేకప్‌లో కొన్ని మెలకువలు పాటించగలిగితే, రెట్టింపు ఫలితాన్ని పొందవచ్చు. అదెలాగంటే...

- **కనురెప్పలు దట్టంగా:** పలుచని కనురెప్పలు దట్టంగా కనిపించడం కోసం మస్కారా వేసుకుంటాం. అయితే మస్కారాతో వేసుకున్నంత మాత్రాన దట్టంగా కనిపించే పరిస్థితి ఉండదు. ఇలాంటప్పుడు కొద్దిపాటి వెంట్రుకలతో మరింత దట్టంగా కనురెప్పలు కనిపించాలని అనుకుంటే ఒక చిట్కా పాటించాలి. మస్కారా కంటే ముందు కనురెప్పలకు ఐషాడో బ్రష్‌తో ఫేస్ పౌడర్‌ను పట్టించాలి. దీంతో కనురెప్పలకు ల్యాష్ ఫైబర్ మస్కారా ఎఫెక్ట్ కలుగుతుంది. ఈ తర్వాత మస్కారా అప్లై చేస్తే, కనురెప్పలు దట్టంగా కనిపిస్తాయి.
- **లిప్‌స్టిక్ చెదరకుండా:** కొందరికి నాలుకతో పెదవులు తడుపుకొనే అలవాటు ఉంటుంది. ఇంకొందరికి పెదవులు కొరుక్కొనే అలవాటు ఉంటుంది. దాంతో లిప్‌స్టిక్ చెదిరిపోతుంది కాబట్టి ఎక్కువ సమయం పాటు లిప్‌స్టిక్ చెదిరిపోకుండా ఉండడం కోసం ఒక చిట్కాను ఉపయోగించాలి. అందుకోసం మొదట లిప్ లైనర్‌తో పెదవుల చుట్టూ ఔట్‌లైన్ గీసుకోవాలి. తర్వాత లిక్విడ్ లిప్‌స్టిక్‌తో పెదవులను నింపేయాలి. దీనిపైన అదే షేడ్ క్రీమీ లిప్‌స్టిక్ అప్లై చేయాలి. తర్వాత, బ్రష్‌తో లూజ్ పౌడర్ తీసుకుని, పెదవులపైన టిష్యూ పేపర్‌ను ఉంచి, ఆ పౌడర్‌ను అద్దాలి. దీంతో లిప్‌స్టిక్ మ్యాటిఫై అయిపోయి, పెదవులకు హత్తుకుపోతుంది. ఈ చిట్కాతో లిప్‌స్టిక్ రోజంతా చెదిరిపోకుండా ఉంటుంది.



- **ముఖం మెరిసేలా:** ఇందుకోసం ప్రత్యేకించి స్ట్రోబింగ్ క్రీమ్ దొరుకుతుంది. ఇది లేని వాళ్లు ఒక చిన్న కిటుకుతో అదే ఫలితాన్ని రాబట్టవచ్చు. అందుకోసం ఒక చిన్న గిన్నెలో లిప్ బామ్ తీసుకుని, రోజ్‌గోల్డ్ షిమ్మరీ ఐషాడో జోడించి బాగా కలపాలి. దీన్ని బేస్ మేకప్ అడుగున అప్లై చేసుకుని, ఆ తర్వాత మేకప్ మొదలుపెట్టాలి. ఇలా చేస్తే, ఈ మిశ్రమం స్ట్రోబింగ్ క్రీమ్‌లా చర్మానికి మెరుపునిస్తుంది.

స్పోర్ట్స్



దక్షిణేశ్వర్ సురేష్

తొలిరోజు మనదే

● సింగిల్స్‌లో దక్షిణేశ్వర్, సుమిత్ గెలుపు

● భారత్ 2-0 ● స్విట్జర్లాండ్‌తో డేవిస్ కప్

బీల్ (స్విట్జర్లాండ్): డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్-1లో భాగంగా ఆతిథ్య స్విట్జర్లాండ్‌తో పోరులో తొలిరోజు భారత్‌దే పైచేయి అయింది. శుక్రవారం జరిగిన సింగిల్స్, రివర్స్ సింగిల్స్ మ్యాచుల్లో భారత ఆటగాళ్లు గెలవడంతో 2-0 ఆధిక్యం లభించింది. అయితే, ప్రధానంగా తొలిసారి డేవిస్ కప్ ఆడుతున్న తమిళనాడుకు చెందిన దక్షిణేశ్వర్ సురేష్ తనకంటే మెరుగైన ర్యాంకరైన ప్రత్యర్థిని ఓడించడం మొదటిరోజు ఆటలో విశేషం. తొలి సింగిల్స్‌లో 626వ ర్యాంకర్ దక్షిణేశ్వర్ 7-6 (5), 6-3తో 155వ ర్యాంకరైన జెరోమ్ కిమ్‌ను చిత్తు చేసి సంచలనం సృష్టించాడు. అనంతరం జరిగిన రివర్స్ సింగిల్స్‌లో అనుభవజ్ఞుడైన సుమిత్ నగల్ 6-3, 7-6(4)తో మార్క్ ఆండ్రియా హస్లెర్‌పై గెలిచి భారత్‌కు 2-0 ఆధిక్యాన్ని అందించాడు. ఇక, శనివారం జరిగే డబుల్స్ మ్యాచ్‌లో శ్రీరామ్ బాలాజీ/బొల్లిపల్లి రిత్విక్ చౌదరి జోడీ బరిలోకి దిగనుంది.

స్టార్లతో కళకళ

నేటినుంచి వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్

భారత ఆశలన్నీ నీరజ్‌పైనే



నీరజ్

స్టార్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం

నేటి భారత షెడ్యూల్

ఉ. 4 గం.: పురుషుల 35 కి.మీ. రేస్ వాక్-రాంబాబు, సందీప్; మహిళల 35 కి.మీ. రేస్‌వాక్-ప్రియాంక గోస్వామి

సా. 4.30: మహిళల 1500 మీ. హీట్-పూజ

టోక్యో: ఒలింపిక్స్ తర్వాత అథ్లెటిక్స్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైనది ప్రపంచ చాంపియన్‌షిప్స్. విశ్వవ్యాప్త ప్రఖ్యాత అథ్లెట్ల సత్తాకు పరీక్షగా నిలిచే ఈ చాంపియన్‌షిప్స్ శనివారం టోక్యోలో ప్రారంభం కానున్నాయి. ఈనెల 21 వరకు జరిగే పోటీలలో 200 జట్ల నుంచి 2000 మంది అథ్లెట్లు తలపడుతున్నారు. 49 విభాగాలలో మొత్తం 147 పతకాలకోసం హోరాహోరీ పోరు జరగనుంది. షెల్లీ ఆన్ ఫ్రేజర్ ప్రైస్, షకారీ రిచర్డ్‌సన్, నోవా లైల్స్, కిషానే థాంప్సన్, సిడ్నీ మెక్‌లాలిన్, ఆర్మాండ్ డుప్లాంటిస్, నీరజ్ చోప్రా వంటి మేటి అథ్లెట్లు ఫ్యాన్స్‌ను అలరించనున్నారు.

షెల్లీ ఘనంగా ముగిస్తుందా..?

ఈసారి వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో జమైకా స్ప్రింట్ దిగ్గజం, మహిళల 100 మీ. స్ప్రింట్ రారాణి షెల్లీ ఆన్ ఫ్రేజర్ ప్రైస్‌పై అందరి దృష్టి నిలిచింది. 38 ఏళ్ల స్టార్ ఈ పోటీల తర్వాత ట్రాక్ నుంచి రిటైర్ కానుంది. మూడు ఒలింపిక్, 10 ప్రపంచ చాంపియన్‌షిప్స్ స్వర్ణ పతకాల విజేత షెల్లీ టైటిల్‌తో ఘనమైన వీడ్కోలు తీసుకోవాలని భావిస్తోంది. అలాగే మహిళల 100, 200 మీ.లలో అమెరికన్ క్వీన్ షకారీ రిచర్డ్‌సన్ ప్రధాన ఆకర్షణ కానుంది. గత వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో నెగ్గిన 100 మీ. టైటిల్‌ను నిలబెట్టుకోవాలని రిచర్డ్‌సన్ పట్టుదలగా ఉంది. గాయాలతో సతమతమవుతున్న పురుషుల 100.మీ., 200 మీ.ల డిఫెండింగ్ చాంపియన్ నోవా లైల్స్ (అమెరికా) టైటిళ్లు నిలబెట్టుకుంటాడేమో చూడాలి. సీజన్‌లో అద్భుత ఫామ్‌లో ఉన్న జమైకా స్ప్రింటర్ కిషానే థామ్సన్..నోవాకు గట్టి పోటీ ఇవ్వనున్నాడు. బరిలో దిగిన ప్రతి టోర్నీలో రికార్డులు నమోదు చేస్తున్న పురుషుల పోల్‌వాల్ట్ మొనగాడు ఆర్మాండ్ డుప్లాంటిస్ టోక్యోలో నెలకొల్పే రికార్డుపై ఉత్కంఠ ఏర్పడింది. ఇంకా భారత స్టార్ నీరజ్ చోప్రా, మహిళల 400 మీ. హర్డిల్స్‌లో ప్రపంచ రికార్డు గ్రహీత సిడ్నీ మెక్‌లాలిన్ (అమెరికా), మహిళల 1500, 5వేల మీ.లలో కిప్‌యేగాన్ (కెన్యా) మెరుపులు చూసి తీరాల్సిందే.



డుప్లాంటిస్

టైటిల్‌పై నీరజ్ గురి

భారత్ ఆశలన్నీ సూపర్ స్టార్ నీరజ్ చోప్రాపైనే నిలిచాయి. 2023 బుడాపెస్ట్ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో జావెలిన్ పసిడి పతకంతో చరిత్ర సృష్టించిన నీరజ్.. ఆ టైటిల్‌ను నిలబెట్టుకోడమే ధ్యేయంగా బరిలోకి దిగుతున్నాడు. అయితే పాకిస్థాన్‌కు చెందిన ఒలింపిక్ చాంపియన్ అర్షద్ నదీమ్, చెక్ త్రోయర్ జాకబ్ వాల్డేచ్‌ల నుంచి నీరజ్‌కు తీవ్రమైన పోటీ ఎదురుకానుంది. ఇక..మొత్తం 19 మంది అథ్లెట్ల భారత బృందం టోక్యోలో తలపడుతోంది. కానీ పతక ఆశలు మాత్రం నీరజ్‌పైనే నిలిచాయి. ఈనెల 17న జావెలిన్ ఈవెంట్ మొదలు కానుంది. భారత్ నుంచి అన్నూరాణి (మహిళల జావెలిన్), పారుల్ చౌధరి (3000మీ స్టీపుల్ చేజ్), మురళీ శ్రీశంకర్ (లాంగ్ జంప్), గుల్వీర్ సింగ్ (5000మీ.), ప్రవీణ్ చిత్రవేల్ (ట్రిపుల్ జంప్) కూడా బరిలో ఉన్నారు.

ఫైనల్‌కు జైస్మిన్



జైస్మిన్

సెమీస్‌లో మీనాక్షి ● ప్రపంచ బాక్సింగ్

లివర్‌పూల్ (ఇంగ్లండ్): ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో భారత బాక్సర్ జైస్మిన్ లంబోరియా ఫైనల్ చేరింది. మహిళల 57 కిలోల విభాగం సెమీస్‌లో జైస్మిన్ 5-0తో ఒమైలిన్ అల్కాలా (వెనెజులా)ను చిత్తుచేసి కనీసం రజతం ఖాయం చేసుకుంది. మరో అమ్మాయి మీనాక్షి హూడా సెమీస్ చేరడంతో భారత్ ఖాతాలో మరో పతకం ఖరారైంది. 48 కిలోల విభాగం క్వార్టర్‌ఫైనల్లో మీనాక్షి 5-0తో అలైస్ పంప్రే (ఇంగ్లండ్)ను ఓడించింది. ఇక..పురుషుల విభాగంలో భారత్ పోరు ముగిసింది. బరిలో మిగిలిన జాదుమని సింగ్ 50 కిలోల కేటగిరీ క్వార్టర్‌ఫైనల్లో సాంఝర్ (కజకిస్థాన్) చేతిలో 0-4తో పరాజయం పాలయ్యాడు.

పాక్ శుభారంభం

ఒమన్‌పై ఘనవిజయం

ఆసియా కప్‌లో నేడు

బంగ్లాదేశ్ x శ్రీలంక

రాత్రి 8 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..



మహ్మద్ హరీస్ (66)

దుబాయ్: భారత్‌తో మ్యాచ్‌కు ముందు పాకిస్థాన్ జట్టు కూడా ఆత్మవిశ్వాసాన్ని పెంచుకుంది. ఆసియా కప్‌లో భాగంగా శుక్రవారం గ్రూప్ 'ఎ'లో ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో 93 పరుగుల తేడాతో నెగ్గింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' మహ్మద్ హరీస్ (43 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 66) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాక్ ఆరంభంలో తడబడినా.. చివరకు 20 ఓవర్లలో 7 వికెట్లకు 160 పరుగులు సాధించింది. ఓపెనర్ సహిబ్జాద ఫర్హాన్ (29), ఫఖర్ జమాన్ (23 నాటౌట్), మహ్మద్ నవాజ్ (19) పర్వాలేదనిపించారు. పేసర్ షా ఫైజల్, స్పిన్నర్ ఆమిర్ కలీమ్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో పాక్ బౌలర్ల ధాటికి ఒమన్ బ్యాటర్లు తేలిపోయారు. దీంతో ఆ జట్టు 16.4 ఓవర్లలో 67 పరుగులే చేసి చిత్తుగా ఓడింది. 10 పరుగుల వ్యవధిలోనే ఏడు వికెట్లు కోల్పోవడం గమనార్హం. హమ్మద్ మీర్జా (27) ఒక్కడే కాస్త పోరాడాడు. స్పిన్నర్లు సుఫియాన్, సయీమ్ అయూబ్‌లతో పాటు పేసర్ ఫహీమ్‌లకు రెండేసి వికెట్లు లభించాయి.

సంక్షిప్త స్కోర్లు


పాకిస్థాన్: 20 ఓవర్లలో 160/7 (మహ్మద్ హరీస్ 66, ఫర్హాన్ 29, ఫఖర్ 23; కలీమ్ 3/31, ఫైజల్ 3/34).

ఒమన్: 16.4 ఓవర్లలో 67 ఆలౌట్. (హమ్మద్ 27; ఫహీమ్ 2/6, సుఫియాన్ 2/7, సయీమ్ అయూబ్ 2/8).

సెమీస్‌లో సాత్విక్ జోడీ

● లక్ష్యసేన్ కూడా..

● హాంకాంగ్ ఓపెన్



హాంకాంగ్: భారత షట్లర్లు లక్ష్యసేన్, సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి హాంకాంగ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో టైటిల్ దిశగా దూసుకెళ్తున్నారు. సింగిల్స్‌లో లక్ష్యసేన్, డబుల్స్‌లో సాత్విక్ ద్వయం సెమీఫైనల్లో ప్రవేశించారు. ఇద్దరు భారత ఆటగాళ్ల మధ్య జరిగిన సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో లక్ష్య 21-16, 17-21, 21-13తో ఆయుష్ షెట్టిపై గెలుపొందాడు. గత మ్యాచ్‌లో 2024 ప్రపంచ చాంపియన్‌షిప్ రన్నరప్ కొడాయి నరౌకాకి షాకిచ్చి సంచలనం సృష్టించిన ఆయుష్.. లక్ష్యతో పోరులో మాత్రం తడబడ్డాడు. అయితే ఓడినా.. ఆయుష్ గెలుపు కోసం చివరిదాకా పోరాడిన తీరు ఆకట్టుకుంది. గంటా ఆరు నిమిషాల పాటు సాగిన హోరాహోరీ పోరులో తొలి గేమ్ ఓడినా, రెండో గేమ్‌లో లక్ష్యపై పైచేయి సాధించి మ్యాచ్ గెలిచేలా కనిపించాడు. కానీ, నిర్ణాయక మూడో గేమ్ ఆఖర్లో పలుమార్లు ఔట్ షాట్‌లు కొట్టి మ్యాచ్‌ను చేజార్చుకున్నాడు. ఫైనల్ బెర్త్ కోసం తైవాన్ షట్లర్, మూడో సీడ్ చో తిన్ చెన్‌తో లక్ష్య అమీతుమీ తేల్చుకోనున్నాడు. పురుషుల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్స్‌లో 8వ సీడ్ సాత్విక్/చిరాగ్ జంట 21-14, 20-22, 21-16తో మలేసియా జోడీ ఆరిఫ్ జునైది/రాయ్ కింగ్ యాప్‌ను ఓడించింది. ఇటీవలే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకంతో సత్తా చాటిన సాత్విక్ ద్వయం సెమీఫైనల్లో తైవాన్ జోడీ చెన్ చెంగ్ కాన్/లిన్ బింగ్ వీతో తలపడనుంది.

గాథ పోరు ముగిసె..

● నెంబర్‌వన్ చేతిలో ఓటమి

● ఆర్చరీ ప్రపంచ చాంపియన్‌షిప్స్

గ్వాంగ్జు (దక్షిణ కొరియా): ఆర్చరీ ప్రపంచ చాంపియన్‌షిప్స్ రికర్వ్ విభాగంలో భారత్‌కు ఈసారీ నిరాశ తప్పలేదు. మహిళల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో ప్రీక్వార్టర్స్ చేరి టైటిల్‌పై ఆశలు రేపిన 15 ఏళ్ల గాథ ఖడాకే పోరాటం ముగిసింది. ప్రపంచ నెంబర్‌వన్, పారిస్ ఒలింపిక్స్‌లో మూడు స్వర్ణాల విజేత లిమ్ షియోన్ (కొరియా)తో జరిగిన పోరులో గాథ 0-6తో ఓటమిపాలైంది. ప్రపంచ చాంపియన్‌షిప్స్ రికర్వ్ విభాగంలో భారత్ చివరిసారిగా 2019లో పురుషుల జట్టు రజతం నెగ్గింది. కాగా, ఈసారి టోర్నీలో కాంపౌండ్ ఈవెంట్‌లో పురుషుల జట్టు స్వర్ణం, మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో జ్యోతి సురేఖ/రిషభ్ జోడీ రజతం నెగ్గిన సంగతి తెలిసిందే.

యష్, రజత్ శతకాలు

● సెంట్రల్ జోన్ 384/5 ● 'సౌత్'తో దులీప్ ట్రోఫీ ఫైనల్

బెంగళూరు: దులీప్ ట్రోఫీ ఫైనల్లో సెంట్రల్ జోన్ రెండో రోజే పట్టు బిగించింది. యష్ రాథోడ్ (137 బ్యాటింగ్), కెప్టెన్ రజత్ పటీదార్ (101) శతకాల సహాయంతో.. శుక్రవారం ఆట ముగిసే సమయానికి సెంట్రల్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 384/5 స్కోరు సాధించింది. ప్రస్తుతం జట్టు 235 పరుగుల భారీ ఆధిక్యంలో నిలిచింది. ఓపెనర్ మలేవర్ (53) హాఫ్ సెంచరీ చేయగా, క్రీజులో యష్‌తో పాటు సారాంశ్ (47 బ్యాటింగ్) ఉన్నాడు. లెఫ్టామ్ పేసర్ గుర్జప్‌నీత్‌కు మూడు వికెట్లు దక్కాయి. సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 149 పరుగులకు కుప్పకూలిన విషయం తెలిసిందే.

బెంగళూరు హ్యాట్రిక్

జైపూర్: ప్రొ. కబడ్డీ లీగ్‌లో బెంగళూరు బుల్స్ జోరు ప్రదర్శిస్తూ వరుసగా మూడో విజయం సాధించింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో 28-23తో జైపూర్ పింక్ పాంథర్స్‌ను ఓడించింది. దీపక్ శంకర్ మరో 'హై ఫైవ్'తో అదరగొట్టగా, రైడర్ అలీరెజా 8 పాయింట్లతో సత్తా చాటాడు. జైపూర్‌లో నితిన్ కుమార్ (8) ఒక్కడే రాణించాడు. మరో మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్ 46-36తో బెంగాల్ వారియర్స్‌ను చిత్తు చేసింది.

ఇక దయచేయండి!



విరుష్కతో కివీస్ హోటల్ సిబ్బంది

న్యూఢిల్లీ: విరాట్ కోహ్లీ, అనుష్క జోడీని వెళ్లిపోవాలని న్యూజిలాండ్‌లోని ఓ హోటల్ సిబ్బంది కోరిన ఉదంతాన్ని టీమిండియా బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ వెల్లడించింది. గతంలో భారత పురుషులు, మహిళల జట్లు ఒకే సమయంలో కివీస్‌లో పర్యటించాయి. ఇరు జట్లూ ఒకే హోటల్‌లో బస చేశాయి. ఈక్రమంలో బ్యాటింగ్‌కు సంబంధించి సలహాలు ఇవ్వాలని స్మృతి మంధాన, జెమీమా..విరాట్‌ను కోరారు. దాంతో అదే హోటల్‌లోని కేఫ్‌కు రావాలని విరాట్ వారికి సూచించాడు. అప్పటికే కోహ్లీ, అనుష్క జోడీ అక్కడ ఉంది. దాదాపు నాలుగు గంటలపాటు విరాట్, మంధాన, జెమీమాతోపాటు అనుష్క మాట్లాడుకున్నారట. తొలి అరగంట క్రికెట్ విషయాలపై చర్చించగా.. ఆపై సాధారణ జీవితానికి సంబంధించిన మాటల్లోకి జారుకున్నట్టు జెమీమా వెల్లడించింది. అప్పటికే రాత్రి 11.30 కావడంతో కేఫ్ సిబ్బంది వచ్చి విరాట్, అనుష్కను అక్కడ నుంచి వెళ్లిపోవాలని సూచించినట్టు రోడ్రిగ్స్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది.

బిజినెస్

ఐపీఓ మార్కెట్లో సంస్కరణలు

● కనీస పబ్లిక్ షేర్ హోల్డింగ్‌పై కంపెనీలకు ఊరట

● 10 ఏళ్ల వరకు గడువు పెంపు

● సెబీ చైర్మన్ పాండే



ఇతర ప్రధాన నిర్ణయాలు

- రూ.250 కోట్లకు మించిన ఐపీఓల్లో యాంకర్ ఇన్వెస్టర్ల వాటా 10% నుంచి 15 శాతానికి పెంపు
- రూ.250 కోట్ల కంటే తక్కువ ఉండే ఐపీఓల్లో మదుపు చేసే యాంకర్ ఇన్వెస్టర్ల సంఖ్య 5 నుంచి 15 మధ్య ఉండాలి
- నియమిత మదుపరులకు సేవలు అందించే ఏఐఎఫ్‌లకు ఊరట
- రీట్స్, ఇన్విట్స్.. ఈక్విటీ పెట్టుబడులుగా వర్గీకరణ
- ప్రతి స్టాక్ ఎక్స్ఛేంజీలో ఇద్దరు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల నియామకం

ముంబై : దేశ క్యాపిటల్ మార్కెట్లో మరిన్ని సంస్కరణలకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ శ్రీకారం చుట్టింది. శుక్రవారం చైర్మన్ తుహిన్ కాంత పాండే అధ్యక్షతన జరిగిన బోర్డు సమావేశంలో సెబీ దీనికి సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా పెద్దమొత్తంలో మార్కెట్ క్యాపిటలైజేషన్ ఉన్న కంపెనీలకు పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)ల జారీలో మరింత వెసులుబాటు కల్పించాలని సెబీ నిర్ణయించింది. రూ.50,000 కోట్ల నుంచి రూ.లక్ష కోట్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ ఉన్న కంపెనీలు తమ ఈక్విటీలో 25 శాతం కనీస పబ్లిక్ షేర్‌హోల్డింగ్ (ఎంపీఎస్) కలిగి ఉండాలన్న గడువును ప్రస్తుత మూడేళ్ల నుంచి ఐదేళ్లకు పొడిగించారు. కంపెనీలు ఈ మొత్తాన్ని ఒకేసారి కాకుండా ముందు కనీసం 8 శాతం ఈక్విటీ షేర్లను జారీ చేసి, ఆ తర్వాత మిగతా 17 శాతం ఈక్విటీ షేర్లను దశలవారీగా ఐపీఓల ద్వారా విక్రయించేందుకు అనుమతిస్తారు. రూ.లక్ష కోట్ల నుంచి రూ.5 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్ ఉన్న కంపెనీలు ఐదేళ్లలో జారీ చేయాల్సిన ఎంపీఎస్ ఈక్విటీ షేర్ల పరిమితినీ సెబీ సవరించింది. ప్రస్తుతం ఈ కంపెనీలు ఇందుకోసం ముందుగా 5 శాతం ఈక్విటీని ఎంపీఎస్‌గా జారీ చేయాలి. దీన్ని 2.75 శాతానికి కుదించాలని సెబీ నిర్ణయించింది. ఇక రూ.5 లక్షల కోట్ల కంటే ఎక్కువ మార్కెట్ క్యాప్ ఉన్న కంపెనీలు 25 శాతం ఎంపీఎస్‌కి చేరాల్సిన గడువునీ ప్రస్తుత ఐదేళ్ల నుంచి పదేళ్లకు పెంచారు. ఇందుకోసం ఈ కంపెనీలు ముందు తమ ఈక్విటీలో 2.5 శాతం షేర్లను ఐపీఓ ద్వారా జారీ చేస్తే సరిపోతుంది.

మిగతా 22.5 శాతం ఈక్విటీ షేర్లను మార్కెట్ పరిస్థితులను బట్టి పదేళ్లలో జారీ చేస్తే సరిపోతుంది.

పెద్ద కంపెనీలకు ఊరట: సెబీ తాజా నిర్ణయం త్వరలో పబ్లిక్ ఇష్యూకి వచ్చే రిలయన్స్ జియో, ఎన్ఎస్ఈలకు మేలు చేస్తుందని భావిస్తున్నారు. సెబీ నిబంధనలకు అనుగుణంగా ఒకేసారి పెద్ద మొత్తంలో ఐపీఓలు జారీ చేస్తే.. ఆ ఇష్యూలను భరించే శక్తి మార్కెట్‌కు లేకపోవడంతో పాటు సెకండరీ మార్కెట్ కూడా తీవ్ర ఆటుపోట్లకు లోనవుతోంది. నిర్దీత గడువులోనే దశల వారీగా ఈ వాటా విక్రయించేందుకు అనుమతించాలని కంపెనీలు ఎప్పటి నుంచో కోరుతున్నాయి. సెబీ ఎట్టకేలకు శుక్రవారం దీనికి ఆమోదం తెలిపింది.

రిటైల్ మదుపరులకు ఊరట: ప్రస్తుతం రూ.5,000 కోట్లకు మించిన ఐపీఓ ఇష్యూల్లో రూ.2 లక్షల లోపు పెట్టుబడితో దరఖాస్తు చేసే రిటైల్ మదుపరులకు 35 శాతం షేర్లు కేటాయిస్తున్నారు. దీన్ని 25 శాతానికి కుదించాలని సంస్థాగత మదుపరుల నుంచి ఒత్తిడి వచ్చింది. అయినా ఈ వాటాను యథాతథంగా 35 శాతం వద్దే కొనసాగించాలని నిర్ణయించినట్టు సెబీ చైర్మన్ పాండే చెప్పారు. క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ బయ్యర్స్ (క్యూఐబీ)కు కేటాయించే 50 శాతం వాటానూ అలాగే కొనసాగించాలని సెబీ నిర్ణయించింది.

ఎఫ్‌పీఐల పెట్టుబడులకు సింగిల్ విండో: భారత స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టే విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ)కు సింగిల్ విండో విధానాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. దీని ద్వారా తక్కువ రిస్క్ కలిగిన ఎఫ్‌పీఐల పెట్టుబడులను ఆకర్షించవచ్చని భావిస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా సింగిల్ విండో ఆటోమేటిక్ అండ్ జనరలైజ్ యాక్సెస్ ఫర్ ట్రస్టెడ్ ఫారిన్ ఇన్వెస్టర్స్ (స్వాగత్-ఎఫ్ఐ) పేరుతో కొత్త ముసాయిదాను రూపొందించింది. కాగా దేశంలో ప్రతి నెలా 100 ఎఫ్‌పీఐలు నమోదవుతూ వస్తున్నాయని సెబీ తెలిపింది. ఏడాది క్రితం 10,500 ఎఫ్‌పీఐలు నమోదై ఉండగా ప్రస్తుతం ఈ సంఖ్య 12,000 దాటిందని పేర్కొంది.

అపోలో హాస్పిటల్స్ చేతికి అపోలో హెల్త్

● ఐఎఫ్‌సీ నుంచి 31 శాతం వాటా కొనుగోలు

● డీల్ విలువ రూ.1,254 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అపోలో హెల్త్ అండ్ లైఫ్‌స్టైల్ లిమిటెడ్ (ఏహెచ్ఎల్ఎల్) పూర్తి స్థాయిలో అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏహెచ్ఈఎల్) అనుబంధ సంస్థ కానుంది. ఇందుకోసం ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ) చేతిలో ఉన్న 31 శాతం వాటాను ఏహెచ్ఈఎల్ రూ.1,254.07 కోట్లకు కొనుగోలు చేయనుంది. శుక్రవారం జరిగిన సమావేశంలో ఏహెచ్ఈఎల్ డైరెక్టర్ల బోర్డు ఈ షేర్ల కొనుగోలు ఒప్పందానికి ఆమోదం తెలిపింది. దీంతో ఏహెచ్ఎల్ఎల్ ఈక్విటీలో ఏహెచ్ఈఎల్ వాటా 99.42 శాతానికి చేరుతుంది. మిగతా 0.58 శాతం షేర్లు ఈ-సాప్స్ కింద ఉద్యోగుల వద్ద ఉంటాయి. ఏహెచ్ఎల్ఎల్ కార్యకాపాలపై పూర్తి నియంత్రణ, యాజమాన్యం కోసం ఐఎఫ్‌సీ నుంచి ఈ వాటాలను కొనుగోలు చేస్తున్నట్టు ఏహెచ్ఈఎల్ రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. దీనివల్ల ఏహెచ్ఎల్ఎల్ నిర్వహణ సామర్థ్యం మరింత మెరుగుపడడంతో పాటు, ఆ సంస్థ వ్యాధి నిర్ధారణ సేవలను ఏహెచ్ఈఎల్‌తో పూర్తి స్థాయిలో అనుసంధానించేందుకు వీలవుతుందని పేర్కొంది. ఈ చర్య అపోలో గ్రూప్ సమగ్ర ఆరోగ్య సేవలకు మరింత విలువ జోడిస్తుందని అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ ఎండీ సునీతా రెడ్డి తెలిపారు. ఏహెచ్ఎల్ఎల్‌పై పూర్తి పట్టు ద్వారా ఆ కంపెనీకి చెందిన ప్రాథమిక ఆరోగ్య, వ్యాధి నిర్ధారణ సేవలు, మహిళల ఆరోగ్యం, డెంటల్, డయాలసిస్, అంబులెన్స్ సేవలను మరింత ముందుకు తీసుకు వెళతామని ఏహెచ్ఈఎల్ జాయింట్ ఎండీ సంగీతా రెడ్డి తెలిపారు.

గురుగ్రామ్‌లో క్యాన్సర్ కేర్ సెంటర్: గురుగ్రామ్‌లో రూ.573 కోట్ల పెట్టుబడితో అదనంగా సమగ్ర క్యాన్సర్ కేర్ సెంటర్ ఏర్పాటు చేసేందుకూ ఏహెచ్ఈఎల్ బోర్డు ఆమోదం తెలిపింది. ఈ కేంద్రం ద్వారా ఏటా అదనంగా 350 రోగులకు వైద్య సేవలు అందించవచ్చు. 2029 మార్చి నాటికి ఈ కేంద్రం ఏర్పాటు పూర్తవుతుంది.

మళ్లీ ధరలు సుర్..

ఆగస్టు ద్రవ్యోల్బణం 2.07%

న్యూఢిల్లీ: ద్రవ్యోల్బణం మరోసారి ఊర్ధ్వముఖ చలనం ప్రారంభించింది. కూరగాయలు, మాంసం, చేపలు, గుడ్ల ధరలు పెరగడంతో ఆగస్టు నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 2.07 శాతానికి చేరింది. ద్రవ్యోల్బణం జూలైలో 1.61%, గత ఏడాది ఆగస్టులో (-) 0.69% ఉంది. 9 నెలల పాటు వరుసగా తగ్గుతూ వచ్చిన వినియోగదారుల ధరల సూచీ ఆగస్టులో తొలిసారి ఎగువకు కదిలింది. అయితే ఆర్‌బీఐకి ప్రభుత్వం నిర్దేశించిన కట్టడి పరిధి 4% (2 శాతం ఎగువకు లేదా దిగువకు సద్దుబాటుతో)లోపే ఉంది. ఆగస్టు నెలలో ద్రవ్యోల్బణం గ్రామీణ ప్రాంతాల్లో 1.18% నుంచి 1.69 శాతానికి, పట్టణ ప్రాంతాల్లో 2.1% నుంచి 2.47 శాతానికి పెరిగింది. రాష్ట్రాల వారీగా చూస్తే కేరళలో గరిష్ఠంగా 9.04% ఉండగా అస్సోమ్‌లో కనిష్ఠంగా -0.66% ఉంది. ఆహార, ఇంధన విభాగాలు మినహా ఇతర విభాగాల్లో ద్రవ్యోల్బణం 4.3 శాతంగా ఉంది.

మార్కెట్లలో కొనసాగిన ర్యాలీ

ఇటు ఈక్విటీలు, అటు బులియన్ పరుగులు

ముంబై: అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న ఆశలతో పాటు ఇన్ఫోసిస్ ప్రకటించిన భారీ బైబ్యాక్ ఉత్తేజంతో శుక్రవారం కూడా ఈక్విటీ మార్కెట్లో ర్యాలీ కొనసాగింది. వరుసగా సెన్సెక్స్ ఐదో రోజు, నిఫ్టీ ఎనిమిదో రోజు లాభాల్లో ముగిశాయి. ఇంట్రాడేలో 444.12 పాయింట్లు లాభంతో 81,992.85 పాయింట్లను తాకిన సెన్సెక్స్ చివరికి 355.97 పాయింట్ల లాభంతో 81,904.70 వద్ద ముగిసింది. నిఫ్టీ 108.50 పాయింట్ల లాభంతో 25,114 వద్ద ముగిసింది. వారం మొత్తంలో సెన్సెక్స్ 1193.94 పాయింట్లు, నిఫ్టీ 373 పాయింట్లు లాభపడ్డాయి. వరుసగా 8 సెషన్లలో నిఫ్టీ 534 పాయింట్లు లాభపడింది.

బంగారం, వెండి భగభగ

బులియన్ మార్కెట్లో బంగారం, వెండి ధరల ర్యాలీ కూడా అప్రతిహతంగా కొనసాగుతోంది. ఢిల్లీ మార్కెట్లో 99.9% స్వచ్ఛత గల 10 గ్రాముల బంగారం ధర రూ.700 పెరిగి మరో జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.1,13,800 వద్ద ముగిసింది. 99.5% స్వచ్ఛత గల బంగారం ధర సైతం రూ.700 పెరిగి రూ.1,13,300 వద్ద స్థిరపడింది. రెండు రోజుల నష్టాలకు తెర దించిన వెండి ధర బలమైన పునరుజ్జీవం సాధించింది. కిలో వెండి రూ.4,000 పెరిగి జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.1,32,000 వద్ద స్థిరపడింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

13వ తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	550
వరంగల్	537	గోదావరి	545
చిత్తూరు	563	విశాఖపట్నం	555
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	121	విజయవాడ	140
వరంగల్	121	గుంటూరు	132
కరీంనగర్	121	ఒంగోలు	132
మహబూబ్‌నగర్	121	చిత్తూరు	118
కర్నూలు	121	నెల్లూరు	123
విశాఖపట్నం	144	అనంతపురం	123
గోదావరి	140		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,11,280 ▲	1,02,000 ▲	1,41,000 ▲
విజయవాడ	1,13,150 ▲	1,07,000 ▲	1,31,800 ▲
విశాఖపట్నం	1,13,040 ▲	1,00,540 ▼	1,42,000 ▲
రాజమండ్రి	1,11,270 ▲	1,02,000 ▲	1,28,300 ▲
ప్రొద్దుటూరు	1,13,200 ▼	1,04,140 ▼	1,31,600 ▲
ముంబై	1,09,707 ▲	1,00,492 ▲	1,28,008 ▲

హిందుస్థాన్ షిప్‌యార్డుకు కంపెనీ ఆఫ్ ది ఇయర్' అవార్డు

మల్కాపురం (ఆంధ్రజ్యోతి): హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్)కు 'షిప్ బిల్డింగ్ కంపెనీ ఆఫ్ ది ఇయర్' అవార్డు లభించింది. భారత నౌకాదళం కోసం డీపీ-2 డైవింగ్ సపోర్టు వెస్సెల్ నిర్మాణం, సంస్కరణలను విజయవంతంగా అమలు చేయడం, ఇతర నౌకా నిర్మాణ ప్రాజెక్టుల అభివృద్ధిలో అవలంబించిన వినూత్న విధానాలకు ఈ అవార్డును దక్కించుకుంది. ఈ నెల 11న ముంబైలో జరిగిన ఒక కార్యక్రమంలో షిప్‌యార్డు తరపున డిప్యూటీ జనరల్ మేనేజర్ (ప్రొడక్షన్స్) సీకే ఆనంద్ అవార్డును అందుకున్నారు.

● ఐటీసీ ఆశీర్వాద్.. అధిక ప్రొటీన్‌తో కూడిన గోధుమపిండిని మార్కెట్లోకి విడుదల చేసింది. సోయా, ఓట్స్, బెంగాల్‌గ్రామ్‌లతో కూడిన ఈ ఆటా.. ప్రతి రోజు వినియోగదారుల 25 శాతం ప్రొటీన్ అవసరాలను తీరుస్తుందని వెల్లడించింది. ఈ గోధుమపిండి కేజీ, 5 కేజీలతో వరుసగా రూ.80-86, రూ.386-416లతో లభించనుంది.

హైదరాబాద్ మార్కెట్లోకి విన్‌ఫాస్ట్

వీఎఫ్6, వీఎఫ్7 ఎలక్ట్రిక్ కార్లు విడుదల



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వియత్నాం కేంద్రంగా ఉన్న విన్‌గ్రూప్ జేఎస్‌సీ ఎలక్ట్రిక్ వాహన సంస్థ విన్‌ఫాస్ట్ ఇండియా.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లలోకి అడుగు పెట్టింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో తొలి షోరూమ్‌ను ప్రారంభించింది. శుక్రవారం నాడిక్కడ కంపెనీ డిప్యూటీ సీఈఓ అరుణోదయ్ దాస్.. గచ్చిబౌలి, బేగంపేటల్లో నానేష్ ఆటోమోటివ్స్ ఏర్పాటు చేసిన షోరూమ్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మార్కెట్లోకి విన్‌ఫాస్ట్ ప్రీమియం ఎలక్ట్రిక్ కార్లు వీఎఫ్6, వీఎఫ్7 విడుదల చేశారు. వినియోగదారుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని 10 ఏళ్ల బ్యాటరీ వారంటీతో ఈ కార్లను తీసుకు వచ్చినట్లు ఆయన చెప్పారు. కాగా, వీఎఫ్6 ప్రారంభ ధర రూ.16.49 లక్షలు, వీఎఫ్7 ప్రారంభ ధర రూ.20.89 (ఎక్స్‌షోరూమ్)గా నిర్ణయించినట్లు దాస్ తెలిపారు. ఈ ఏడాది చివరి నాటికి దేశవ్యాప్తంగా 27కి పైగా నగరాల్లో 35 డీలర్‌షిప్స్, 26 వర్క్‌షాప్స్‌ను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా హైదరాబాద్ మార్కెట్లో ఇప్పటికే 150కి పైగా కార్లకు బుకింగ్స్ వచ్చాయని, ఈ నెల 22 నుంచి వీటి డెలివరీలను ప్రారంభించనున్నట్లు నానేష్ ఆటో డైరెక్టర్ అక్షయ్ జైన్ తెలిపారు.

ఈశాన్యాన వెలుగు రేఖ!



బైరాబి-సాయ్‌రంగ్ లైన్‌లో బ్రిడ్జి నంబర్ 144 ఇది

మిజోరంలో ఇంజనీరింగ్ అద్భుతం.. కొండలు, లోయల గుండా రైల్వేలైన్ నిర్మాణం

రాజధాని ఐజ్వాల్‌కు ఇక రైళ్ల పరుగు.. బైరాబి-సాయ్‌రంగ్ లైన్ నేడు ప్రధానిచే ప్రారంభం

ఆకాశానికి నిచ్చెన వేస్తున్నట్టు అంతెత్తు పిల్లర్.. అది కూడా మామూలుగా కాదు.. అత్యంత ఎత్తైన రాతి కట్టడం కుతుబ్‌మినార్ (72 మీటర్లు) కంటే మరో 42 మీటర్లు ఎత్తున్న 114 మీటర్ల అతి భారీ పిల్లర్.. దానిపై ఇంజనీరింగ్ నైపుణ్యానికి అద్దం పట్టే ఇనుప బ్రిడ్జి.. కిందికి చూస్తే కళ్లు తిరిగే లోయ.. దాటి కాస్త ముందుకెళితే మరికొన్ని భారీ వరుస బ్రిడ్జిలు.. ఒక దాని వెంట ఒకటిగా వచ్చే పొడవాటి టన్నెళ్లు.. ఈశాన్య భారతాన సరికొత్త వెలుగురేఖలా పేర్కొనదగ్గ బైరాబి-సాయ్‌రంగ్ రైల్వే లైన్‌పై వెళుతున్నప్పుడు కనిపించే అద్భుతాలివి.. మిజోరం రాజధాని ఐజ్వాల్‌కు రైల్ కనెక్టివిటీ కోసం నిర్మించిన ఈ లైన్‌ను ప్రధాని మోదీ శనివారం స్వయంగా ప్రారంభించబోతున్నారు. ఈ సందర్భంగా దాని విశిష్టతలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

(ఐజ్వాల్ నుంచి 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ప్రతినిధి)

ఐజ్వాల్.. మిజోరం రాజధాని. ఎటు చూసినా పచ్చని అడవులతో నిండిన కొండలు. అగాధాలను తలపించే లోయలు. ఆ లోయల్లో జలజల పారే నీటి హొయలు. ప్రతి కొండ అంచున ప్రజల ఆవాసం. చదునైన ప్రాంతం ఉన్నా లేకున్నా, ప్రకృతి సవాళ్లకు ఎదురీదే రీతిలో లోయలోకి ఎప్పుడు జారిపోతాయో అనేలా నిర్మించిన ఇళ్లు. 20-25 అడుగుల లోతు నుంచి వేసిన కాంక్రీట్ పిల్లర్లు లేదా పొడవాటి వెదురు దుంగలతో నిర్మించిన ఇళ్లే ఆవాసం. కొండ అంచుకు, ఆ ఇళ్లకు మధ్య నుంచి వేసిన రోడ్లే ప్రయాణ మార్గాలు. ఇన్ని ప్రకృతి సవాళ్ల మధ్య జీవనం సాగించే ఐజ్వాల్ వాసుల జీవితాల్లో సరికొత్త వెలుగు రేఖ బైరాబి-సాయ్‌రంగ్ రైల్వే లైను. ఇళ్లు, రోడ్లు నిర్మించడమే సవాల్‌గా ఉండే మిజోరం లో నిర్మించిన 51.38 కిలోమీటర్ల ఈ లైను ఒక ఇంజనీరింగ్ అద్భుతమనే చెప్పాలి.

11 ఏళ్ల సుదీర్ఘ యజ్ఞం

అన్ని రాష్ట్రాల రాజధానులనూ రైల్ నెట్‌వర్క్‌తో కలపాలన్న లక్ష్యంలో భాగంగా మిజోరం రాజధాని ఐజ్వాల్‌కు రైల్వే లైన్ వేసే ప్రాజెక్టుకు ప్రధాని మోదీ 2014లో శంకుస్థాపన చేశారు. అప్పటిదాకా మిజోరంలోని బైరాబి వరకు మాత్రమే రైల్వే లైను ఉండేది. అసోం సరిహద్దుకు సమీపంలోని ఈ స్టేషన్ వరకు లైన్ ఉన్నప్పటికీ మిజోరం ప్రజలకు పెద్దగా ఉపయోగం లేదనే చెప్పాలి. అందుకే రాజధాని ఐజ్వాల్‌ను కలిపే లక్ష్యంతో ఈ బైరాబి నుంచి ఐజ్వాల్ పక్కనుండే సాయ్‌రంగ్‌కు లైన్ వేసే యజ్ఞాన్ని తలపెట్టారు. కానీ ఈ మార్గం పొడవునా ఎత్తైన కొండలు, భారీ లోయలే ఉన్నాయి. వాటన్నింటి మధ్య నుంచి ఎత్తుపల్లాల్లేకుండా సమాంతరంగా రైల్వే లైన్ నిర్మించడమంటే ఎన్నో వ్యయ ప్రయాసలతో కూడుకున్న పనే. రూ.5 వేల కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పూర్తయ్యే సరికి రూ.8 వేల కోట్లకు పైగా ఖర్చయ్యింది.


బైరాబి-సాయ్‌రంగ్ లైన్‌లో నిర్మించిన ఓ భారీ టన్నెల్

ఎన్నెన్నో సవాళ్లు!

మైదాన ప్రాంతంలో ఓ కొత్త రైల్వే లైను నిర్మించడానికే ఏళ్లకు ఏళ్లు పట్టడం మనం చూస్తుంటాం. అలాంటిది పూర్తిగా కొండలు, లోయలతో నిండి ఉన్న ప్రాంతంలో ప్రాజెక్టు అంటే ఇక చెప్పేదేముంది. కొండలను తొలిచి టన్నెల్స్ నిర్మించి, వందల అడుగుల లోతున్న లోయల నుంచి పిల్లర్స్ వేసి భారీ గర్డర్స్‌తో బ్రిడ్జిలు కడితే గానీ ముందుకు సాగని ప్రాజెక్టు ఇది. పైగా మిజోరంలో ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు వర్షాలు పడుతూనే ఉంటాయి. అంటే ఏడాదిలో నవంబరు నుంచి మార్చి వరకు 5 నెలలు మాత్రమే పనులు సాగేవి. ఇక వంతెనలు, టన్నెల్స్ నిర్మించాలంటే భారీ యంత్ర సామగ్రిని తరలించాలి. ఇది మరో సవాల్. వాటి తరలింపు కోసం ఏకంగా 200 కిలోమీటర్ల మేర రోడ్లు నిర్మించాల్సి వచ్చింది. ఈ భారీ ప్రాజెక్టుకు ఇసుక, కంకరతో సహా దాదాపు నిర్మాణ సామగ్రి మొత్తాన్ని అసోం, పశ్చిమ బెంగాల్, బిహార్, జార్ఖండ్ తదితర రాష్ట్రాల నుంచి తరలించాల్సి రావడం మరో సవాల్.

ఇంజనీరింగ్ అద్భుతం!

బైరాబి-సాయ్‌రంగ్ లైన్ మొత్తం పొడవులో 54% మేర బ్రిడ్జిలు, టన్నెల్సే ఉంటాయంటే ఇదెంత కష్టసాధ్యమైన ప్రాజెక్టు అనేది అర్థం చేసుకోవచ్చు. చిన్నవాటిని పక్కనపెట్టినా 55 ఎత్తైన బ్రిడ్జిలు కట్టారు. మరీ ముఖ్యంగా ఈ కొండ అంచు నుంచి ఆ కొండ అంచుకు మధ్యలో ఉన్న లోయ మీదుగా బ్రిడ్జిలు వేయడానికి దాదాపు ఆరుచోట్ల అతి ఎత్తైన పిల్లర్లు వేయాల్సి వచ్చింది. 70 మీటర్ల నుంచి 114 మీటర్ల ఎత్తున్న పిల్లర్లు నిర్మించి, వాటిని కలుపుతూ ఇనుప గర్డర్లతో వేసిన ఆ బ్రిడ్జిలను చూస్తే ఇంజనీర్ల శ్రమ కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది. అన్నిటికంటే ఎత్తైన 144వ నంబరు బ్రిడ్జి సాయ్‌రంగ్ స్టేషన్‌కు సమీపంలోనే ఉంది. మొత్తం 5 పిల్లర్లు ఉండగా, ఒక దాని ఎత్తు 114 మీటర్లు (374 అడుగులు). దేశంలోని రైల్వే ప్రాజెక్టుల్లో నిర్మించిన అతి ఎత్తైన పిల్లర్లలో ఇది రెండవది. మణిపూర్‌లో ఉన్న అతి భారీ పిల్లర్ ఎత్తు 141 మీటర్లు. ఇక కొండలను తొలుస్తూ వేసిన టన్నెల్స్ పొడవు మొత్తం లైన్‌లో 31 శాతం.

మారనున్న ముఖచిత్రం!

బైరాబి-సాయ్‌రంగ్ రైల్వే లైన్‌ను ఐజ్వాల్‌కు గేమ్ చేంజర్‌గా భావిస్తున్నారు. రాజధానికి రైల్ కనెక్టివిటీ ఏర్పడటంతో అభివృద్ధి కొత్త పుంతలు తొక్కనుంది. ముఖ్యంగా సరుకు రవాణా పెరగడంతో నిత్యావసరాల ధరలు తగ్గి ప్రజలకు పెద్ద ఊరట లభిస్తుంది. అలాగే మిజోరంలో విరివిగా లభించే అటవీ ఉత్పత్తులకు, ఉద్యాన ఉత్పత్తులకు, అక్కడ తయారయ్యే కళాకృతులకు బయటి మార్కెట్లు అందుబాటులోకి వస్తాయి. ఈ లైన్‌ను శనివారం ప్రధాని మోదీ ప్రారంభించగానే ఏకంగా ఢిల్లీకి కూడా రాజధాని ఎక్స్‌ప్రెస్ అందుబాటులోకి రావడం మిజోరం యువత ఉద్యోగావకాశాలను పెంచే అంశమే. ఇక పచ్చటి అందాలతో అలరారుతూ, ఏడాదిలో అత్యధిక కాలం జల్లులు పడుతుండే మిజోరంలో పర్యాటకం కొత్త పుంతలు తొక్కేందుకూ మార్గం సుగమమవుతుంది. తెలుగు రాష్ట్రాలతో సహా దేశంలోని పలు ప్రాంతాల పర్యాటకులు ఇకపై ఐజ్వాల్‌నూ తమ పర్యాటక గమ్యంగా ఎంచుకునే అవకాశముంది.

ఎన్నెన్నో విశేషాలు!

రైల్వే లైన్ పొడవు 51.38 కిలోమీటర్లు

ప్రాజెక్టు వ్యయం రూ.8,071 కోట్లు

ఎంత స్పీడ్‌కు అనుకూలం: గంటకు వంద కిలోమీటర్లు
మొత్తం బ్రిడ్జిలు: 144
వాటి పొడవు: 11.78 కిలోమీటర్లు
వాటిలో అతి పెద్దవి: 6
అత్యంత ఎత్తైన పిల్లర్: 114 మీటర్లు (374 అడుగులు)
ఆర్‌వోబీలు, ఆర్‌యూబీలు: 10
మొత్తం టన్నెళ్లు: 45
వాటి పొడవు: 15.88 కిలోమీటర్లు
వాటిలో అతి పొడవైనది: 1.8 కిలోమీటర్లు

అల్బేనియాలో 'ఏఐ మంత్రి'

» ప్రపంచంలోనే తొలిసారిగా..!



తిరానా, సెప్టెంబర్ 12: ఐరోపా దేశమైన అల్బేనియా ప్రపంచంలోనే తొలిసారిగా కృత్రిమ మేధ ఆధారంగా పనిచేసే ఒక మహిళా మంత్రిని నియమించింది. ఆ దేశ సంప్రదాయ దుస్తుల్లో కనిపించే ఈ ఏఐ మంత్రికి డియెల్లా అని పేరు కూడా పెట్టారు. అల్బేనియాలో అవినీతిని అరికట్టాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు దేశ ప్రధాని ఏడీ రామా ప్రకటించారు. ముఖ్యంగా పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్ విభాగంలో అవినీతి సమస్య అల్బేనియా ప్రభుత్వాన్ని చాలా ఏళ్లుగా వేధిస్తోంది. ఈ నేపథ్యంలోనే యూరోపియన్ యూనియన్‌లో చేరాలన్న అల్బేనియా కలను నెరవేర్చుకోవడానికి అవినీతి నిర్మూలన కీలకంగా మారిందని ప్రధాని రామా అభిప్రాయపడ్డారు. పబ్లిక్ టెండర్లలో అవినీతి జరగకుండా డియెల్లా నిఘా పెట్టనుందని, ప్రభుత్వ నిధులు పారదర్శకంగా కేటాయించేలా పర్యవేక్షిస్తుందని వెల్లడించారు.

గణేశ్ శోభాయాత్రపైకి దూసుకెళ్లిన కంటెయినర్

» హాసన్ జిల్లాలో 8 మంది మృతి.. పలువురికి గాయాలు

బెంగళూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): గణేశ్ నిమజ్జనోత్సవంలో ఊహించని ప్రమాదం జరిగింది. శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులపైకి మినీ కంటెయినర్ దూసుకువెళ్లింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందారు, 20 మందికిపైగా గాయపడ్డారు. హాసన్ జిల్లా మొసళె హొసహళ్లి గ్రామంలో శుక్రవారం రాత్రి నిమజ్జనం సందర్భంగా శోభాయాత్ర నిర్వహిస్తుండగా ఈ ఘటన జరిగింది. మృతుల కుటుంబాలకు సీఎం సిద్దరామయ్య రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు.

భార్య, కుమారుడి ముందే తెగనరికి..!

» అమెరికాలో కర్ణాటక వ్యక్తి దారుణ హత్య

» వెంటబడి కత్తితో నరికి చంపిన సహోద్యోగి

బెంగళూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పనిచేయని వాషింగ్‌మెషిన్ విషయంలో తలెత్తిన వివాదం అమెరికాలో ఓ భారతీయుడి ప్రాణాలు తీసింది. కర్ణాటకకు చెందిన చంద్రమౌళి నాగమల్లయ్య (50) అనే వ్యక్తిని అతని సహోద్యోగి అత్యంత కిరాతకంగా హత్యచేశాడు. చంద్రమౌళి భార్య, కుమారుడి ఎదుటే తల, మొండేన్ని వేరుచేసి కిరాతకంగా వ్యవహరించాడు. డల్లా‌స్‌లోని డౌన్‌టౌన్ సూట్స్ మోటెల్‌లో ఈ నెల 10న ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. 37 ఏళ్ల యోర్డానిస్ కొబోస్ మార్టినెజ్ ఈ హత్య చేసినట్లు గుర్తించిన డల్లాస్ పోలీసులు.. అతన్ని అదుపులోకి తీసుకున్నారు. డల్లాస్‌లోని డౌన్‌టౌన్ సూట్స్ మోటెల్‌లో నాగమల్లయ్య మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఈ మోటెల్‌లో చెడిపోయిన వాషింగ్‌మెషిన్ గురించి నాగమల్లయ్యకు అతని సహోద్యోగి యోర్డానిస్‌తో బుధవారం వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో నాగమల్లయ్యపై యోర్డానిస్ కత్తితో దాడి చేయడం సీసీ కెమెరాల్లో రికార్డయింది. ఈ దాడి నుంచి తప్పించుకునేందుకు నాగమల్లయ్య తన భార్య, 18 ఏళ్ల కుమారుడు ఉన్న మోటెల్ ఆఫీసు వద్దకు పరుగులు తీశారు. అతన్ని వెంటాడి మరీ దాడిచేసిన యోర్డానిస్.. నాగమల్లయ్య భార్య, కుమారుడి కళ్లెదుటే అతని తల, మొండేన్ని వేరుచేశాడు. నిందితుడికి గతంలో వాహన చోరీలు, దాడులకు పాల్పడిన నేర చరిత్ర ఉంది. సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా అగ్నిమాపకశాఖ అధికారులు మార్టినెజ్‌ను వెంబడించి అరెస్టు చేశారు. నేరం చేసినట్లు అంగీకరించాడని పోలీసులు తెలిపారు.

శ్యామలరావు అలిగారు!

» అనారోగ్య కారణాలతో 3 నెలల సెలవుకు దరఖాస్తు

» బాధ్యతలు స్వీకరించని అనంతరాము, దండే

అమరావతి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): సీనియర్ ఐఏఎస్ అధికారి శ్యామలరావు అలకబూనారు. టీటీడీ ఈవో పోస్టు నుంచి ఇటీవల ఆయన్ను తప్పించిన ప్రభుత్వం.. సాధారణ పరిపాలన శాఖ(పొలిటికల్) ముఖ్య కార్యదర్శిగా పోస్టింగ్ ఇచ్చింది. ఆ పోస్టు నచ్చకపోవడంతో సెలవుపై వెళ్లడానికి సిద్ధమయ్యారు. టీటీడీ ఈవోగా ఆయనకు బాధ్యతలు అప్పగించిన తర్వాత దేవస్థానం పాలనా వ్యవహారాల్లో ప్రతిష్టంభన ఏర్పడింది. టీటీడీ చైర్మన్, అధికారులతో వివాదాలతో పాటు భక్తులకు సరైన సదుపాయాలు కల్పించడంలో విఫలమయ్యారని శ్యామలరావుపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఆయన్ను బదిలీ చేశారు. ప్రభుత్వశాఖల్లో కీలక విభాగంలో పోస్టు కావాలని ఆయన కోరిన మేరకు జీఏడీ ముఖ్య కార్యదర్శిగా నియమించారు. అయితే, ఆయనకు ఈ పోస్టింగ్ నచ్చలేదని తెలుస్తోంది. దీంతో అనారోగ్య కారణాలతో 3నెలలు సెలవుపై వెళ్తున్నట్లు ప్రభుత్వానికి లేఖ సమర్పించారు. మరోవైపు ఇటీవల బదిలీల్లో గవర్నర్ స్పెషల్ సీఎస్‌గా అనంతరాము, అటవీ శాఖ ముఖ్య కార్యదర్శిగా కాంతిలాల్ దండేని ప్రభుత్వం నియమించింది. వీరిద్దరూ బాధ్యతలు స్వీకరించలేదు.

19న డీఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాలు

తుళ్లూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) డీఎస్సీ అర్హత సాధించిన అభ్యర్థులకు ఈ నెల 19న ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా నియామకపత్రాలు అందజేయనున్నారు. ఇందుకు సంబంధించి వెలగపూడి రాష్ట్ర సచివాలయం దగ్గర్లో ఎన్-9 వద్ద అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం ఆ ప్రదేశాన్ని పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, గుంటూరు జిల్లా జేసీ అశుతోశ్ శ్రీవాస్తవ, ఏఎస్పీ ఏటీవీ రవికుమార్, ఆర్డీవో శ్రీనివాసరావు పరిశీలించి ఏర్పాట్లు గురించి చర్చించారు.

బాణసంచాపై నిషేధం

ఢిల్లీకే పరిమితం ఎందుకు?

» జాతీయ విధానం ఉండాలి కదా?

» కేంద్రానికి సుప్రీంకోర్టు ప్రశ్నలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12: బాణసంచా నిషేధం ఒక్క ఢిల్లీ-దేశ రాజధాని ప్రాంతానికే పరిమితం చేయడం ఎందుకని, దానిపై జాతీయ విధానం రూపొందించవచ్చు కదా అని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. స్వచ్ఛమైన గాలి కేవలం రాజధానిలోని ఉన్నత వర్గాల వారికే పరిమితం కాకూడదని, దేశంలోని ప్రజలందరికీ అందుబాటులో ఉండాలి కదా అని వ్యాఖ్యానించింది. కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యే విధంగా విధానాన్ని రూపొందించడం ఏమిటని ప్రశ్నించింది. దీనిపై సీజేఐ జస్టిస్ గవాయ్ మాట్లాడుతూ తాను గత శీతాకాలంలో అమృత్‌సర్‌లో ఉన్నప్పుడు అక్కడ ఢిల్లీ కన్నా అధికంగా కాలుష్యం ఉండడాన్ని గమనించానని, అక్కడ మాత్రం బాణసంచాపై నిషేధం లేదని అన్నారు. "ఒక వేళ బాణసంచాను నిషేధిస్తే దానిని దేశమంతటా నిషేధించాలి" అని చెప్పారు. దీనిపై కోర్టు సహాయకురాలిగా వ్యవహరిస్తున్న అపరాజిత సింగ్ స్పందిస్తూ కాలుష్యం ఒక్క ఉన్నత వర్గాల సమస్య అని భావించడం సరికాదని చెప్పారు. ప్రజలంతా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అయినా ఢిల్లీలో కాలుష్యం పెరిగినప్పుడు ఉన్నతవర్గాల వారు వేరేచోటికి వెళ్లి ఎవరి జాగ్రత్తల్లో వారు ఉంటున్నారని అన్నారు.

కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి సమాధానం ఇస్తూ 'గ్రీన్ క్రాకర్స్' ద్వారా కాలుష్యాన్ని తగ్గించే విషయమై జాతీయ పర్యావరణ ఇంజినీరింగ్ పరిశోధన సంస్థ (నీరి)



అధ్యయనం చేస్తోందని తెలిపారు. ఈ సమస్యపై వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ నుంచి సవివరమైన నివేదిక తెప్పించాలని ధర్మాసనం ఆమెకు సూచించింది. బాణసంచా తయారీదార్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఎలాంటి రసాయన మిశ్రమాలను ఉపయోగించాలో 'నీరి' సూచిస్తే దానిని తప్పకుండా అమలు చేస్తామని తెలిపారు. మరో సీనియర్ న్యాయవాది కె.పరమేశ్వర్ మాట్లాడుతూ బాణసంచా తయారీపై ఆంక్షలు విధించడంతో పాటు 2028 వరకు మంజూరు చేసిన లైసెన్సులను కూడా అధికార్లు రద్దు చేస్తున్నారని చెప్పారు. బాణసంచా వ్యాపారుల లైసెన్సుల రద్దుపై యథాతథ స్థితి కొనసాగుతుందని చెప్పిన ధర్మాసనం తదుపరి విచారణను 22కు వాయిదా వేసింది.

సుప్రీం ఆవరణలో ఫొటోలపై నిషేధం

సుప్రీంకోర్టు ప్రధాన ప్రాంగణంలో ఫొటోలు, వీడియోలు, రీల్స్ చేయడాన్ని నిషేధిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. దీన్ని 'హై సెక్యూరిటీ జోన్'గా పరిగణించిన సుప్రీంకోర్టు.. అక్కడి లాన్‌లోకి కెమేరాలు, ట్రైపాడ్‌లు, సెల్ఫీ స్టిక్ వంటి పరికరాలను తీసుకెళ్లకూడదంటూ బుధవారం సర్క్యులర్ జారీ చేసింది.

బెయిల్ పిటిషన్లపై 2 నెలల్లోనే నిర్ణయం

బెయిల్ పిటిషన్లపై రెండు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు శుక్రవారం అన్ని హైకోర్టులకు సూచించింది. బెయిల్ పిటిషన్లను దీర్ఘకాలం పాటు పెండింగ్‌లో పెట్టడం న్యాయాన్ని నిరాకరించడం కిందకే వస్తుందని వ్యాఖ్యానించింది. దీనిపై అన్ని జిల్లా కోర్టులకు సూచనలు ఇవ్వాలని హైకోర్టులను ఆదేశించింది. కేసులోని మెరిట్ ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించింది.

దివ్యాంగులకు జనరల్ కోటా వర్తింపును పరిశీలించండి

ప్రతిభ చూపిన దివ్యాంగులకు జనరల్ కోటా వర్తింపుచేయడాన్ని పరిశీలించాలని సుప్రీంకోర్టు శుక్రవారం కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఎస్సీ, ఎస్టీలు ఎక్కువ మార్కులు సంపాదిస్తే వారికి జనరల్ కోటాలో సీట్లు ఇస్తున్నారని, అదే విధానాన్ని దివ్యాంగులకు కూడా అమలు చేయాలని అభిప్రాయపడింది. వారికి కేవలం దివ్యాంగుల కోటాలోనే సీట్లు ఇస్తామనడం వివక్ష కిందకే వస్తుందని తెలిపింది. దీనిపై అక్టోబరు 14లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. పదోన్నతుల్లోనూ ఈ విధానాన్ని అవలంబించాలని సూచించింది. తదుపరి విచారణను వచ్చే ఏడాది మార్చి 13కు వాయిదా వేసింది.

కర్ణాటకలో మళ్లీ కులగణన

బెంగళూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో మళ్లీ సామాజిక, విద్య సర్వే (కులగణన)-2025 నిర్వహిస్తామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య తెలిపారు. బెంగళూరులోని తన అధికారిక నివాసం కృష్ణలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో బీసీ కమిషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి అక్టోబరు 7వ తేదీ వరకు సర్వే కొనసాగుతుందని తెలిపారు. దీని కోసం రూ.420 కోట్లు కేటాయిస్తామన్నారు. 2015లో అప్పటి కమిషన్ అధ్యక్షుడు కాంతరాజ్ నివేదిక సమర్పించారని, ఆ సర్వే ముగిసి పదేళ్లు కావడంతో కొత్త సర్వే చేయించాలని తీర్మానించామని వెల్లడించారు. ఈ సర్వేను శాశ్వత బీసీ కమిషన్ పర్యవేక్షిస్తుందని చెప్పారు. ప్రజల సామాజిక స్థితిగతులను తెలుసుకునేందుకు వీలుగా సర్వే కోసం 60 ప్రశ్నలను రూపొందించారని వెల్లడించారు. ప్రతి ఒక్కరి సామాజిక, విద్య, రాజకీయ, ఆర్థిక స్థితిగతులు తెలిసినప్పుడు మాత్రమే సంక్షేమ పథకాలను సమగ్రంగా అమలు చేయడం సాధ్యమవుతుందన్నారు. సర్వే గణాంకాలు ఇందుకు దోహదపడతాయని తెలిపారు. గ్యారెంటీ పథకాల ద్వారా అసమానతలను కొంతమేర తగ్గించే ప్రయత్నం చేశామని చెప్పారు. బీసీ వర్గాలలో పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యత తగ్గేందుకు ప్రత్యేక చర్యలు అవసరమని గుర్తించామని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రంలోని 7 కోట్ల ప్రజల సామాజిక, విద్య పరిస్థితులను తెలుసుకునేందుకు మధుసూదన నాయక్ అధ్యక్షతన కమిషన్ సర్వే చేస్తుందని తెలిపారు. కాగా.. దసరా సెలవుల్లో నిర్వహించనున్న ఈ సర్వేలో 1.75 లక్షల మంది ఉపాధ్యాయులు పాల్గొంటారని, వారి సేవలను సద్వినియోగం చేసుకుంటామని సీఎం సిద్దరామయ్య వెల్లడించారు. ఒక్కో ఉపాధ్యాయుడికి 120 నుంచి 150 ఇళ్లను కేటాయిస్తామని, ఇందుకోసం వారికి రూ.20 వేలు గౌరవ వేతనం ఇస్తామని చెప్పారు.

లోక్‌సభలోనే వారసులెక్కువ!

» 543 మంది ఎంపీల్లో 31% మంది


రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబాలవారే!

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా శాసనసభల్లోకన్నా లోక్‌సభలోనే వారసుల సంఖ్య అధికంగా ఉందని, దేశంలో వారసత్వ రాజకీయాలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయని అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) తెలిపింది. 543 మంది లోక్‌సభ ఎంపీల్లో 167 మందికి.. అంటే, 31 శాతం మందికి వారసత్వ నేపథ్యం ఉండగా, 224 మంది రాజ్యసభ ఎంపీల్లో 47 మందికి (21 శాతం) వారసత్వ నేపథ్యం ఉన్నదని వెల్లడించింది. ఈ మేరకు ఏడీఆర్ శుక్రవారం ఒక నివేదికను విడుదల చేసింది. దీని ప్రకారం.. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీల్లో 20% మంది ఎమ్మెల్యేలకు, శాసనమండలిల్లో 22% మంది ఎమ్మెల్సీలకు కుటుంబ వారసత్వం ఉంది. రాష్ట్రాలవారీగా చూస్తే ఉత్తరప్రదేశ్‌లోనే అత్యధికంగా వారసులు ఉన్నారు. ఆ రాష్ట్రానికి చెందిన 604 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల్లో 141 మంది వారసులే. యూపీ తర్వాతి స్థానాల్లో మహారాష్ట్ర (129 మంది), బిహార్ (96 మంది), కర్ణాటక (94 మంది) ఉన్నాయి. వారసుల విషయంలో తెలంగాణ 9వస్థానంలో ఉంది. తెలంగాణలో 176 మంది చట్టసభల సభ్యుల్లో 43 మంది (24%) రాజకీయ కుటుంబాల నుంచి వచ్చారు. 11 మంది ఎంపీలు వారసత్వ నేపథ్యం నుంచే వచ్చారు. వారిలో గడ్డం వంశీకృష్ణ, సురేష్ షెట్కార్, జీ నగేష్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, అసదుద్దీన్ ఒవైసీ, ఆర్ రఘురాం రెడ్డి, మల్లు రవి, కె రఘువీర్, ధర్మపురి అర్వింద్, డీకే అరుణ, కడియం కావ్య ఉన్నారు. ఈ జాబితాలో ఐదవ స్థానంలో ఉన్న ఏపీలో మొత్తం 255 మంది చట్టసభల సభ్యులు ఉండగా.. వారిలో 86 మంది (34%) వారసులేనని ఏడీఆర్ తేల్చింది. ఏపీకి చెందిన లోక్‌సభ ఎంపీల్లో ఎనిమిది మందికి రాజకీయ వారసత్వం ఉంది. వారిలో జీఎం హరీశ్, అవినాశ్‌రెడ్డి, మిథున్ రెడ్డి, రామ్మోహన్‌నాయుడు, పుట్టా మహేష్ కుమార్, కేశినేని శివనాథ్, బైరెడ్డి శబరి, దగ్గుబాటి పురందేశ్వరి ఉన్నారు. కాగా, దేశవ్యాప్తంగా చట్టసభల సభ్యుల్లో వారసత్వ నేపథ్యం నుంచి వచ్చిన వారిలో మహిళలే ఎక్కువగా ఉండడం గమనార్హం. మొత్తం 4,665 మంది పురుష ప్రజాప్రతినిధుల్లో 856 మందికి (18%) వారసత్వ నేపథ్యం ఉంటే, 539 మంది మహిళా ప్రజాప్రతినిధుల్లో 251 మంది (47%) రాజకీయ కుటుంబాల నుంచి వచ్చిన వారు. దాదాపు అన్ని రాష్ట్రాల్లో వారసత్వంతో రాజకీయాల్లోకి వచ్చిన స్త్రీలు ఉన్నారని, వీరిలో అత్యధిక శాతం అంటే 69% మంది మహిళలు మహారాష్ట్రలో ఉన్నారని ఏడీఆర్ తెలిపింది. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కూడా ప్రజాప్రతినిధుల్లో 69 శాతం మహిళలు వారసులు అయితే, పురుషుల్లో 29% మంది మాత్రమే వారసత్వ నేపథ్యం ఉన్నవారు. తెలంగాణలో 64% మంది మహిళలు, 21% మంది పురుషులు వారసులేనని ఏడీఆర్ పేర్కొంది.

కాంగ్రెస్‌లో అత్యధికం

పార్టీల వారీగా చూస్తే.. కాంగ్రెస్‌లోనే అత్యధికంగా రాజకీయ వారసులు ఉన్నారు. జాతీయ పార్టీల్లోని మొత్తం 3,214 మంది ప్రజాప్రతినిధుల్లో కాంగ్రెస్‌లో 32%, బీజేపీలో 18% మంది వారసత్వ నేపథ్యం నుంచి వచ్చినవారే. ప్రాంతీయ పార్టీల్లోని 1809 మంది సిట్టింగ్ ప్రజాప్రతినిధుల్లో 406 మందికి వారసత్వ నేపథ్యం ఉంది. వైఎస్సార్‌సీపీలో 38 శాతం మంది, తెలుగుదేశంలో 36 శాతం మంది వారసులే. బీఆర్‌ఎస్‌లోని 52 మంది ప్రజాప్రతినిధుల్లో 10 మందికి వారసత్వ నేపథ్యం ఉన్నదని ఏడీఆర్ పేర్కొంది.

లోకం తీరు



రీట్వీట్‌కు మసాలా పెట్టారుగా!

» కంగనా రనౌత్‌పై సుప్రీంకోర్టు వ్యాఖ్య

» క్వాష్ పిటిషన్ ఉపసంహరణ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12: "మీరు చేసింది కేవలం ట్వీట్‌ను రీట్వీట్ చేయడం కాదు. దానికి మసాలా జోడించారు" అని శుక్రవారం బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్‌ను ఉద్దేశించి సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. తనపై నమోదైన పరువు నష్టం దావాను కొట్టివేయాలని కోరుతూ ఆమె దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్య చేసింది. 2020-21లో జరిగిన రైతుల ఉద్యమం సందర్భంగా ఆమె మహీందర్ కౌర్ (73) అనే వృద్ధురాలిని ఉద్దేశించి చేసిన ట్వీట్ వివాదాస్పదమయింది. ఇంతకుముందు పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)కు వ్యతిరేకంగా ఢిల్లీలోని షహీన్‌బాగ్‌లో జరిగిన ఆందోళనలో కూడా కౌర్ పాల్గొన్నారంటూ.. 'షహీన్‌బాగ్‌లో పాల్గొన్న దాదీ కూడా ఈమే. వంద రూపాయలకు దొరుకుతుంది' అని ఎక్స్‌లో పోస్టు చేశారు. అయితే, తానెప్పుడూ షహీన్‌బాగ్ ఉద్యమంలో పాల్గొనలేదని పేర్కొంటూ మహీందర్ కౌర్ కంగనపై పరువు నష్టం దావా వేశారు. దీనిని కొట్టివేయాలని కోరుతూ కంగనా దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను కింది కోర్టులు అంగీకరించకపోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కంగన తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ 'షహీన్‌బాగ్‌లో పాల్గొన్న దాదీ కూడా ఈమే' అంటూ తొలుత ఒకరు చేసిన ట్వీట్‌ను చాలా మంది రీట్వీట్ చేశారని, కంగనా కూడా రీట్వీట్ చేశారని చెప్పారు. దీనిపై జస్టిస్ మెహతా స్పందిస్తూ రీట్వీట్‌లో 'వంద రూపాయలకు దొరుకుతుంద'ంటూ మసాలా జోడించారని, అదే ఇప్పుడు పరువు నష్టానికి కారణమైందని తెలిపారు.

నేటి నుంచి 5 రాష్ట్రాల్లో మోదీ పర్యటన

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12: ప్రధాని మోదీ మణిపూర్ సహా ఐదు రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. శనివారం నుంచి సోమవారం వరకు మిజోరం, మణిపూర్, అసోం, పశ్చిమ బెంగాల్, బిహార్‌లో పర్యటిస్తారని, రూ.71,850 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారని ప్రధాని కార్యాలయం(పీఎంవో) శుక్రవారం వెల్లడించింది. మణిపూర్‌లో 2023 మేలో జాతుల మధ్య వైరంతో హింస చెలరేగిన తర్వాత ప్రధాని మోదీ ఆ రాష్ట్రంలో పర్యటించనుండడం ఇదే తొలిసారి. మోదీ తొలుత శనివారం మిజోరం వెళ్లనున్నారు. ఐజ్వాల్‌లో ఉదయం రూ.9 వేల కోట్ల విలువైన పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారు. అక్కడి నుంచి మణిపూర్ చేరుకొని.. చురచాంద్‌పూర్‌లో మధ్యాహ్నం రూ.7,300 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. తర్వాత రాజధాని ఇంఫాల్‌లో రూ.1,200 కోట్ల ప్రాజెక్టులను ప్రారంభిస్తారు. తర్వాత అసోం వెళ్తారు. సాయంత్రం గువాహటిలో జరిగే భారతరత్న భూపేన్ హజారికా శత జయంతి ఉత్సవాల్లో పాల్గొంటారు. 14వ తేదీన ప్రధాని మోదీ అసోంలో రూ.18,530 కోట్ల కీలకమైన మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. తర్వాత అస్సాం బయో-ఇథనాల్ ప్రైవేట్ లిమిటెడ్ రిఫైనరీ ప్లాంట్‌ను ప్రారంభిస్తారు. 15న పశ్చిమబెంగాల్‌లో ప్రధాని పర్యటించి, కోల్‌కతాలో జరిగే 16వ కంబైన్డ్ కమాండర్స్ కాన్ఫరెన్స్-2025ను ప్రారంభించనున్నారు. ఆ తర్వాత బిహార్ రూ.36 వేల కోట్ల విలువైన పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు.

జీతంతో పాటు ఎమ్మెల్యే నిధుల్లో 10% కమీషన్!

కాన్పూర్, సెప్టెంబరు 12: ఎమ్మెల్యేలుగా తమకి వచ్చే వేతనాలతో పాటు ఎమ్మెల్యే నిధుల్లో 10 శాతం కమీషన్ కూడా తీసుకుంటున్నామని ఏకంగా ఓ ఎమ్మెల్యేనే అందరి ముందు బహిరంగంగా వెల్లడించారు. కాన్పూర్‌లో బీజేపీ కార్యకర్తలతో జరిగిన సమావేశంలో కిద్వాయ్ నగర్ బీజేపీ ఎమ్మెల్యే మహేశ్ త్రివేది ఈ వ్యాఖ్యలు చేశారు. తాము రెండు రకాలుగా లాభం పొందుతున్నా, క్షేత్ర స్థాయిలో ఉండే కార్యకర్తలకు మాత్రం ఏ ప్రతిఫలమూ దక్కడం లేదని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు మహేశ్ త్రివేది వ్యాఖ్యలతో కూడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

15,16 తేదీల్లో కలెక్టర్ల సదస్సు

అమరావతి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఈ నెల 15, 16 తేదీల్లో కలెక్టర్ల సదస్సును నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యాలపై ఈ భేటీలో సీఎం చంద్రబాబు కలెక్టర్లకు దిశానిర్దేశం చేస్తారు. రాష్ట్ర వృద్ధి రేటును పెంచడం, జిల్లాల అభివృద్ధి గతిని మెరుగుపరచడంపై దృష్టి సారించనున్నారు. సదస్సుకు సంబంధించిన ఏర్పాట్లు సీ ఎస్ నేతృత్వంలో సాధారణ పరిపాలన శాఖ పర్యవేక్షిస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇది నాలుగో కలెక్టర్ల సదస్సు. చివరిగా ఈ ఏడాది మార్చి నెల 25, 26వ తేదీల్లో సమావేశాలు నిర్వహించారు. ఆ సమయంలో తీసుకున్న నిర్ణయాలు, వాటి అమలుతీరు, వృద్ధిపై ఈ సదస్సులో చర్చించనున్నారు.

సీఎం చొరవతోనే రాష్ట్రానికి యూరియా: అచ్చెన్న

అమరావతి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రైతుల కష్టం, అవసరం తెలిసిన సీఎం చంద్రబాబు చొరవతోనే కేంద్రం నుంచి అధిక మొత్తంలో ఎరువులు వస్తున్నాయని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని రైతు సేవా కేంద్రాలు, సహకార సంఘాలు, ప్రైవేట్ డీలర్ల వద్ద ప్రస్తుతం 82,054 టన్నుల యూరియా ఉందని తెలిపారు. వివిధ కంపెనీల నుంచి 29,236 టన్నుల యూరియా రవాణా దశలో ఉండగా, ఈ నెల 22లోపు విశాఖ పోర్టు ద్వారా 24,894 టన్నులు రానున్నట్లు వెల్లడించారు.

ప్యాలెస్‌లపై ఉన్న శ్రద్ధ కాలేజీలపై పెట్టలేదు: గంటా

విశాఖపట్నం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రుషికొండపై రూ.500కోట్లతో ప్యాలెస్, ప్యాలెస్ నమూనాలో జిల్లాల్లో పార్టీ కార్యాలయాలు నిర్మించుకున్న జగన్మోహన్‌రెడ్డి.. నాడు మెడికల్ కాలేజీల నిర్మాణంపై శ్రద్ధ పెట్టి ఎందుకు పూర్తిచేయలేదని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రశ్నించారు. జగన్ హయాంలో కేవలం ఐదు మెడికల్ కాలేజీలు మాత్రమే అప్‌గ్రేడ్ చేశారని, మిగిలిన వాటిలో 20 శాతం పనులు కూడా చేయలేదని ఆరోపించారు. ఎవరైనా వాటిని కాంట్రాక్టుకు తీసుకుంటే అధికారంలో వచ్చాక రద్దు చేస్తాననిచెప్పడం ఆయన మానసిక స్థితికి అద్దం పడుతోందన్నారు. ప్రైవేటీకరణకు, పీపీపీకి తేడా తెలియకపోవడం ఆయన అజ్ఞానానికి నిదర్శనమన్నారు.

ఆయేషామీరా తల్లిదండ్రులకు సీబీఐ కోర్టు నోటీసులు

విజయవాడ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): బీఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా తల్లిదండ్రులకు విజయవాడలోని సీబీఐ కోర్టు వేర్వేరుగా నోటీసులు జారీ చేసింది. 19వ తేదీన వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాలని గురువారం పంపిన నోటీసుల్లో స్పష్టం చేసింది. కేసులో నిందితుడిగా అభియోగాలు ఎదుర్కొంటున్న పిడితల సత్యంబాబుపై నమోదైన ఐపీసీ 376, 302 సెక్షన్లపై అభ్యంతరాలుంటే తెలిపాలని కోరింది. అయితే, తమకు సీబీఐ దర్యాప్తు నివేదికను ఇవ్వలేదని, దీనికి సంబంధించిన పిటిషన్ హైకోర్టులో పెండింగ్‌లో ఉందని వారు సమాధానాన్ని నోటీసుకు జత చేసి తిరి గి కోర్టుకు పంపేశారు. కోర్టు ఇచ్చిన నోటీసులను వారు తీసుకోలేదు. న్యాయం కోసం ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్న తమను ఎన్నిసార్లు కోర్టుకు తిప్పుతారని శుక్రవారం వారు 'ఆంధ్రజ్యోతి' ఎదుట వాపోయారు.

22, 23న 'ఈ-గవర్నెన్స్'పై జాతీయ సదస్సు

విశాఖపట్నం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): 'ఈ-గవర్నెన్స్'కు ప్రాధాన్యం ఇస్తున్న కేంద్ర ప్రభుత్వం ఈ విధానంపై ఈ నెల 22, 23 తేదీల్లో విశాఖపట్నం వేదికగా జాతీయ సదస్సు నిర్వహించనుంది. ఈ సదస్సులో 'ఈ-గవర్నెన్స్' విధి విధానాలు, ప్రక్రియ, సిబ్బంది నియామకం, సంక్షేమం, శిక్షణ, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, ఆధునిక పాలనా విధానాలపై చర్చించనున్నారు. విశాఖలోని నోవాటెల్ హోటల్‌లో జరగనున్న ఈ సదస్సుకు కేంద్ర ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల మంత్రిత్వ శాఖ నేతృత్వం వహిస్తుండగా, ఆతిథ్యం బాధ్యతలను రాష్ట్ర సర్కారు తీసుకుంది. 'వికసిత్ భారత్, సివిల్ సర్వీసెస్, డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్' ఇతివృత్తంగా జరగనున్న ఈ సదస్సుకు దేశం నలుమూలల నుంచి 1,000 మంది అతిథులు, ఐటీ రంగ నిపుణులు హాజరుకానున్నారు. అదేవిధంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేశ్, కేంద్ర ఐటీ మంత్రి సహా, పలు రాష్ట్రాల ఐటీ శాఖ మంత్రులు పాల్గొననున్నారు.

ఫిజియోథెరపిస్టుల పేరు ముందు 'డాక్టర్' ఉండొచ్చు

- పీఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ హరికృష్ణ

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఫిజియోథెరపిస్టులు తమ పేరు ముందు 'డాక్టర్' అని రాసుకోవచ్చని... అయితే, పేరు చివరన మాత్రం ఫిజియోథెరపిస్టు అని స్పష్టంగా సూచించాలని పీఎఫ్ఐ (ఫిజియోథెరపిస్ట్ల ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) ఆంధ్రప్రదేశ్ శాఖ అధ్యక్షుడు డాక్టర్ బాపట్ల వెంకట హరికృష్ణ తెలిపారు. ఇటీవల డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ జారీచేసిన లేఖ ఆధారంగా సరైన నిర్దేశం లే కుండా.. ప్రసార మాధ్యమాల్లో ఫిజియోథెరపిస్టుల వృత్తి గురించి అపోహలు సృష్టిస్తున్నారని ఆయన విమర్శించారు. ఫిజియోథెరపిస్టులు తమ పేరు ముందు డాక్టర్ అని రాసుకోకూడదని ఆదేశాలు జారీచేసిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ సునీత శర్మ... దీనిపై దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తడంతో ఆ ఉత్తర్వులను 24 గంటల్లోనే ఉపసంహరించుకున్నారని ఆయన తెలిపారు.

లోకేశ్ వల్లే క్షేమంగా ఇంటికి చేరాం

- నేపాల్ నుంచి తిరిగొచ్చిన అనంతపురం దంపతులు
- కృతజ్ఞతగా మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

అనంతపురం క్రైం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): దైవ దర్శనం కోసం నేపాల్‌కు వెళ్లి అక్కడ చిక్కుకుపోయిన అనంతపురానికి చెందిన దంపతులు మల్లికార్జున, శశికళ క్షేమంగా ఇంటికి చేరారు. మంత్రి లోకేశ్ దయతోనే తాము బతికి బయటపడ్డామన్నారు. ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతపురం నగర శివారులోని కళాకారుల కాలనీకి చెందిన ఆ దంపతులు ఈ నెల 4న నేపాల్‌కు వెళ్లారు. అక్కడ అల్లర్లు చెలరేగడంతో స్వదేశానికి తిరిగిరాలేక ప్రాణాలు అరచేత పెట్టుకుని గడిపారు. ఏపీ ప్రభుత్వం, మంత్రి లోకేశ్ స్పందించి, వీరితో పాటు 40 మందిని నేపాల్ నుంచి ప్రత్యేక విమానంలో తిరుపతిలోని రేణిగుంట విమానాశ్రయానికి గురువారం రాత్రికి చేర్చారు. అక్కడి నుంచి జిల్లా యంత్రాంగం ప్రత్యేక వాహనంలో శుక్రవారం తెల్లవారుజామున వీరిని అనంతపురానికి తీసుకువచ్చింది. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ వారిని కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆ దంపతులు తమ అనుభవాలు వివరించారు. నేపాల్‌లో ముక్తినాథ్, పశుపతినాథ్ ఆలయాల సందర్శనం తరువాత జనక్‌పురి వెళ్లేందుకు సిద్ధమయ్యామని, ఆ సమయంలో మహారాష్ట్రకు చెందిన రెండు బస్సులపై, తాము వెళుతున్న ఏపీ బస్సుపై 30 నుంచి 40 మంది ఆందోళనకారులు దాడిచేసి అద్దాలు పగలగొట్టారని తెలిపారు. ఏపీ బస్సులో 50 మందికిపైగా ఉన్నామని చెప్పారు. దాడి తర్వాత డ్రైవరు తమ వాహనాన్ని లాడ్జికి తీసుకొచ్చేశారని వెల్లడించారు. అక్కడి నుంచి ఎంబసీని సంప్రదించామన్నారు. మంత్రి లోకేశ్ తమకు భరోసా ఇస్తూ.. ప్రత్యేక విమానంలో ఇంటికి క్షేమంగా చేరుస్తామని మాట ఇచ్చారని తెలిపారు.



మంత్రి నారా లోకేశ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మల్లికార్జున, శశికళ దంపతులు, ఫొటోలో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

నేపాల్ తాత్కాలిక ప్రధానిగా

సుశీల కర్కి ప్రమాణం

కాఠ్మండూ, సెప్టెంబరు 12: 'జెనరేషన్ జెడ్' యువత ఆందోళనలతో అట్టుడికిన నేపాల్‌లో పరిస్థితులు కొలిక్కి వస్తున్నాయి. ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వ అధినేతగా సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి సుశీల కర్కి బాధ్యతలు చేపట్టారు. నేపాల్ అధ్యక్ష కార్యాలయంలో అధ్యక్షుడు రామ్‌చంద్ర పౌదెల్, ఆర్మీ చీఫ్ అశోక్‌రాజ్ సిగ్డెల్‌తో జెన్ జెడ్ గ్రూపుల ప్రతినిధులు శుక్రవారం జరిపిన చర్చల్లో ఈ మేరకు అంగీకారానికి వచ్చారు. అనంతరం శుక్రవారం రాత్రి 9.30 గంటలకు నేపాల్ తాత్కాలిక ప్రధానిగా సుశీల కర్కితో అధ్యక్షుడు రామ్‌చంద్ర పౌదెల్ ప్రమాణ స్వీకారం చేయించారు. నేపాల్ ఉపాధ్యక్షుడు రామ్ సహాయ్ యాదవ్, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ప్రకాశ్‌సింగ్ రావత్, ఆర్మీ చీఫ్, ఇతర కీలక నేతలు, అధికారుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రస్తుత పార్లమెంటును రద్దు చేస్తున్న నేపథ్యంలో పాలన సజావుగా కొనసాగానికి వీలుగా పది మంది మంత్రులను నియమించుకోవాలని నిర్ణయించినట్టు తెలిసింది. మరోవైపు తాము ప్రభుత్వంలో చేరబోమని, ప్రభుత్వ పనితీరును తమ సలహా కమిటీ పర్యవేక్షించి అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తుందని 'జెన్ జెడ్' గ్రూపుల ప్రతినిధులు స్పష్టం చేసినట్టు తెలిసింది.

సుదీర్ఘ చర్చల తర్వాత ఖరారు..

యువత ఆందోళనల నేపథ్యంలో నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తాత్కాలిక ప్రధానిగా సుశీల కర్కితోపాటు కాఠ్మండూ మేయర్ బాలేంద్ర షా, నేపాల్ ఎలక్ట్రిసిటీ బోర్డు మాజీ సీఈవో కుల్మాన్ ఘీసింగ్, మేయర్ హర్కా సంపంగ్‌ల పేర్లు తెరపైకి వచ్చాయి. గురువారం ఆర్మీ ప్రధాన కార్యాలయంలో జరిగిన చర్చల్లో ఏమీ తేలలేదు. శుక్రవారం రాత్రి వరకు దేశాధ్యక్ష కార్యాలయంలో చర్చలు జరిగాయి. చివరికి సుశీల కర్కిని తాత్కాలిక ప్రధానిగా ఎంపిక చేశారు. 73ఏళ్ల సుశీల కర్కి నేపాల్ సుప్రీంకోర్టు తొలి ప్రధాన న్యాయమూర్తికాగా, ఇప్పుడు తొలి మహిళా ప్రధాని కూడా ఆమెనే కావడం విశేషం.



నేపాల్ ప్రధానిగా ప్రమాణం చేస్తున్న సుశీల కర్కి

అధ్యక్షుడి విశేషాధికారాల మేరకు..

నేపాల్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 76 ప్రకారం.. పార్లమెంటు సభ్యులై ఉండి, మెజారిటీ సభ్యుల మద్దతు ఉన్నవారే ప్రధానమంత్రి అవుతారు. ప్రస్తుతం నేపాల్ పార్లమెంటును రద్దు చేసిన నేపథ్యంలో ఆ దేశ రాజ్యాంగంలోని ఆర్టికల్ 61 ప్రకారం అధ్యక్షుడికి దఖలు పడిన విశేషాధికారాల మేరకు తాత్కాలిక ప్రధానిగా సుశీలను నియమిస్తూ అధ్యక్షుడు రామ్‌చంద్ర పౌదెల్ ఉత్తర్వులు జారీ చేశారు.

దేశంలో ఎమర్జెన్సీ..

తాత్కాలిక ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే సుశీల కర్కి.. ఉన్నతాధికారులతో తొలి కేబినెట్ భేటీ నిర్వహించారు. నేపాల్‌లో ఆరు నెలల్లోగా సాధారణ ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించారు. వచ్చే ఏడాది మార్చి 4వ తేదీన ఎన్నికలు నిర్వహిస్తామని ప్రతిపాదించారు. ఇక దేశంలో అధికార మార్పిడి ప్రశాంతంగా జరిగేలా, దేశంలో పరిస్థితులు చక్కబడేలా తగిన చర్యలు చేపట్టేందుకు వీలుగా.. నేపాల్‌లో అత్యవసర పరిస్థితి విధించాలని అధ్యక్షుడికి తాత్కాలిక ప్రధాని సుశీల కర్కి సిఫారసు చేసినట్టు తెలిసింది.

రాజకీయ పక్షాల నిరసనలు

నేపాల్ ప్రస్తుత పార్లమెంటును రద్దుచేయాలన్న ప్రతిపాదనను నిరసిస్తూ.. రాజకీయ పక్షాలు శుక్రవారం ఆ దేశ అధ్యక్ష కార్యాలయం బయట ఆందోళనకు దిగాయి. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ (సీపీఎన్-యూఎంఎల్) ప్రధాన కార్యదర్శి శంకర్ పొఖారెల్ తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఇక తాత్కాలిక ప్రధానిగా సుశీల కర్కి ఎంపిక రాజ్యాంగ విరుద్ధమని నేపాల్ మావోయిస్టు పార్టీ నేత దేవేంద్ర పౌడెల్ మండిపడ్డారు. పార్లమెంటు దిగువ సభ స్పీకర్ దేవ్‌రాజ్ ఘిమిరే (సీపీఎన్-యూఎన్ఎల్), ఎగువ సభ చైర్‌పర్సన్ నారాయణ్ దహల్ (మావోయిస్టు పార్టీ) ఇద్దరూ కూడా సుశీల కర్కి ప్రమాణ స్వీకారానికి హాజరుకాలేదు. నేపాల్‌లో రాజకీయపరంగా ఉద్రిక్తత పరిస్థితి నెలకొంటోందని, దానికి ఇది సూచన అని విశ్లేషకులు చెబుతున్నారు.

51కి చేరిన మృతుల సంఖ్య..

ఆందోళనలు, పోలీసుల కాల్పుల ఘటనల్లో మృతుల సంఖ్య 51కి చేరింది. ఇందులో కాఠ్మండూలో 34 మంది మరణించగా, దేశంలోని ఇతర ప్రాంతాల్లో మరో 17 మంది మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. మొత్తంగా 1,700 మందికిపైగా గాయపడ్డారని ప్రకటించారు.

భారతీయుల బస్సుపై దాడి

కాఠ్మండూలోని పశుపతినాథ్ ఆలయానికి వెళ్లి వస్తున్న తెలుగువారి బస్సుపై ఆందోళనకారులు దాడి చేసిన విషయం వెలుగులోకి వచ్చింది. కర్ఫ్యూతో నేపాల్‌లో చిక్కుకుపోయిన ఈ బస్సు.. గురువారం రాత్రి భారత్, నేపాల్ సరిహద్దుల్లోని సనౌలి వద్దకు చేరుకున్నాక బస్సులోని సిబ్బంది శ్యామూ నిషాద్ ఈ వివరాలు వెల్లడించారు. "9న పశుపతినాథ్ దర్శనం చేసుకుని తిరిగి వస్తున్నాం. బస్సులో వృద్ధులు, మహిళలు, పిల్లలు సహా 49 మంది ఉన్నారు. మధ్యలో కొందరు ఆందోళనకారులు మా బస్సుపై రాళ్లు రువ్వారు. కిటికీల అద్దాలు పగిలి ఎనిమిది మందికి గాయాలయ్యాయి. నేపాల్ ఆర్మీ వచ్చి మాకు సాయం చేసింది" అని తెలిపారు.

హోటల్ నాలుగో అంతస్తు నుంచి దూకి..

నేపాల్ ఆందోళనల్లో భారత మహిళ ఒకరు చనిపోయారు. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌కు చెందిన రాజేశ్ గోలా, ఆమె భర్త రామ్‌వీర్ సింగ్ గోలా కలిసి ఈ నెల 7న నేపాల్ పర్యటనకు వెళ్లారు. కాఠ్మండూలోని హయత్ రెసిడెన్సీ హోటల్‌లో బస చేశారు. ఈ నెల 9న ఆందోళనకారులు ఆ హోటల్‌కు నిప్పుపెట్టారు. సహాయక బృందాలు అక్కడికి చేరుకుని హోటల్‌లో చిక్కుకున్నవారిని కాపాడే ప్రయత్నం చేశాయి. ఈ క్రమంలో హోటల్ నాలుగో అంతస్తు నుంచి దూకిన రాజేశ్ గోలాకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందారు.

హోటల్ రంగానికి రూ.2,500 కోట్ల నష్టం

జనరేషన్ జెడ్ ఆందోళనలు, అనంతర పరిస్థితులతో నేపాల్‌లోని హోటల్ రంగానికి రూ.2,500 కోట్ల నష్టం వాటిల్లినట్టు హోటల్ అసోసియేషన్ ఆఫ్ నేపాల్ అంచనా వేసింది. చాలా హోటళ్లు తీవ్రంగా ధ్వంసమయ్యాయని.. కాఠ్మండూలోని ప్రముఖ హిల్టన్ హోటల్‌ను ఆందోళనకారులు తగలబెట్టడంతోనే రూ.800 కోట్ల నష్టం కలిగిందని పేర్కొంది.

ఖరీఫ్ ధాన్యం సేకరణ లక్ష్యం

50 లక్షల టన్నులు

- గతేడాది కంటే 14 లక్షల టన్నులు అదనంగా సేకరణ
- 48 గంటల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లోకి సొమ్ములు
- రైతుల అభిప్రాయాల సేకరణకు క్యూఆర్ కోడ్‌లు
- పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



కాకినాడ(కలెక్టరేట్), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్‌లో 50లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఖరీఫ్ 2025-26 ధాన్యం సేకరణపై కాకినాడ కలెక్టరేట్‌లో శుక్రవా రం కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల అధికారులు, మిల్లర్లు, రైతులు, పీఏసీఎస్ ప్రతినిధులతో ఆయ న సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. గతేఏడాది ఖరీఫ్‌లో 35.94 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించామని చెప్పారు. నిరుటి కంటే 14లక్షల టన్నుల ధాన్యం అదనంగా సేకరించి రైతులను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ ఏడాది దిగుబడులు అధికంగా ఉంటాయన్న అంచనాలతో భారీ లక్ష్యాన్ని పెట్టుకున్నామని చెప్పారు. ధాన్యం సేకరణ నిమిత్తం రైతులకు రూ.11,850 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని, ఈ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు. సేకరించిన 24 గంటల నుంచి 48 గంటల్లోపు ధాన్యం సొమ్మును రైతుల బ్యాంకు ఖాతాల్లోకి జమ చేస్తామ ని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం రైతులను పూర్తి గా విస్మరించిందని ఆరోపించారు. ధాన్యం బకాయి లు రూ.1,674 కోట్లు చెల్లించకుండా అనేక ఇబ్బందులకు గురిచేసిందని మండిపడ్డారు. కూటమి ప్రభు త్వం తొలి విడతలో రూ.వెయ్యి కోట్లు, రెండో విడత లో రూ.674 కోట్లు రైతులకు చెల్లించి ఆదుకుందని గుర్తుచేశారు. రైతులు పంటలు పండించిన వెంటనే కల్లాల్లోనే పంట కొనుగోలు చేస్తామని చెప్పారు. రైతు సేవా కేంద్రాల్లో, రైస్‌మిల్లుల్లో ఏర్పాటు చేసే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి రైతులు తమ సమస్యలను పంపిస్తే తక్షణం పరిష్కారిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ ఏడాది క్వింటా ఎ-గ్రేడ్ రకం రూ.2,389, సాధారణ రకం రూ.2,369 మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పారు. రేషన్ మాఫియాపై త్వరలో సిట్ దర్యాప్తు ప్రారంభమవుతుందని తెలిపారు. రాష్ట్రంలో 80శాతం స్మార్ట్ రైస్‌కార్డుల పంపిణీ జరిగిందని, 96.5 శాతం కార్డుదారులకు ఈకేవైసీ పూర్తయిందని వివరించారు. దీపం పథకంలో ఇప్పటివరకు ఏపీలో 2.42 లక్షల ఉచిత గ్యాస్ సిలిండర్లను లబ్ధిదారులకు ఇచ్చామని అన్నారు. మూడో విడతలో లబ్ధిదారులకు సబ్సిడీ సొమ్ములు జమ కాని వారు టోల్‌ఫ్రీ నం. 1967కు ఫిర్యాదు చేయాలని సూచించారు.



నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాలో విద్యార్థులతో పవన్ కల్యాణ్

సమాజానికి కళలు చాలా అవసరం

- లేకపోతే మనుషుల్లో హింస పెరుగుతుంది: పవన్
- ఢిల్లీలో 'నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా' సందర్శన
- ఏపీలో ఎన్ఎస్‌డీ క్యాంపస్ ఏర్పాటుకు కృషి చేస్తానని వెల్లడి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): సమాజంలో కళలు(ఫైన్ ఆర్ట్స్) లేకపోతే మనుషుల్లో హింసా ప్రవృత్తి పెరిగిపోతుందని, సమాజం విచ్ఛిన్నం అవుతుందని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి కళలు కచ్చితంగా అవసరమని అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఢిల్లీలోని రాష్ట్రపతిభవన్‌లో ఉపరాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి పవన్ కల్యాణ్ హాజరయ్యారు. అనంతరం నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా(ఎన్ఎస్‌డీ)ను సందర్శించారు. స్కూల్ డైరెక్టర్ చిత్తరంజన్ త్రిపాఠితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. స్కూల్ పరిధిలోని బుక్‌స్టాల్‌ను సందర్శించి రూ.36 వేల విలువైన 77 పుస్తకాలను పవన్ కొనుగోలు చేశారు. అనంతరం ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు ప్రదర్శించిన నాటకాన్ని వీక్షించారు. విద్యార్థుల నటన కౌశలానికి మంత్రముగ్ధులైన పవన్.. వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా మీడియాతో పవన్ మాట్లాడుతూ.. ఏపీలో ఎన్ఎస్‌డీ క్యాంపస్ ఏర్పాటుకు కృషి చేస్తానని, దీనికి అవసరమైన భూమి గురించి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. తెలుగు సినీపరిశ్రమ ప్రపంచస్థాయికి చేరిందన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలకు సహకారం అందిస్తున్నట్లే, తెలుగు సినీపరిశ్రమకు కూటమి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాలకు రాకపోవడానికి వారికి ప్రత్యేక రాజ్యాంగం ఉందేమోనని ఎద్దేవా చేశారు. వారు ఏ రాజ్యాంగం ఉన్నా.. భారత రాజ్యాంగాన్ని పాటించే తమ కూటమి ప్రభుత్వంలో అది చెల్లదని అన్నారు. కాగా, నేపాల్‌కు చెందిన ఎన్ఎస్‌డీ విద్యార్థి ఒకరు పవన్‌కు తమ జాతీయ జెండా బ్యాడ్జిని ధరింపచేశారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం

- కోస్తాలో వర్షాలు.. 20న ఉపరితల ఆవర్తనం
- 15 నుంచి నైరుతి నిష్క్రమణ మొదలు

విశాఖపట్నం, అమరావతి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశాకు ఆనుకుని పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో శుక్రవారం ఉదయం అల్పపీడనం ఏర్పడింది. దీనిపై ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. అల్పపీడనం రానున్న రెండు రోజుల్లో ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా, దక్షిణ ఛత్తీస్‌గఢ్ మీదుగా పయనిస్తుందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో శుక్రవారం ఉదయం నుంచి కోస్తా, రాయలసీమల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరుగా, అక్కడక్కడా భారీవర్షాలు కురిశాయి. నవగాం(మన్యం జిల్లా)లో 73, పాత కొప్పెర్ల(విజయనగరం)లో 68, సీతంపేట (మన్యం)లో 59.75, భీమునిపట్నం(విశాఖ)లో 55 మి.మీ. వర్షపాతం నమోదైంది. కాగా, అల్పపీడనం ప్రభావంతో రానున్న రెండు రోజులు కోస్తా జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. కాగా, ఈనెల 20న వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉందని, దక్షిణ ఒడిశా, ఉత్తర కోస్తాల్లో వర్షాలు కురుస్తాయన్నారు.

రెండు రోజులు ముందే నైరుతి నిష్క్రమణ: ఐఎండీ

నైరుతి రుతుపవనాల నిష్క్రమణ 2 రోజులు ముందే ప్రారంభం కానుంది. ఈ నెల 15 నుంచి పశ్చిమ రాజస్థాన్ నుంచి నైరుతి రుతుపవనాలు నిష్క్రమణ ప్రారంభం కానుందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) బులెటిన్‌లో పేర్కొంది. ఈ నైరుతి సీజన్‌లో ఇప్పటివరకూ దేశవ్యాప్తంగా 778.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 836.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

పిడుగు పడితే హడల్..!

- వాతావరణ మార్పులతో పెరుగుతున్న తీవ్రత
- మొన్న ఆయిల్ ట్యాంకుపై.. నిన్న యుద్ధనౌక సమీపంలో
- విశాఖ నగర పరిసరాల్లో పెరిగిన పిడుగులు
- ఏప్రిల్-జూన్ మధ్య దేశంలో పిడుగుపాటుతో 1,621 మంది మృతి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వానాకాలంలో పిడుగులు పడడం సహజం..! కానీ.. వాతావరణంలో మార్పుల ప్రభావంతో ఇటీవల పిడుగుల తీవ్రత పెరగడం ఆందోళన కలిగిస్తోంది. కొద్దిరోజుల నుంచి విశాఖ నగర పరిసరాల్లో మేఘాలు ఏర్పడిన వెంటనే చెవులు చిల్లులు పడేలా పిడుగుల శబ్దం వినిపిస్తోంది. ఆదివారం పోర్టు ఏరియాలో ఈస్టిండియా కంపెనీ ఆయిల్ ట్యాంకుపై పిడుగు పడిన ఘటన కలకలం రేపింది. సోమవారం కూడా బంగాళాఖాతంలో యుద్ధనౌక సమీపంలో పిడుగు పడినట్టు వెదర్‌మ్యాన్ ఒకరు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. యుద్ధనౌకకు అతి సమీపంలో కళ్లుమిరుమిట్లు గొలిపేలా మెరుపు మెరిసి, ఆవెంటనే పిడుగు పడినట్టు పేర్కొన్నారు.

ఆయిల్ ట్యాంకుపై..

నైరుతి రుతుపవనాల సీజన్‌లో పిడుగులు సర్వసాధారణం. తుఫాన్‌ల సీజన్(అక్టోబరు, నవంబరు)లో కూడా పిడుగులు పడుతుంటాయి. మెరుపులను(లైట్నింగ్) ఆప్టికల్‌గా, పిడుగు(థండర్)లను ఎలక్ట్రికల్‌గా పిలుస్తారు. భూమికి 750 మీటర్ల ఎత్తు నుంచి థండర్స్, లైట్నింగ్స్ సంభవిస్తుంటాయి. ఇవి మేఘాల నుంచి నేరుగా భూమిని తాకుతుంటాయి. ఆదివారం ఈస్టిండియా కంపెనీ ఆయిల్ ట్యాంకుపై పడిన పిడుగు అత్యంత శక్తివంతమైనదని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఇది 2 కిలోమీటర్ల దూరం నుంచి భూమిపైకి దూసుకురావడంతో ట్యాంకు పైకప్పు ఊడిపోయిందన్నారు.



ఈస్టిండియా కంపెనీ మిథనాల్ ట్యాంకుపై పిడుగు పడడంతో ఎగిసిపడుతున్న అగ్ని కీలలు(ఫైల్)

పిడుగుపాటు మరణాలూ అధికమే..

ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకూ దేశంలో పిడుగుల ధాటికి 1,621 మంది ప్రాణాలు కోల్పోయారు. ఏప్రిల్ 10 నుంచి 12 వరకు మధ్య, తూర్పు భారతంలో 126 మంది(బిహార్‌లో 82 మంది, ఉత్తరప్రదేశ్‌లో 23 మంది) చనిపోయారు. పిడుగులు, మెరుపుల ధాటికి ఒడిశాలో ఎక్కువ మంది చనిపోతున్నారు. గత ఐదేళ్లలో ఈ రాష్ట్రంలో 1,625 మంది ప్రాణాలు కోల్పోయారు. అక్కడ ఏటా ఆరు లక్షల మెరుపులు/ఉరుములు/పిడుగులు సంభవిస్తున్నాయి. బిహార్‌లో ఏటా సగటున 271 మంది చనిపోతుండగా.. 2020 జూన్ 25వ తేదీ ఒక్కరోజే 83 మంది పిడుగుల ధాటికి మృతిచెందారు.

పిడుగు పడితే లక్షల వోల్టుల విద్యుత్

క్యుములోనింబస్ మేఘాల విచ్ఛిన్న సమయంలో కళ్లు మిరుమిట్లు గొలిపేలా మెరుపులు సంభవిస్తాయి. ఆ సమయంలో తీవ్రమైన విద్యుత్ ప్రవహించి, గాలి సంకోచ వ్యాకోచకాలకు లోనై శబ్దం పుడుతుంది. దానినే పిడుగు అంటాం. ముందు మెరుపు సంభవించిన తరువాత శబ్దం వస్తుంది. కొన్ని లక్షల వోల్టుల విద్యుత్ శక్తితో కూడిన పిడుగు భూమిని తాకినప్పుడు చెట్లు, భవనాలు ధ్వంసమవుతాయి. అదే మనుషులకు తాకితే మృత్యువాత పడతారు. పిడుగులు, ఉరుములు, మెరుపులపై భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఆయా రాష్ట్రాల్లో ముందస్తు సమాచారం అందిస్తోంది. ఆయా ప్రాంతాల్లో సెల్‌ఫోన్లకు విపత్తుల నిర్వహణ సంస్థ మెసేజ్‌లు పంపిస్తోంది. అయినా ప్రజల్లో అవగాహన కొరవడి పట్టించుకోవడం లేదు.

జగన్... వైద్య కళాశాలల పర్యటనకు సిద్ధమా?

» వస్తానంటే పోలీసు రక్షణతో స్వయంగా తీసుకెళ్తా: మంత్రి అనిత

» ఆయన లండన్ మందులు వేసుకోవడం లేదని ఎద్దేవా

అమరావతి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): లండన్ మందులు వేసుకోకుండా మెడికల్ కళాశాలల గురించి జగన్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని హోంమంత్రి వంగలపూడి అనిత ఎద్దేవా చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, వైసీపీ అధినేత జగన్ నిర్మించానని చెపుతున్న 17 వైద్య కళాశాలల ప్రస్తుత పరిస్థితిపై వీడియో ప్రజెంటేషన్ ఇచ్చారు. ఒక్కో కళాశాల దుస్థితిని వివరిస్తూ... వాటిలో ఆహా అనేట్లు నిర్మించిన కళాశాల ఏం ఉందో చెప్పాలని నిలదీశారు. 'బెంగళూరులో ఫుల్ టైమ్ ఉంటూ, ఏపీకి పార్ట్ టైమ్ వస్తున్న జగన్ బురద తెచ్చి ప్రభుత్వంపై చల్లుతున్నాడు. వైద్య కళాశాలలను పీపీపీ మోడ్‌లో నిర్మించడంపై ప్రజల్ని భయపెట్టే యత్నం చేస్తున్నాడు. కట్టడాలే లేకుండా ఆహా అనేలా 17 వైద్య కళాశాలలు కట్టేశామని చెప్పుకోవడం జగన్‌కే చెల్లింది. తాను నిర్మించానని చెబుతున్న 17 వైద్య కళాశాలల క్షేత్రస్థాయి పర్యటనకు జగన్ రాగలడా..? జగన్ సిద్ధమైతే పోలీసు భద్రతతో నేనే ఆయన్ను అక్కడికి తీసుకెళ్తా. సామాన్యులకు మెరుగైన వైద్య విద్య అందించాలనే కూటమి ప్రభుత్వ తపనను జగన్ రాజకీయం చేస్తున్నాడు' అని అనిత విమర్శించారు.


విలేకరుల సమావేశంలో బాపట్ల మెడికల్ కాలేజీ ప్రస్తుత పరిస్థితిని చూపిస్తున్న హోంమంత్రి అనిత

మూడేళ్లలో రాజధాని తొలి దశ!

(మొదటి పేజీ తరువాయి)

వచ్చి ఉంటే 2021కే పూర్తయి ఉండేదని చెప్పారు. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల డయాఫ్రం వాల్ దెబ్బతిందని.. కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ వాటన్నింటినీ బాగు చేసుకుంటూ నిర్మాణాన్ని పరుగులు పెట్టిస్తున్నామని, 2027 నాటికి పూర్తి చేస్తామని వివరించారు. చిత్తశుద్ధి ఉంటే ఏదైనా సాధ్యమేనని.. కియా ఫ్యాక్టరీ కోసం గొల్లపల్లి రిజర్వాయర్‌ను ఏడాదిలో పూర్తి చేశామని, హంద్రీ-నీవా కాలువల విస్తరణ పనులు కేవలం 100 రోజుల్లో పూర్తి చేసి నీరిచ్చామని గుర్తుచేశారు. ఆయన ఏమన్నారంటే..

రాజధానికి భూములిచ్చినవారిని ఆదుకుంటాం..

హైదరాబాద్‌లో హైటెక్ సిటీ రాకముందు ఆ ప్రాంతంలో ఎకరం లక్ష రూపాయలు ఉండేది. ఇప్పుడు అక్కడ ఎకరం రూ.100 కోట్లుకు చేరింది. పరిశ్రమలు, అభివృద్ధితో భూమి విలువ పెరుగుతుంది. అమరావతిలో మొత్తం ప్రైవేటు భూములే. ఒక్క రైతుకూ అన్యాయం జరగనివ్వం. రాజధానికి భూములిచ్చిన వారిని ఆదుకుంటాం. ఇప్పుడు ఉండే భూమి ఇప్పటికే సరిపోతుంది. అమరావతి విస్తరణ విషయంలో రైతులకు ఏ మాత్రం ఇబ్బంది లేకుండా అభివృద్ధి చేస్తాం. రైతులతో మాట్లాడి విస్తరణకు భూములు అవసరమైన మేరకు తీసుకుంటాం. విమర్శలకు భయపడి ఆగిపోతే అభివృద్ధి జరగదు. రాజధాని విస్తరణకు రైతులు సహకరిస్తున్నారు. వారి సహకారంతో దేశంలో నంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతాం. ఇప్పటికే అమరావతిలో క్వాంటమ్ వ్యాలీకి శ్రీకారం చుట్టాం. జాతీయ, అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలు కొన్ని ఇప్పటికే వచ్చాయి. ఇంకొన్ని రాబోతున్నాయి.

అభివృద్ధి సాధనకు విజన్ ఉండాలి

అభివృద్ధి సాధించాలంటే దానికి విజన్ ఉండాలి. భవిష్యత్ తరాల కోసం ఆలోచన చేసి.. విజన్‌కు రూపకల్పన చేసుకుని దానిని సాధ్యం చేసే దిశగా పనిచేయాలి. అందుకే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విజన్-2020కి రూపకల్పన చేశాను. ఇప్పుడు జాతీయ స్థాయిలో వికసిత్ భారత్-2047, రాష్ట్రస్థాయిలో స్వర్ణాంధ్ర-2047కు రూపకల్పన చేసుకుని ముందుకెళ్తున్నాం. భారతీయులకు సరైన గుర్తింపు లేని సమయంలో నాటి ప్రధాని, తెలుగుబిడ్డ పీవీ నరసింహారావు సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి దేశాభివృద్ధి అన్‌స్టాపబుల్‌గా సాగుతోంది. ప్రధాని మోదీ వచ్చిన తర్వాత.. ప్రపంచంలో 11వ ఆర్థిక వ్యవస్థగా ఉన్న దేశాన్ని 4వ ఆర్థికవ్యవస్థగా తీసుకొచ్చారు. 2028కి మూడో అతిపెద్ద ఎకానమీగా, 2038కి రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తయారవుతుందనడంలో అనుమానం లేదు. 2047కి నంబర్‌వన్ ఆర్థికవ్యవస్థగా నిలవాలన్నది నా ఆకాంక్ష. 2024-25లో ఎన్ని కష్టాలు ఉన్నా 12 శాతం వృద్ధిరేటు సాధించాం. 2028-29 నాటికి జీఎస్డీపీ రూ.29 లక్షల కోట్లు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రస్తుతం ఉన్నదాని కంటే ఇది రెట్టింపు. ప్రస్తుతానికి దక్షిణాది రాష్ట్రాలన్నింటిలోకి ఏపీ తలసరి ఆదాయం చాలా తక్కువ. ప్రస్తుతం రూ.2.66 లక్షలుగా ఉంది. దీన్ని 2028-29 నాటికి రూ.5.42 లక్షలుగా చేయాలని, 2033-34 నాటికి రూ.10.55 లక్షలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నాం. ఇదేమీ అసాధ్యం కాదు. నిర్దిష్ట ఆలోచనలు, ప్రణాళికలతో ముందుకెళ్తే తేలిగ్గా లక్ష్యాన్ని సాధించగలం. శరీరానికి పోషకాలెంత అవసరమో సమాజానికి మంచి పాలసీలూ అంతే అవసరం.

ఏమీ లేకపోయినా పర్వాలేదంటే ఎలా?

విమర్శలకు, ఖర్చుకు వెనకాడితే ప్రాజెక్టులు పూర్తి కావు. ఒకప్పుడు రాయలసీమలో పదేళ్లలో ఎనిమిదేళ్ల కరువుండేది. దేశంలో ఇప్పటికీ అతి తక్కువ వర్షపాతం ఉన్న జిల్లా అనంతపురం. కానీ ఇప్పుడు నీరివ్వడంతో పరిస్థితి మారింది. కోస్తా జిల్లాల కంటే అనంతపురం జిల్లానే జీఎస్డీపీలో ముందుంది. హార్టీకల్చర్ సాగు వల్లే ఇది సాధ్యమైంది. నీళ్ల లేకపోయినా పర్వాలేదు.. రోడ్లు లేకపోయినా పర్వాలేదంటే మనం ఇక్కడే ఉంటాం. బనకచర్ల ప్రాజెక్టుకు సముద్రంలోకి పోయే వృథా వరద జలాలను మాత్రమే వినియోగించుకుంటాం. పెద్ద కలలు కనాలి.. సంకల్పం ఉండాలి. అప్పుడే ఏదైనా సాధ్యం. 1995లో నేను ఉమ్మడి ఏపీ సీఎం అయినప్పుడు మూడు నెలలు జీతాలు ఇవ్వలేకపోయాను. సంక్షేమ కార్యక్రమాలనూ అమలు చేయలేకపోయాం. ఆ సమయంలో ఐటీపై దృష్టి పెట్టాం. ఐటీ వల్లే హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందింది. అదే చిత్తశుద్ధితో ఇప్పుడు కష్టపడుతున్నాం. 15 రోజులకోసారి క్యాబినెట్ మీటింగ్ పెట్టుకుంటున్నాం. 15 రోజులకోసారి ఎస్ఐపీబీ మీటింగ్ పెట్టుకుంటున్నాం. 15 నెలల్లో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం.


మళ్లీ వచ్చేది ఎన్డీఏనే

ప్రపంచంలో వివిధ దేశాల్లో సంక్షోభాలు వస్తున్నాయి. కానీ మన దేశంలో మాత్రం 11 ఏళ్లుగా మోదీ నాయకత్వంలో సుస్థిర ప్రభుత్వం, సుస్థిర నాయకత్వం ఉంది. దేశంలో.. రాష్ట్రంలో మరోసారి కూడా ఎన్డీఏనే వస్తుంది. ఇందులో అనుమానం లేదు.

భూమి ఇస్తే మెడికల్ కాలేజీ కట్టినట్లేనా?

మెడికల్ కళాశాలలకు భూమి మాత్రమే ఇచ్చి నిర్మాణం పూర్తి చేశామని కొందరు ప్రచారం చేసుకుంటున్నారు. ఐదేళ్లలో ఐదు కాలేజీలు కూడా పూర్తి చేయలేకపోయారు. అందుకే పీపీపీ విధానంలో వాటి నిర్మాణానికి చర్యలు చేపట్టాం. కాలేజీలను ఎక్కడా ప్రైవేటుకు అప్పగించడం లేదు. వైద్యవిద్యార్థులకు, వైద్యసేవలకు ఇబ్బంది రాకుండా చూసే బాధ్యత ప్రభుత్వానిదే. పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీల వల్ల నష్టం ఉండదు. ఇంజనీరింగ్ కాలేజీల విషయంలో నాడు నేను తీసుకున్న నిర్ణయాల వల్లే నేడు రైతు కూలీల పిల్లలు కూడా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా ఉన్నారు.





సమాంతరంగా సంక్షేమం.. అభివృద్ధి

భారత్‌లాంటి దేశాల్లో సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమాంతరంగా చేయాలి. ఎన్నికలు ఐదేళ్లకు వస్తాయి.. దానికి తగ్గట్టే పనిచేద్దాం.. రాజకీయంగా లబ్ధి పొందుదామనుకుంటే హైదరాబాద్ అభివృద్ధి జరిగేది కాదు. విద్యుత్ సంస్కరణలు తెచ్చేవాడిని కాదు. సీఎంగా భావితరాల కోసం ఆలోచించాలి. 2004లో నన్ను ఎవరూ ఓడించలేదు. ఆరోజు తపనతో ఏదో చేసేయాలని ఆలోచించి సంక్షేమం, అభివృద్ధిని బ్యాలెన్స్ చేయలేకపోయాను. అందుకే ఇప్పుడు రెండింటినీ సమాంతరంగా తీసుకెళ్తున్నాను. సూపర్ సిక్స్ హామీలు అమలుచేస్తూనే అభివృద్ధి చేస్తున్నాను. పీ-4 ద్వారా పేదరికం లేని సమాజంతోపాటు ఆర్థిక అసమానతలు రూపుమాపేందుకు శ్రమిస్తున్నాం. ఏటా సంక్షేమ పథకాలపై లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నా.. సంపద సృష్టించి సంక్షేమాన్ని అమలు చేస్తున్నాం. అలాగే పీపీపీ మోడల్‌ను ప్రపంచమంతా ఆమోదించింది. దీని ద్వారా సంపద సృష్టించి పేదలకు పంచుతాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను అమలు చేస్తున్నాం. దేశంలో 1991లో ఆర్థిక సంస్కరణలు వస్తే 1995లో నేను ధైర్యంగా వాటిని అందిపుచ్చుకుని అమలు చేశాను. దావోస్ వెళ్లి సంస్కరణల గురించి వివరించి పెట్టుబడిదారులను ఆహ్వానించాను. సంపద సృష్టించకపోతే అభివృద్ధి అసాధ్యం. ఒకప్పుడు ఒక ప్రాజెక్టుపై రూ.50 కోట్లు ఖర్చు చేస్తే గొప్ప ప్రాజెక్టు. ఇప్పుడు రూ.లక్ష కోట్ల విలువైన ప్రాజెక్టులు కడుతున్నాం.

మరో జగన్నాటకం!

(మొదటి పేజీ తరువాయి)

"ఇప్పటికే రాజధాని ఉంది కదా! సచివాలయం ఉంది. ఆయన (చంద్రబాబు) కొత్తవి కట్టకపోతే చాలు. ఉన్నదాంతో నడుపుకోవచ్చు" అని సజ్జల అన్నారు. 'అమరావతిలో ఒక్క ఇటుక కూడా పడలేదు, అది ఎడారి, శ్మశానం' అని 2019 ఎన్నికల ముందు వైసీపీ నేతలు అక్కసు ప్రదర్శించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు... సజ్జల రామకృష్ణా రెడ్డి "అమరావతిలో రాజధాని ఉంది కదా! సచివాలయం కూడా ఉంది" అని చెప్పడం గమనార్హం. ఇక... రాజధాని రైతులను పగవాళ్లగా భావించి, వారిని అన్నిరకాలుగా హింసించిన జగన్ సర్కారుకు ప్రధాన సలహాదారుగా ఉన్న సజ్జల.. ఇప్పుడు అదే అమరావతి రైతులపై కపట ప్రేమను ప్రదర్శించారు. "మేం రైతుల రిటర్నబుల్ ప్లాట్ల అభివృద్ధి పూర్తి చేసే వాళ్లం. ఈసారి రైతుల ప్లాట్లను అభివృద్ధి చేసి, వాటి 'సేలబులిటీ' పెంచుతాం" అని రెండో నాల్కను బయట పెట్టారు.

ఆ అరాచకం మరిచిపోయారా?

వైసీపీ అధినేత జగన్ 2019 ఎన్నికలకు ముందు గుంటూరులో పార్టీ ప్లీనరీ నిర్వహించారు. రాజధానిగా అమరావతే ఉంటుందని నమ్మబలికారు. అందుకే తాడేపల్లిలో సొంత నివాసం ఏర్పాటు చేసుకున్నాననీ చెప్పారు. 'ఒక్కచాన్స్' అని వేడుకున్నారు. ప్రజలు అధికారం ఇవ్వగానే తన నిజస్వరూపాన్ని బయటపెట్టారు. అమరావతిని అటకెక్కించి 'మూడు ముక్కలాట'కు తెరలేపారు. ఆ తర్వాత అమరావతి విధ్వంసానికి ఆయన చేయని ప్రయత్నం అంటూ లేదు. క్యాబినెట్ సమావేశాలున్నప్పుడు మినహా... మరెన్నడూ సచివాలయానికేసి చూడలేదు. హైకోర్టు తీర్పులతోనూ జగన్ తీరు మారలేదు. ప్రాంతాల మధ్య గొడవలు పెట్టేలా వ్యవహరించారు. అమరావతిపై నాటకాలతోపాటు... ఐదేళ్ల అరాచకాలపై జనం మండిపోయారు. ఎన్నికల్లో వైసీపీని 11 స్థానాలకే పరిమితం చేశారు. ఆపై ఏడాదిన్నరకే సజ్జల రామకృష్ణా రెడ్డి నోట అమరావతిపై కొత్త పాట వినిపించడం గమనార్హం!

అమరావతిపై వైసీపీ కసి, ద్వేషం ఏమాత్రం తగ్గలేదన్నది నిజం. అమరావతి నిర్మాణానికి నిధులు రాకుండా అడ్డుకునేందుకు తెరవెనుక ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. రాజధాని నిర్మాణంలో పాలుపంచుకోవద్దంటూ సింగపూర్ ప్రతినిధులకు లేఖలు పంపారు. ఇక రాష్ట్రాభివృద్ధిపైనా వైసీపీది 'విధ్వంసం-2.0' విధానమే. మెడికల్ కాలేజీల విషయంలో జగన్ జారీ చేసిన హెచ్చరికలే దీనికి నిదర్శనం. జగన్ పూర్తి చేయకుండా వదిలేసిన, పునాదులకే పరిమితం చేసిన పది మెడికల్ కాలేజీలను పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో అభివృద్ధి చేయాలని కూటమి సర్కారు నిర్ణయించింది. దీనిపై వైసీపీ అధినేత జగన్ హెచ్చరికలకు దిగారు. ఆ టెండర్లలో పాల్గొనొద్దు అని సూటిగా 'వార్నింగ్' ఇచ్చారు. అధికారంలో ఉండగా... సింగపూర్ ప్రభుత్వాన్నే బెదిరించి, భయపెట్టి అమరావతి ప్రాజెక్టు నుంచి తరిమేశారు. 'రివర్స్ టెండరింగ్' పేరుతో అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రానికి చెడ్డపేరు తెచ్చారు. కానీ... 'మేం అధికారంలో ఉండగా ఒక్క పారిశ్రామిక వేత్తనూ వెళ్లగొట్టలేదు' అని ఇప్పుడు సజ్జల సుద్దులు చెబుతున్నారు.

ఈ హెచ్చరికతో మళ్లీ భయాలు

మళ్లీ అధికారంలోకి వస్తే 'విధ్వంసం 2.0' చూపిస్తామని జగన్ ఇప్పుడు చెప్పకనే చెబుతున్నారు. దీంతో... 'అమ్మో మళ్లీ జగనా' అని సామాన్య ప్రజలు, వ్యాపార, వాణిజ్య, పెట్టుబడిదారులు భయపడిపోతున్నారు.

సజ్జల కట్టిన 'గాలి మేడలు'

విజయవాడను తాము చాలా అభివృద్ధి చేశామని సజ్జల రామకృష్ణా రెడ్డి లేని గొప్పలు చెప్పుకొన్నారు. 'విజయవాడలో కొత్త ఫ్లై ఓవర్లు పూర్తి చేశాం. అమరావతిని అనుసంధానించే పశ్చిమ బైపాస్ రోడ్డును మేమే వేశాం. చివరికి చంద్రబాబు ఇంటి ముందు కరకట్ట రోడ్డు కూడా మేమే వేశాం" అని సజ్జల పేర్కొన్నారు. అసలు వాస్తవమేమిటంటే... కరకట్ట రోడ్డు అభివృద్ధికి 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం టెండర్లు పిలిచింది. జగన్ వచ్చాక వాటిని పక్కన పెట్టారు. ఇప్పటికీ అక్కడ సింగిల్ రోడ్డే ఉంది. విజయవాడలో కనకదుర్గ ఫ్లైఓవర్లన్నీ కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులే. కనకదుర్గ ఫ్లైఓవర్ పూర్తి కోసం అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ, చొరవ తీసుకుని... కాంట్రాక్టు సంస్థను కదిలించి పూర్తి చేయించింది. బెంజ్ సర్కిల్ ఫ్లైఓవర్లను సీఎం హోదాలో ప్రారంభించేందుకు జగన్ సిద్ధమైనా.. కేంద్ర మంత్రి గడ్కరీ అంగీకరించలేదు. ఆయన ఢిల్లీ నుంచి ఆన్‌లైన్‌లో ప్రారంభించారు. ఇక.. వెస్ట్ బైపాస్ కూడా కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టే. ఇది ఉమ్మడి రాష్ట్రంలోనే ప్రతిపాదించిన ప్రాజెక్టు. అలైన్‌మెంట్ కూడా అప్పుడే నిర్ణయించారు. రాజధాని ఆ తర్వాతే వచ్చింది. కాంట్రాక్టు సంస్థను ఒప్పించి ఈ పనులను పూర్తి చేయించేందుకు అప్పుడే టీడీపీ ప్రభుత్వం తీవ్ర స్థాయిలో కృషి చేసింది. కోర్టు వివాదాలు, ఆ తర్వాత పరిష్కారాలతో పనులు ముందుకు సాగాయి. అంతేతప్ప... ఇది జగన్ సర్కారు చేపట్టిన ప్రాజెక్టు కాదు. సజ్జల చెప్పినట్లుగా రాజధానిని అనుసంధానించాలన్న ప్రేమా లేదు.


శోభాయాత్రలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, కేంద్ర మంత్రి వర్మ

వైద్య విద్యలో పీపీపీ అవసరం

» 6 నెలల్లో టారిఫ్ సమస్యకు పరిష్కారం

» వైసీపీతో బీజేపీకి చీకటి ఒప్పందాలు లేవు: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

భీమవరం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): వైద్య విద్యలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) అవసరమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో శుక్రవారం నిర్వహించిన సారథ్యం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పట్టణంలో నిర్వహించిన శోభాయాత్రకు జిల్లా నలుమూలల నుంచి బీజేపీ కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. అనంతరం స్థానిక డీఎన్ఆర్ కళాశాలలో చాయ్‌పే చర్చా కార్యక్రమంలో, పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో మాధవ్ మాట్లాడారు. ఆక్వా రైతుల సమస్య తాత్కాలికమేనని భరోసా ఇచ్చారు. భారత్ కొత్తగా 20 దేశాలతో ఒప్పందాలు చేసుకుంటోందని తెలిపారు. స్థానిక ఉత్పత్తులకు విశేషమైన మార్కెట్ ఉంటుందని చెప్పారు. భారత్ స్వయం సమృద్ధి దేశంగా మారాలని, స్వదేశీ ఉద్యమం ద్వారా అగ్రరాజ్యాల పెత్తనాన్ని నియంత్రించవచ్చని పేర్కొన్నారు. టారిఫ్ సమస్యలు మరో ఆరు నెలల్లో పరిష్కారమవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. దేవాలయాలపై వైసీపీ నాయకుడు పేర్ని నాని చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. వాస్తవాలు దాచి నాని మాట్లాడటం సరికాదన్నారు. ఆలయాల్లో అపచారం చేస్తే సహించబోమని ఆయన హెచ్చరించారు. పంచారామాల ఆధ్యాత్మిక యాత్రకు ప్రభుత్వం యోచిస్తోందని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పోటీ చేస్తాయని స్పష్టం చేశారు. వైసీపీతో బీజేపీకి ఎటువంటి చీకటి ఒప్పందాలు లేవని తేల్చిచెప్పారు. వైసీపీ హయాంలో జరిగిన అవినీతికి వ్యతిరేకంగా బీజేపీ పోరాడిందని మాధవ్ గుర్తుచేశారు.

ఎస్ఐఆర్‌లో 12వ ధ్రువ పత్రంగా ఆధార్ కార్డు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12: దేశవ్యాప్తంగా చేపట్టే ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్)లో ఓటర్ల ఆధార్‌ను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఈసీ నిర్ణయించింది. ఎస్ఐఆర్ సమయంలో సమర్పించే ధ్రువపత్రాల జాబితాలో ఆధార్‌ను కూడా చేర్చాలని రాష్ట్రాల ఎన్నికల ప్రధానాధికారుల(సీఈవోల)కు సూచించింది. ఓటరు జాబితా వెరిఫికేషన్ సందర్భంగా ఓటరు గుర్తింపు కోసం ప్రస్తుతం పరిశీలిస్తున్న 11 ధ్రువపత్రాలతోపాటు ఆధార్‌ను కూడా చేర్చాలంటూ ఈ నెల 8న సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే.

రాష్ట్రానికి పట్టిన చీడపురుగు జగన్

» సూపర్ సిక్స్... సూపర్ హిట్ సభ సూపర్ డూపర్ హిట్

» తట్టుకోలేకే జగన్‌రెడ్డి కుట్రలు: మంత్రి కొల్లు



విజయవాడ (వన్‌టౌన్), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పట్టిన చీడపురుగు జగన్‌రెడ్డి అని మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. విజయవాడలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'వైసీపీ అధికారంలోకి వస్తే టెండర్లు రద్దు చేస్తాం, పెట్టుబడుల్ని తరిమేస్తాం, కూల్చేస్తామని జగన్‌రెడ్డి వ్యాఖ్యానించడం అత్యంత హేయం. జగన్ రెడ్డి నిర్వాకం కారణంగానే అమరావతి, పోలవరం పనులు పడకేశాయి. ఇప్పుడు వాటి వ్యయం పెరిగి రాష్ట్రానికి భారంగా మారింది. సూపర్ సిక్స్ - సూపర్ హిట్ సభ సూపర్ డూపర్ హిట్ అయ్యింది. అది చూసి తట్టుకోలేక కూటమి ప్రభుత్వంపై జగన్ కుట్రలు చేస్తున్నాడు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ఏడాది కాలంలోనే అమలు చేశాం. ప్రజలు సంతోషంగా ఉండడం నచ్చక, కూటమి ప్రభుత్వంపై జగన్ కుట్రలు చేస్తున్నాడు. ఎరువుల పేరుతో రైతుల్లో భయాందోళనలు రేకెత్తించేందుకు ప్రయత్నిస్తున్నాడు. దేవాలయాల ఆస్తులపై జగన్ నీచ రాజకీయం చేస్తున్నాడు. విజయవాడ ఫెస్టివల్ కోసం దేవాలయ భూములను 40 రోజులు వాడుకుంటున్నాం. అందుకు సొమ్ము చెల్లిస్తామని చెప్పాం. దేవాలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఒప్పందంపై బురద జల్లేలా వ్యాఖ్యానించటం దుర్మార్గం' అని మంత్రి కొల్లు విమర్శించారు.

ప్రతిపక్ష హోదా ఇస్తేనే వస్తాననడం సిగ్గుచేటు

» జీతాలైతే తీసుకుంటారు.. ప్రజా సమస్యలు మాట్లాడటానికి రారా..!: మంత్రి దుర్గేశ్



తిరుపతి(విద్య), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తామని జగన్ చెప్పడం సిగ్గుచేటని మంత్రి కందుల దుర్గేశ్ వ్యాఖ్యానించారు. తిరుపతిలో శుక్రవారం జరిగిన పెట్టుబడిదారుల సమావేశంలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఎమ్మెల్యేలుగా గెలిచిన వైసీపీ నేతలు ఎందుకు అసెంబ్లీకి రారు? జీతాలైతే తీసుకుంటారా..! ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు మాత్రం రారా..! సిగ్గులేకుండా... ప్రతిపక్ష హోదా ఇస్తేనే వస్తామనడం ఏమిటి? జగన్ తోపాటు వైసీపీలో గెలిచినవారెవరూ ప్రజలకు జవాబుదారులుగా ఉండకపోవడం, ప్రజా సమస్యల పరిష్కారానికి పనిచేయకపోవడం హేయం' అని మంత్రి మండిపడ్డారు. రాష్ట్రంలో 22 మెడికల్ కళాశాలలను పీపీపీ విధానంలో అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్న మంత్రి మీడియా అడిగిన ఓ ప్రశ్నకు సమాధానం ఇస్తూ... 'జగన్ అధికారంలోకి వచ్చేదీలేదు... పెట్టుబడిదారులను చేసేది కూడా ఏమీ లేదు' అని తేల్చేశారు. తిరుపతి, రాయలసీమలో ఆధ్యాత్మిక పర్యాటకంతోపాటు... ఎకో, హెలీ, అడ్వెంచర్ టూరిజంనూ అభివృద్ధి చేస్తామన్నారు. అందుకే విజయవాడ, వైజాగ్ తర్వాత తిరుపతిలో పెట్టుబడిదారుల సమావేశం నిర్వహించినట్టు చెప్పారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు నెలవల విజయశ్రీ, ఆరణి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఫేక్ పార్టీ: బుచ్చి రాంప్రసాద్

అమరావతి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఓ ఫేక్ పార్టీ అని ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్ విమర్శించారు. శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఆధ్యాత్మికతకు ప్రతీకలైన హిందూ దేవాలయాలపై వైసీపీ ముఠా విషప్రచారం చేస్తోంది. తిరుమల వెంకటేశ్వరునికి సతీసమేతంగా జగన్ ఒక్కసారైనా పట్టువస్త్రాలు సమర్పించాడా? నిత్యం హిందూమతంపై దాడి చేయటం వైసీపీ పేటీఎం బ్యాచ్‌కి అలవాటుగా మారింది' అంటూ బుచ్చి రాంప్రసాద్ మండిపడ్డారు.

మాది కార్మికుల, కర్షకుల ప్రభుత్వం: ఎమ్మెల్యే వర్ల

అమరావతి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్నది కార్మికుల, కర్షకుల ప్రభుత్వమని మరోసారి నిరూపితమైందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. 'ఆటో డ్రైవర్లకు దసరా నుంచి రూ.15 వేలు ఆర్థిక సాయం సీఎం చంద్రబాబు ప్రకటించారు. దీనివల్ల రాష్ట్రంలో ఉన్న 2.90 లక్షల మందికి రూ.435 కోట్లు లబ్ధి చేకూరుతుంది. ఆటో డ్రైవర్ సోదరుల తరఫున సీఎం చంద్రబాబుకి, కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నా. పేదలకు మేలు జరిగే కార్యక్రమాలకు జగన్ అడ్డుపడుతున్నాడు. జగన్ హయంలో కొందరికే అమ్మ ఒడి, అందరికీ కంటతడి మిగిలింది' అని ఎమ్మెల్యే వర్ల విమర్శించారు.

జగన్ నీ సినిమా అయిపోయింది: ఉండవల్లి శ్రీదేవి



కర్నూలు అర్బన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): తండ్రి చావును అడ్డుపెట్టుకుని, ఒక్క అవకాశం పేరుతో రాష్ట్రాన్ని విధ్వంసం చేసిన జగన్‌రెడ్డి సినిమా అయిపోయిందని మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. శుక్రవారం కర్నూలు జిల్లా టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అంబేడ్కర్ ఆశయాలకు తూట్లు పొడుస్తూ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసిన జగన్‌కు దళితుల ఉసురు తగిలిందన్నారు. అందుకే కనీసం ప్రతిపక్ష హోదా కూడా రాకుండా కొట్టుకుపోయాడన్నారు. చివరకు జగన్ కేబినెట్‌లో మంత్రిగా పనిచేసిన రోజా కూడా దళితులతో ఫొటోలు దిగేందుకు వివక్ష చూపడం దారుణమని శ్రీదేవి అన్నారు.

జగనే దేనిలోనైనా దూకాలి: మంత్రి సుభాష్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాయలసీమలో సూపర్‌సిక్స్ సభ సూపర్ హిట్ కావడంతో వైసీపీ ఫేక్ ప్రచారాలు చేస్తోందని మంత్రి వాసంశెట్టి సుభాష్ మండిపడ్డారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'మానసికంగా ఇబ్బంది పడుతుంటే జగనే దేంట్లోనైనా దూకాలి. వైసీపీ ఓ విషవృక్షం. గీత కులాల మధ్య చిచ్చుపెట్టడానికి 2023లో చెల్లుబోయిన వేణు మంత్రిగా ఉన్నప్పుడే గీత ఉపకులాలన్నింటినీ గౌడ్ కులం కిందకు తెస్తూ... వైసీపీ ప్రభుత్వం ఓ చీకటి జీవో తెచ్చింది. అప్పుడు ప్రజల్లో వ్యతిరేకత రావడంతో దానిని దాచిపెట్టింది. ఇటీవల, కూటమి ప్రభుత్వమే ఆ జీవో ఇచ్చినట్టు, శెట్టిబలిజలను ఓసీలలో కలిపేస్తున్నట్టు తప్పుడు ప్రచారం మొదలు పెట్టింది. దీని గురించి తెలిసిన వెంటనే మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లాం. కేవలం వారం రోజుల్లో గీత ఉపకులాలైన శెట్టిబలిజ, గౌడ, శ్రీశయన, ఈడిగ, యాత కులాలకు సెపరేట్‌గా కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలంటూ జీవో వచ్చేలా చేశారు' అని మంత్రి వివరించారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు మాట్లాడుతూ, 'గీత కులాలన్నీ ఒకటిగానే ఉంటాయి. కానీ ఎవరి ఉనికి వారికి అవసరం కాబట్టి, సెపరేట్ చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవోను స్వాగతిస్తున్నాం' అని అన్నారు.

జగన్ వ్యాఖ్యలు సిగ్గుచేటు: ఎంపీ కలిశెట్టి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్ సీఎం చంద్రబాబు పట్ల చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటు అని టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఎన్నికలలో ఇచ్చిన హామీలను సమర్థవంతంగా అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సీఎం చంద్రబాబుకు ఉన్న ప్రజాదరణను ఓర్వలేక రోత వ్యాఖ్యలు చేయడం వైఎస్ జగన్‌కే చెల్లిందని విమర్శించారు. శుక్రవారం ఏపీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంపీ మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, అనంతపురంలో నిర్వహించిన బహిరంగ సభకు లక్షలాదిగా ప్రజలు తరలిరావడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. నేపాల్‌లో చిక్కుకున్న ఏపీ ప్రజలను సురక్షితంగా సీఎం చంద్రబాబు తీసుకొచ్చారని, వైఎస్ జగన్ మాత్రం ఏం జరిగిందో కూడా కనీసం ఆరా తీయలేని స్థితిలో ఉండి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు.

ఇన్నోవేషన్ హబ్‌గా ఆంధ్ర: మంత్రి కొండపల్లి

హైదరాబాద్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శక్తివంతమైన మౌలిక సదుపాయాలతో ఇన్నోవేషన్ హబ్‌ల కేంద్రంగా మారిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఇంటర్నేషనల్ మెకానికల్ ఇంజనీరింగ్ కాంగ్రెస్ అండ్ ఎక్స్‌పొజిషన్ ఇండియా 2025 సదస్సు శుక్రవారం హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో జరిగింది. సదస్సులో పాల్గొన్న మంత్రి శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ, ఏపీ రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలు, స్టార్టప్‌లకు ఎక్కువ అవకాశం కల్పిస్తుందని చెప్పారు. సదస్సులో వివిధ దేశాల నుంచి వచ్చిన పారిశ్రామిక వేత్తలు, ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

మునిసిపల్ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం

» వైసీపీ మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటి కొలతలు తీసిన టౌన్ ప్లానింగ్ అధికారులు

» అనుమతి లేకుండానే నిర్మించారని గుర్తింపు

పుట్లూరు, తాడిపత్రి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత కేతిరెడ్డి పెద్దారెడ్డి మునిసిపాలిటీకి చెందిన స్థలాన్ని ఆక్రమించి ఇల్లు నిర్మించినట్టు నిర్ధారణ అయింది. గతంలో ఈ విషయంపై అందిన ఫిర్యాదుల మేరకు.. మునిసిపల్, రెవెన్యూ అధికారులు శుక్రవారం పెద్దారెడ్డి ఇంటి కొలతలు తీశారు. ఈ విషయం తెలుసుకున్న పెద్దారెడ్డి తన స్వగ్రామం యల్లనూరు మండలం తిమ్మంపల్లి నుంచి పుట్లూరు మీదుగా తాడిపత్రికి బయలుదేరారు. అంతకుముందు తాడిపత్రికి వెళ్లేందుకు అనుమతి కోరుతూ జిల్లా ఎస్పీ జగదీశ్‌కు మెయిల్ పెట్టారు. పుట్లూరు వరకు వచ్చినప్పటికీ అనుమతి రాకపోవడంతో రోడ్డు పక్కన వాహనాలు నిలిపి వేచిచూశారు. ఈ సమయంలో మరోమారు ఎస్పీకి మెయిల్ పెట్టి, అక్కడే ఓ పొలంలో ఉన్న బండమీద కూర్చుని 2గంటలపాటు వేచి చూశారు. ఎట్టకేలకు ఎస్పీ నుంచి అనుమతి వచ్చాక పుట్లూరు సీఐ సత్యబాబు పెద్దారెడ్డిని తాడిపత్రికి తీసుకువెళ్లారు. తన ఇంటిని సర్వే చేస్తున్న అధికారులతో పెద్దారెడ్డి మాట్లాడారు. రికార్డుల ప్రకారం ఉన్నది ఉన్నట్లు రాసివ్వాలని కోరారు. తన ఇంటి నిర్మాణానికి టౌన్ ప్లానింగ్ అధికారుల నుంచి అనుమతి తీసుకున్నానని చెప్పి ఇంట్లోకి వెళ్లిపోయారు. కాగా, అడిషనల్ ఎస్పీ రోహిత్ కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు శివారెడ్డి ఆధ్వర్యంలో ఇన్‌చార్జి తహసీల్దారు సోమశేఖర్, సబ్ రిజిస్ట్రార్ శివనారాయణ తదితరులు పెద్దారెడ్డి ఇంటి స్థలాన్ని సర్వే చేసి, కొలతలను తీసుకున్నారు. సుమారు 2సెంట్ల మున్సిపాలిటీ స్థలాన్ని ఆక్రమించినట్టు నిర్ధారించారు. భవంతికి ప్లాన్ అప్రూవల్ లేదని టౌన్ ప్లానింగ్ అధికారి సుజాత తెలిపారు. పెద్దారెడ్డి రాక నేపథ్యంలో తాడిపత్రికి వివిధ స్టేషన్‌ల నుంచి 400మంది పోలీసు సిబ్బందిని రప్పించారు. మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి, పెద్దారెడ్డి నివాసాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.


అనంతపురం జిల్లా తాడిపత్రిలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటి కొలతలు సేకరిస్తున్న అధికారులు

దోపిడీలో దోపిడీ!

తిరుపతిలో చెవిరెడ్డి మార్క్ నయా దందా!.. 36 కోట్ల విలువైన భూమి 2.93 కోట్లకే

- మద్యం సొమ్ముతో అర్చకుడి ఆస్తి కొనుగోలు
- అర్చకుడి భార్యకు 24 లక్షలే చెల్లింపు
- మిగిలిన 2.69 కోట్లకు గాను అనుచరులకు ఆమే అప్పు ఉన్నట్టుగా నోటు తయారీ
- వారి పేరిట డొల్ల కంపెనీలు సృష్టించి బదిలీ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

దోపిడీలో ఇదో కొత్త రకం దోపిడీ! ఇలా కూడా దోచుకో వచ్చా అని విస్తుపోయేలా నిలువు దోపిడీ! వైసీపీ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి మాత్రమే ఇది సాధ్యం! మద్యం ముడుపుల్ని ఎన్నికల సమయంలో వైసీపీ అభ్యర్థులకు పంచిన చెవిరెడ్డి.. అంతకుముందే భారీగా ఆస్తులు పోగేసుకున్నారు. గతంలో చంద్రగిరి వైసీపీ ఎమ్మెల్యేగా, టీటీడీ పాలకమండలి సభ్యుడిగా, తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(తుడా) ఛైర్మన్‌గా పనిచేసిన ఆయన ఏడు కొండల నుంచి కింది వరకూ తనకంటూ ఒక ప్రత్యేక సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు. తన కుమారుల కోసం ఆంధ్రా నుంచి ఆఫ్రికా వరకూ వందల కోట్ల రూపాయల ఆస్తులు పోగేశారు. ఈ క్రమంలో తిరుపతి జిల్లా తిరుచానూరు అమ్మవారి ఆలయ ప్రధాన అర్చకుడి కుటుంబ ఆస్తిపై కన్నేశారు. వారిపై ఒత్తిడి చేసి తిరుపతి శివారున ఉన్న 36 కోట్ల రూపాయల విలువ చేసే 2.93 ఎకరాలను కేవలం రూ.2.93 కోట్లకే కొనుగోలు చేశారు. మద్యం ముడుపుల సొమ్ముతో ఈ భూమిని కొన్నట్లు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తాజా విచారణలో బయట పడింది. లిక్కర్ స్కామ్‌లో నిందితుడిగా ఉన్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి(పెద్ద కుమారుడు) పేరు వచ్చేలా సీఎంఆర్ ఇన్‌ఫ్రా పేరిట 2023 ఏప్రిల్‌లో రిజిస్టర్ చేయించుకున్నారు. ఆ కంపెనీలో ఆథరైజ్డ్ సిగ్నేచర్ అథారిటీగా ఉన్న చిన్న కుమారుడు హర్షిత్ రెడ్డి కొనుగోలు లావాదేవీల డాక్యుమెంట్లపై సంతకాలు చేశారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ఒకేసారి భూమి కొనుగోలు చేస్తే అంత డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందో ఆదాయపు పన్ను శాఖకు లెక్క చెప్పాలి. దీంతో చెవిరెడ్డి కొనుగోలు చేసిన 2.93 ఎకరాల భూమిని 73.25 సెంట్ల చొప్పున నాలుగు భాగాలుగా విభజించి నాలుగు డాక్యుమెంట్లలో రిజిస్టర్ చేయించుకున్నారు. మాట్లాడుకున్న ధర ప్రకారం.. అర్చకుడి భార్యకు రూ.2.93 కోట్లు చెల్లించాలి. అయితే ఒక్కో డాక్యుమెంట్‌కు రూ.6 లక్షలు మాత్రమే సీఎంఆర్ ఇన్‌ఫ్రా ఖాతా నుంచి చెల్లించినట్లు చూపించారు. అర్చకుడి భార్య ఖాతాలోకి రూ.24 లక్షలు బదిలీ చేశారు. మిగిలిన పెండింగ్ సొమ్ము ఒక్కో డాక్యుమెంటుకు రూ.67.25 లక్షల చొప్పున.. నాలుగు డాక్యుమెంట్లకు కలిపి మొత్తం 2.69 కోట్ల రూపాయలకు రేణుకతో నాలుగు నోట్లు రాయించుకున్నారు. చెవిరెడ్డి బంధువులు, అనుచరులు, సన్నిహితులు, పొరుగింటి వ్యక్తులకు ఆమె అప్పు ఉన్నట్లు చూపించి, వారికి చెల్లించేలా ఒప్పందం చేయించుకున్నారు.

16 మంది పేర్లతో 8 డొల్ల కంపెనీలు

దోచుకున్న సొమ్మును డొల్ల కంపెనీల ఆదాయంగా చూపించడంలో మాస్టర్ డిగ్రీ పొందిన వైసీపీ అధ్యక్షుడు జగన్ బాటనే... ఆయన పార్టీ ప్రధాన కార్యదర్శి, లా డిగ్రీ పొందిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అనుసరించారు. తన బంధువులు, అనుచరులు, సన్నిహితులను మొత్తం 16 మందిని ఎంపిక చేసుకుని తన ఇంటి అడ్రస్ అయిన తుమ్మల గుంట చిరునామాతో ఎనిమిది డొల్ల కంపెనీలు రిజిస్టర్ చేయించారు. ఏప్రిల్ 2021 నుంచి 2023 మధ్యలో ఆ కంపెనీలు పుట్టుకొచ్చాయి. లత ఆగ్రో సర్వీసెస్, శోభా డెవలపర్స్, జితేంద్ర ఇన్‌ఫ్రా, వినయ్ ఇన్‌ఫ్రా, హరీశ్ సర్వీసెస్, కుర్రా డెయిరీ సర్వీసెస్, బీవన్ సర్వీసెస్, నవీన్ ఇన్‌ఫ్రా పేరిట కంపెనీలు సృష్టించారు. కేవలం పేపర్‌పైన మాత్రమే ఇవి ఉన్నాయి. ఈ కంపెనీలకు అర్చకుడి సతీమణి రేణుక బకాయి ఉన్నట్టు డాక్యుమెంటు రాయించుకున్నారు. ఎలాంటి లావాదేవీలు జరపని ఈ 8 కంపెనీలకు ఆమె ఏ విధంగా బకాయి పడ్డారో వెల్లడించలేదు. ఈ ఎనిమిది కంపెనీల ఖాతాల్లోకి రూ.33 లక్షల చొప్పున రూ.2.69 కోట్లు సీఎంఆర్ ఇన్‌ఫ్రా ఖాతా నుంచి జమ చేశారు. ఆమె బకాయి చెల్లించినట్లు 'లెక్క' సరిచేశారు. చెవిరెడ్డి మద్యం ముడుపుల సొమ్మును వైట్ మనీగా మార్చుకోవడానికే ఈ ఎత్తుగడ వేసినట్లు సిట్ అధికారులు అనుమానిస్తున్నారు. ఆ భూమిని అభివృద్ధి చేసి తుడా నిధులతో మౌలిక సదుపాయాలు కల్పించి మరింత ధర పలికేలా చేసుకున్నారు.

డ్రైవర్, పనోడూ...

డొల్ల కంపెనీలకు యజమానులు ఎవరా అని ఆరా తీసిన సిట్ అధికారులకు విస్తుపోయే విషయాలు తెలిశాయి. అక్రమ సొమ్మును సక్రమ సంపాదనగా చూపించుకోవడానికి చెవిరెడ్డి వేసిన ఎత్తుగడలో ఏకంగా తన డ్రైవర్, సహాయకుడు, బంధువులు, పొరుగింటి వారిని కంపెనీలకు యజమానుల్ని చేశారు. లిక్కర్ స్కామ్‌లో నిందితుడైన నవీన్ కృష్ణ(ఏ-36)తో పాటు శిరీష అనే మరో మహిళ డైరెక్టర్లుగా నవీన్ ఇన్‌ఫ్రా ఏర్పాటైంది. మరో కంపెనీ లతా ఆగ్రోస్‌కు చెవిరెడ్డి మరదలు సునంద, బంధువు లత డైరెక్టర్లు. శోభా డెవలపర్స్‌కు పొరుగింట్లో ఉండే లోకేశ్ రెడ్డి, శోభారాణి యజమానులు. జితేంద్ర ఇన్‌ఫ్రా డైరెక్టర్లుగా చెవిరెడ్డికి సోదరుడయ్యే జితేంద్ర రెడ్డి, ఆయన తల్లి కుమారి ఉన్నారు. బీవన్ కంపెనీకి సన్నిహితుడు బీవన్ రెడ్డి, ఆయన తల్లి నాగేశ్వరి డైరెక్టర్లు. కుర్రా డెయిరీ సర్వీసెస్‌కు మేనల్లుడు మునిశంకర్ రెడ్డి, మామ జశ్వంత్ యజమానులు. హరీశ్ సర్వీసెస్‌కు డైరెక్టర్లుగా డ్రైవర్ హరీశ్ కుమార్ రెడ్డి, నమ్మకమైన పనోడు మహేశ్వర రెడ్డి ఉన్నారు. వినయ్ ఇన్‌ఫ్రా డైరెక్టర్లు బోడపాటి వినయ్, హేమంత్ ఇద్దరూ చెవిరెడ్డి అనుచరులేనని సిట్ దర్యాప్తులో వెల్లడైంది. వీరిని ప్రశ్నించేందుకు సిట్ అధికారులు ప్రయత్నించగా ఒక్కరంటే ఒక్కరూ అందుబాటులో లేరు. మొత్తం అజ్ఞాతంలోకి వెళ్లిపోవడంతో గుమ్మానికి నోటీసులు అతికించి విచారణకు పిలిచే అవకాశం ఉంది. చెవిరెడ్డి ఇంకా ఎక్కడెక్కడ భూములు కొనుగోలు చేశారు? ఎన్ని వందల కోట్లు సంపాదించారు? ఏయే దేశాల్లో పెట్టుబడులు పెట్టారనే దానిపై సమగ్ర సమాచారాన్ని సిట్ సేకరిస్తోంది.

అంకణం కొనే శక్తి లేకున్నా..

తిరుపతి పరిసరాల్లో నివాస స్థలాలు అంకణాల రూపంలో క్రయ విక్రయాలు జరుగుతాయి. ప్రతి అంకణం 36 చదరపు అడుగులు. తిరుచానూరు పరిసరాల్లో కనీసం 2 లక్షలకు తగ్గకుండా అంకణం ఖరీదు చేస్తుంది. అలాంటి చోట పాతిక వేల జీతానికి పనిచేసే డ్రైవర్ ఒక కంపెనీ స్థాపించి వందల అంకణాలు ఎలా కొనుగోలు చేశాడో? అర్చకుడి భార్యకు లక్షలాది రూపాయలు అప్పుగా ఇచ్చి కోట్లాది రూపాయల విలువ చేసే భూమి రిజిస్టర్ చేయించుకున్నారు. సిట్ దర్యాప్తులో ఇలాంటి లీలలు ఇంకెన్ని వెలుగులోకి వస్తాయో!

సిట్ వలలో జగన్ బంధువు!

- సందీప్‌రెడ్డిని ప్రశ్నించిన అధికారులు
- తెలంగాణలోని కంపెనీలో 8గంటలు సోదాలు
- విలువైన పత్రాలు, కంప్యూటర్ డేటా స్వాధీనం

సంగారెడ్డి రూరల్, విశాఖపట్నం,సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మద్యం స్కాం కేసు విచారణలో సిట్ అధికారులు వేగం పెంచారు. శుక్రవారం తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా ఇస్మాయిల్‌ఖాన్‌పేటలో మాజీ సీఎం జగన్ బంధువు సందీప్‌రెడ్డికి చెందిన కంపెనీలో సోదాలు జరిపారు. విజయవాడకు చెందిన పది మంది సిట్ అధికారుల బృందం .. సందీప్‌రెడ్డి నిర్వహణలోని గ్రీన్‌టెక్ ఇంజనీరింగ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ వద్దకు శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో చేరుకుంది. సోదాలు రాత్రి 9 గంటల వరకు కొనసాగాయి. ఇదే సమయంలో మరో బృందం సందీప్‌రెడ్డిని ప్రశ్నించినట్టు సమాచారం. అయితే, సందీప్‌రెడ్డి కొన్ని ప్రశ్నలకు పొంతనలేని సమాధానాలు ఇచ్చినట్టు తెలిసింది. కంపెనీ సిబ్బందిని కూడా వేరు వేరుగా ప్రశ్నిస్తూ వారి స్టేట్‌మెంట్లను నమోదుచేశారు. అనంతరం కార్యాలయం నుంచి పలు విలువైన పత్రాలు, బ్యాంకు లావాదేవీల స్టేట్‌మెంట్లు, ప్రాజెక్టు ఒప్పందాలు, ఇన్‌కం ట్యాక్స్ ఫైలింగ్‌లు, డిజిటల్ డేటాను సిట్ అధికారులు తమ వెంట తీసుకువెళ్లినట్టు సమాచారం.



వందే... మనీషా!

- వందేభారత్ రైళ్లు నడుపుతున్న చిరుత
- ఎన్టీఆర్ జిల్లాకు చెందిన మట్టిలో మాణిక్యం

జీవితంలో ఎదగాలన్న పట్టుదల ముందు పేదరికం, ఆకలి, కుంగదీసే అవరోధాలు పటాపంచలయ్యాయి. ఏదోక ఉద్యోగాన్ని అందరూ సంపాదిస్తారు. కానీ, తాను కలలుగన్న డ్రైవర్ ఉద్యోగం, అందునా గంటకు 180 కి.మీ. వేగంతో దూసుకుపోయే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ లోకో పైలట్‌గా ఎదగడం.. వంటివి ఆమెకే సాధ్యమైంది! అది కూడా అతిపిన్న వయసులోనే!! ఆమే.. గుంటి మనీషా. ఎన్టీఆర్ జిల్లా కొత్తూరు తాడేపల్లికి చెందిన ఈ యువతి.. నేటి తరానికి స్ఫూర్తిదాయకం.

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

ఆమెది పేద కుటుంబం. చిన్నతనంలోనే తండ్రి మరణించారు. దీంతో కష్టాలు చుట్టుముట్టాయి. పూటగడిచేందుకే ఇబ్బందులు ఎదురయ్యాయి. అయితేనేం.. జీవితంలో ఉత్తమస్థాయికి ఎదగాలని, డ్రైవర్ కావాలని కలలుకన్నారు. వాటిని సాకారం చేసుకునేందుకు కష్టాలను ఇష్టాలుగా మార్చుకుని, అక్క ప్రోత్సాహంతో అభ్యసనం కొనసాగించి తన కలను సాకారం చేసుకున్నారు. ఆమే ఎన్టీఆర్ జిల్లా కొత్తూరు తాడేపల్లికి చెందిన గంటి మనీషా. ప్రస్తుతం హైస్పీడ్, వందేభారత్ రైళ్ల లోకో పైలట్‌గా పనిచేస్తున్నారు. మనీషా తండ్రి గుంటి నాగరాజు లారీ డ్రైవర్. భార్య ఇద్దరు కుమార్తెలతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. దురదృష్టవశాత్తూ మనీష చిన్నతనంలోనే తండ్రి రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. దీంతో మనీషా తల్లి సరోజిని పిల్లల్ని పెంచటానికి ఎంతో కష్టపడ్డారు. పేదరికం కారణంగా చిన్నతనంలోనే మనీషా ఎన్నో కష్టాలను చవిచూశారు. అయినప్పటికీ డ్రైవర్ కావాలన్న ఆకాంక్షను మాత్రం చంపుకోలేదు. బుల్లితెర నటిగా, ఈవెంట్ నిర్వాహకురాలిగా ఉన్న మనీషా అక్క కవిత... ఆమెని అక్కున చేర్చుకుని చదువు చెప్పించారు. పదవ తరగతి తర్వాత మనీషా ఐటీఐలో చేరి ఎలక్ట్రీషియన్ కోర్సు చేశారు. అక్కడి ఇన్‌స్ట్రక్టర్లు ఆమె అభిలాషను తెలుసుకుని, రైళ్లను నడిపే పైలట్‌గా ఎదిగేలా ప్రోత్సహించారు. ఐటీఐ పూర్తయ్యాక రైల్వే శాఖలో లోకో పైలట్ ఉద్యోగానికి ఆమె దరఖాస్తు చేసుకున్నారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించటానికి మనీషా ఎంతో కష్టపడ్డారు. తన సోదరి కవిత సాయంతో బెంగళూరులోని ఓ అకాడమీలో పోటీ పరీక్షకు కోచింగ్ తీసుకున్నారు.

తొలి ప్రయత్నంలోనే..

సాధారణంగా లోకో పైలట్ ఉద్యోగాలకు పోటీ ఎక్కువ. రెండు మూడు ప్రయత్నాలు చేస్తే తప్ప ఉత్తీర్ణులుకావడం కష్టమని అంటారు. అలాంటిది తొలి ప్రయత్నంలోనే మనీషా రైల్వే లోకోపైలట్ ఉద్యోగం దక్కించుకుని, బెంగళూరు డివిజన్ పరిధిలో శిక్షణ పొందారు. శిక్షణ సమయంలోనే అత్యుత్తమ ప్రతిభను నిరూపించారు. అనంతరం ఆమెకు బెంగళూరు-జైపూర్ గూడ్స్ రైలు లోకో పైలట్‌గా విధులు కేటాయించారు. ఈ సమయంలో మరిన్ని మెళకువలు నేర్చుకున్నారు. రైళ్లు నడిపేటప్పుడు ఎలాంటి పరిస్థితులు ఉంటా యి?. ఎలా వ్యవహరించాలి?. ఒక పైలట్‌గా ఎంత సమర్థవంతంగా వ్యవహరించాలనే విషయాలపై సంపూర్ణ అవగాహన పెంచుకున్నారు. అనతికాలంలోనే ఆమెకు తిరుచినాపల్లి-విజయవాడ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో పైలట్‌గా అవకాశం లభించింది. ఈ రైళ్లను విజయవంతంగా నడపటంతో వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను నడిపే అవకాశం దక్కింది. బెంగళూరు-జైపూర్ మధ్య గంటకు 180కిలో మీటర్ల వేగంతో నడిచే వందేభారత్ లోకో పైలట్‌గా అధికారులు ఈ నెలలోనే అవకాశం కల్పించారు. ఒక మహిళగా దేశంలోనే అత్యంత వేగవంతమైన వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను అవలీలగా నడిపి, రైల్వే అధికారుల ప్రశంసలు అందుకున్నారు. ఎంతో మంది యువతకు స్ఫూర్తిగా నిలిచారు.

ఎన్నో కష్టాలు పడ్డాను..

పేద కుటుంబంలో పుట్టి ఎన్నో కష్టాలు పడ్డాను. అక్క నాకు ఎంతో మద్దతుగా నిలిచింది. డ్రైవర్ కావాలన్న ఆకాంక్ష చిన్నప్పుడే ఏర్పడింది. ఐటీఐ చదువుకునే రోజుల్లో మా ఇన్‌స్ట్రక్టర్స్ ప్రోత్సహించారు. లోకో పైలట్ కావాలన్న కసితో నేను పడిన కష్టం అంతా, ఇంతా కాదు. అనుకున్నట్టుగానే ఉత్తీర్ణత సాధించి లోకో పైలట్‌గా ఎంపికయ్యాను. వందేభారత్ ఎక్స్‌ప్రెస్ అంటే రైళ్లలోనే నెంబర్ వన్. ఆ రైలును ఇంత త్వరగా నడుపుతానని అనుకోలేదు. తొలిసారిగా వందేభారత్ నడుపుతున్నపుడు ఎంతో ఉద్విగ్నతకు లోనయ్యాను. నేను సాధించిన విజయం నాలాంటి ఎంతో మందికి స్ఫూర్తిదాయకం కావాలి.

- మనీషా, లోకో పైలట్

లిక్కర్ కేసు నిందితులకు 18 వరకు రిమాండ్ పొడిగింపు

- విజయవాడ ఏసీబీ కోర్టు ఉత్తర్వులు
- షరతులు ఉల్లంఘించరాదని పైలా దిలీప్‌కు మందలింపు



శుక్రవారం కోర్టు వద్ద మద్యం స్కాం నిందితులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మిథున్ రెడ్డి, రాజ్ కసిరెడ్డి

విజయవాడ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో నిందితులకు ఈ నెల 18 వరకు విజయవాడ ఏసీబీ కోర్టు రిమాండ్ పొడిగించింది. శుక్రవారం న్యాయాధికారి పి.భాస్కరరావు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. నిందితులకు రిమాండ్ గడువు ముగియడంతో కోర్టులో హాజరుపరిచారు. రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం నుంచి ఎంపీ మిథున్‌రెడ్డిని.. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చెరుకూరి వెంకటేశ్ నాయుడు, చాణక్య, కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డిని విజయవాడ జిల్లా కారాగారం నుంచి.. గుంటూరు జిల్లా జైలు నుంచి బాలాజీ కుమార్ యాదవ్, నవీన్ కృష్ణను కోర్టులో హాజరుపరిచారు. బెయిల్‌పై ఉన్న మాజీ ఐఏఎస్ అధికారి కె.ధనుంజయ్‌రెడ్డి, బాలాజీ గోవిందప్ప హాజరు కాలేదు. వీరిద్దరూ ఆబ్సెంట్ పిటిషన్ వేశారు. పైలా దిలీప్, పి.కృష్ణ మోహన్‌రెడ్డి హాజరయ్యారు. కేసులో నిందితుడిగా ఉన్న దిలీప్ బెయిల్ షరతులను ఉల్లంఘిస్తున్నాడని సిట్ అధికారులు ఫిర్యాదు చేశారు. బెయిల్‌పై విడుదలైన తర్వాత స్థలాల విక్రయాలకు ప్రయత్నిస్తున్నాడని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. గత డిసెంబరులో వివాహమైతే, అరెస్టుకు 6నెలల ముందు వివాహమైనట్టు కోర్టుకు తప్పుడు సమాచారం ఇచ్చాడని తెలిపారు. దానికి సంబంధించిన శుభలేఖను న్యాయాధికారికి అందజేశారు. కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డికి చెందిన స్థలాలకు దిలీప్ జీపీఏలు చేసుకుని విక్రయాలు చేస్తున్నాడని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దిలీప్ బెయిల్‌ను రద్దుచేయాలని అభ్యర్థించారు. అలాంటి పనులు చేయవద్దని న్యాయాధికారి భాస్కరరావు దిలీప్‌ను మందలించారు.

మళ్లీ చెవిరెడ్డి హల్‌చల్

చెవిరెడ్డి కోర్టు వద్ద మళ్లీ హల్‌చల్ చేశారు. జైలుకు తరలించడానికి వాహనం ఎక్కిస్తున్న సమయంలో మీడియాను చూసి గట్టిగా మాట్లాడారు. లిక్కర్ కేసుతో తనకు సంబంధం లేదని, ప్రభుత్వం అన్యాయంగా ఇరికించిందన్నారు. ఇంతకుముందు కూడా ఇదేవిధంగా చేయడంతో చెవిరెడ్డిని వర్చువల్‌గా హాజరు పరుస్తామని సిట్ అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. ఎలాంటి కేకలు వేయనని చెవిరెడ్డి నుంచి స్వీయధ్రువీకరణ తీసుకున్నారు. అయినా చెవిరెడ్డి కోర్టు ప్రాంగణంలో మరోసారి హడావుడి చేశారు.

విశాఖలో ముగిసిన సోదాలు


విశాఖపట్నంలో సిట్ అధికారుల సోదాలు శుక్రవారం ముగిశాయి. మద్యం కుంభకోణం కేసు దర్యాప్తులో భాగంగా సిట్ అధికారులు గురువారం విశాఖ వచ్చిన సంగతి తెలిసిందే. మాజీ ముఖ్యమంత్రి జగన్ వ్యక్తిగత సహాయకుడు నర్రెడ్డి సునీల్‌రెడ్డికి చెందిన రెండు కార్యాలయాల్లో (వెర్ట్ లైఫ్ బంకర్స్ ప్రైవేట్ లిమిటెడ్, గ్రీన్‌ఫీల్డ్స్) సోదాలు చేశారు. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం 8.30 గంటల వరకూ రికార్డులు, రిజిస్టర్లు, కంప్యూటర్లు, లాప్‌ట్యాప్‌లు అన్నీ పరిశీలించారు. నాలుగు పెట్టెల్లో వాటిలోని కీలక సమాచారం తీసుకువెళ్లినట్టు తెలిసింది.

ఫోరెన్సిక్‌కు మాజీ మంత్రి నారాయణస్వామి ఫోన్

విజయవాడ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): లిక్కర్ స్కామ్ విచారణలో భాగంగా మాజీ మంత్రి నారాయణస్వామి మొబైల్ ఫోన్‌ను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపేందుకు శుక్రవారం విజయవాడ ఏసీబీ కోర్టు అనుమతిచ్చింది. ఆయన వైసీపీ ప్రభుత్వంలో ఎక్సైజ్ మంత్రిగా పనిచేశారు. మద్యం కుంభకోణం దర్యాప్తులో భాగంగా కొద్దిరోజుల క్రితం సిట్ అధికారులు ఆయనను చిత్తూరు జిల్లాలో ఇంటి వద్ద విచారించారు. ఆయన ఇచ్చిన సమాచారాన్ని వాంగ్మూలంగా నమోదు చేసుకుని సదరు ఫోన్‌ను సీజ్ చేశారు.

మోహిత్‌రెడ్డి అదేపనిగా వాయిదా కోరుతున్నారు!

- మధ్యంతర ఉత్తర్వులను అడ్డుపెట్టుకున్నారు
- విచారణ సాగదీస్తున్నారు: సిట్ వాదనలు



అమరావతి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జరిగిన భారీ మద్యం కుంభకోణం కేసులో మధ్యంతర ఉత్తర్వులు పొందిన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, తాను దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణకు రాకుండా అదేపనిగా వాయిదాలు కోరుతున్నారని సిట్ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా హైకోర్టుకు నివేదించారు. తొందరపాటు చర్యలు తీసుకోవద్దని కోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను అడ్డుపెట్టుకుని పిటిషన్‌పై విచారణ జరగకుండా సాగదీస్తున్నారని వివరించారు. శుక్రవారం హైకోర్టులో జరిగిన విచారణలో ఆయన వాదనలు వినిపిస్తూ.. చార్జిషీట్ దాఖలు చేసేవరకు విచారణ జరగకుండా చూడాలన్నదే మోహిత్‌రెడ్డి ఉద్దేశమని తెలిపారు. సాధ్యమైనంత త్వరగా ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపి నిర్ణయం వెలువరించాలని అభ్యర్థించారు. పిటిషనర్ తరఫు న్యాయవాది స్పందిస్తూ.. వ్యక్తిగత కారణాలతో సీనియర్ న్యాయవాది విచారణకు హాజరుకాలేకపోయారని, మరోరోజుకు వాయిదా వేయాలని కోరారు. ఇరుపక్షాల వాదనలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ముందస్తు బెయిల్‌పై తదుపరి విచారణను ఈ నెల 19కి వాయిదా వేశారు. మోహిత్‌రెడ్డిపై తొందరపాటు చర్యలు వద్దంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించారు. మద్యం కుంభకోణం కేసులో 39వ నిందితుడిగా(ఏ-39) ఉన్న తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుమారుడు మోహిత్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.

బాలికా సంరక్షణపై రేపు రాష్ట్రస్థాయి సదస్సు

- ముఖ్య అతిథిగా హాజరుకానున్న హైకోర్టు సీజే ఠాకూర్



అమరావతి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ రంగాల భాగస్వాములతో బాలికల సంరక్షణ అంశంపై ఏపీ హైకోర్టు జువైనల్ జస్టిస్ కమిటీ ఆదివారం రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించనుంది. స్త్రీ శిశు సంక్షేమశాఖ, ఏపీ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీల సహకారంతో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం వేదికగా జరిగే ఈ సదస్సుకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ముఖ్య అతిథిగా, ముంబై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రేవతి మోహితి ధరే ప్రత్యేక అతిథిగా హాజరుకానున్నారు. వీరితోపాటు జేజేసీ ఛైర్‌పర్సన్ జస్టిస్ రవినాథ్ తిల్హరి, సభ్యులు జస్టిస్ వి.సుజాత, డాక్టర్ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, జస్టిస్ కిరణ్మయి మండవ, జస్టిస్ చల్లా గుణరంజన్, హైకోర్టు న్యాయమూర్తులు పాల్గొంటారు. ఈ సదస్సులో బాలికలపై జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలు, బాలికల హక్కుల, వారి సంరక్షణకు ఉన్న చట్టాలు, ప్రభుత్వ పథకాలు, వాటి అమల్లో ఎదురవుతున్న ఇబ్బందులపై చర్చించి పరిష్కార మార్గాలు సూచించనున్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తులు, జువైనల్ జస్టిస్ ప్రిసైడింగ్ అధికారులు, పోక్సో కోర్టు న్యాయమూర్తులు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శులు, యునిసెఫ్ ప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు పాల్గొంటారని హైకోర్టు జువైనల్ జస్టిస్ కమిటీ నోడల్ అధికారి, రిజిస్ట్రార్(అడ్మిన్) వి.ఎస్.ఎస్. శ్రీనివాస్ శర్మ తెలిపారు.

115 ఇంజనీర్ పోస్టులు ఖాళీ

- లస్కర్ల నియామకమూ వదిలేశారు
- మరి నీటి యాజమాన్య నిర్వహణ ఎలా?

అమరావతి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): లస్కర్ల నియామకాలకు జల వనరుల శాఖ దాదాపు చెక్ పెట్టేసింది. ఇంజనీరింగ్ అధికారుల పోస్టుల భర్తీని కూడా ప్రభుత్వం చేపట్టడం లేదు. వివిధ స్థాయుల్లో కలిపి మొత్తం 115 ఇంజనీర్ పోస్టులు ఖాళీగా ఉండడం గమనార్హం. ఈ నేపథ్యంలో నీటి యాజమాన్య నిర్వహణ ఎలా చేయగలమని జలవనరుల శాఖ అధికారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ శాఖలో మూడు ఇంజనీర్-ఇన్-చీఫ్ (ఈఎన్‌సీ) పోస్టులకు గాను రెంటింటిని మాత్రమే అడ్‌హాక్ పేరిట పదోన్నతి కల్పించి భర్తీచేశారు. మరో పోస్టు ఖాళీగా ఉంచేశారు. రాష్ట్రంలో 19 చీఫ్ ఇంజనీర్ పోస్టులకు గాను 13 పోస్టులకు అడ్‌హాక్ పదోన్నతులు ఇచ్చారు. ఇంకా 6 ఖాళీగా ఉన్నాయి. సూపరింటెండింగ్ ఇంజనీర్ పోస్టులు 51ఉంటే.. వాటిలో 16 ఖాళీ. అత్యంత కీలకమైన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టులు 267 ఉండగా.. ఏకంగా 92 ఖాళీగా ఉన్నాయి. ప్రాజెక్టుల యాజమాన్య నిర్వహణకు ఇదే ఆటంకంగా మారింది. దిగువ స్థాయిలో అసిస్టెంట్.. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఏఈఈ, డీఈఈ) పోస్టులు 600 దాకా ఖాళీగా ఉన్నాయి. ప్రాజెక్టుల నిర్వహణలో అత్యంత ముఖ్యమైన లస్కర్ల నియామకాలూ జరగడం లేదు. కొన్ని ప్రాజెక్టుల్లో అవుట్ సోర్సింగ్‌లో లస్కర్లను నియమించుకున్నట్లుగా ఖర్చు మాత్రమే చూపిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. లస్కర్లు లేకపోవడంతో పలు ప్రాజెక్టుల కాలువల్లోకి ఇంజనీర్లే స్వయంగా దిగి నీటి ప్రవాహానికి అంతరాయం లేకుండా చూడాల్సి వస్తోంది. ప్రభుత్వం తక్షణమే ఇంజనీర్లు, లస్కర్ల నియామకాలపై దృష్టి సారించి.. ఖాళీల భర్తీ చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులు డిమాండ్ చేస్తున్నారు.

బార్లకు స్పందన కరువు!

- 428లో ఇప్పటికీ 11 బార్లకే నాలుగు దరఖాస్తులు
- 17 వరకు గడువు పొడిగించిన ఎక్సైజ్ శాఖ... 18న లాటరీ

అమరావతి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ అధికారులు ఎంత ప్రయత్నించినా బార్ పాలసీకి స్పందన కనిపించడం లేదు. మొత్తం 428 బార్లకు రీనోటిఫికేషన్ జారీచేయగా పది రోజుల్లో పట్టుమని 11 బార్లకే నాలుగు చొప్పున దరఖాస్తులు అందాయి. ఇంకా 417 బార్లకు దరఖాస్తులు రావాల్సి ఉంది. షెడ్యూలు ప్రకారం ఆదివారంతో దరఖాస్తుల గడువు ముగుస్తోంది. సోమవారం లాటరీ నిర్వహించి లైసెన్సీలను ఎంపిక చేయాల్సి ఉంది. అయితే ఇంకా 97 శాతం బార్లకు దరఖాస్తులు రాకపోవడంతో ఈ నెల 17 వరకు గడువు పొడిగిస్తూ ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. మొదటి విడతలో మొత్తం 840 బార్లకు నోటిఫికేషన్ ఇవ్వగా రెండుసార్లు గడువు పొడిగించిన తర్వాత 412 బార్లకు దరఖాస్తులు వచ్చాయి. మిగిలిన 428 బార్లకు ఈ నెల 3న రెండో విడత నోటిఫికేషన్ జారీ చేశారు. దరఖాస్తుల సమర్పణకు గతంలో ఇచ్చిన దానికంటే రెట్టింపు సమయం ఇచ్చారు. అయినా పది రోజుల్లో కేవలం 11 బార్లకే దరఖాస్తులు అందాయి. తాజా ఆదేశాల్లో 18న లాటరీ నిర్వహించాలని డైరెక్టర్ పేర్కొన్నారు. నేడు, రేపు బ్యాంకులకు సెలవులు కావడంతో పాటు వరదలు, వర్షాలు కూడా ప్రతికూల ప్రభావం చూపుతున్నందు వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అలాగే 15, 16 తేదీల్లో కలెక్టర్ల సదస్సు ఉందని, కలెక్టర్లు అందుబాటులో ఉండరని వివరించారు. కానీ ఇప్పటికే పది రోజులు గడిచిపోయినా వ్యాపారులు ముందుకు రాలేదు. కాగా, గడువు పొడిగింపుపై ఎక్సైజ్ డైరెక్టర్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. అయితే అందులో గురువారమే ఇచ్చినట్లుగా పేర్కొన్నారు. ఒకవేళ గురువారమే ఆదేశాలు జారీచేసి ఉంటే వాటిని అదే రోజున జిల్లా అధికారులకు పంపాలి. కానీ శుక్రవారమే సాయంత్రమే అందరికీ సమాచారం అందింది. ఎక్సైజ్ డైరెక్టర్ నిశాంత్‌కుమార్ అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయిన నేపథ్యంలో ముందు తేదీతో ఉత్తర్వులు జారీ చేసినట్లు అధికార వర్గాలు భావిస్తున్నాయి.

తిరుపతిలో రేపటి నుంచి జాతీయ మహిళా సాధికార సదస్సు

- లోక్‌సభ స్పీకర్, గవర్నర్, సీఎం హాజరు

తిరుపతి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జాతీయ మహిళా సాధికార సదస్సుకు తిరుపతి ముస్తాబైంది. తిరుచానూరు సమీపంలోని రాహుల్ కన్వెన్షన్ సెంటర్లో 14, 15 తేదీల్లో జరగనున్న సదస్సుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు సిద్ధం చేసింది. సీఎం చంద్రబాబు చొరవతో తిరుపతిలో ఈ సదస్సు నిర్వహించేందుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. మహిళల సాధికారత అంశమే ప్రధాన లక్ష్యంగా.. రాజకీయ, సామాజిక, ఆర్థిక, విద్య, ఆరోగ్య రంగాలపై సదస్సులో చర్చించనున్నారు. ఆదివారం ఉదయం 10 గంటల ప్రారంభ సదస్సుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, సీఎం చంద్రబాబుతో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు. వీరి ప్రసంగం అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు మహిళా రాజకీయ ప్రాతినిధ్యంపై చర్చించనున్నారు. మధ్యాహ్నం భోజన అనంతరం 'ఆర్థిక సాధికారత-పెరుగుతున్న అవకాశాలు'పై ప్యానల్ చర్చ ఉంటుంది. సాయంత్రం 5గంటలకు 'నాయకత్వం, చట్టాల్లో మహిళల పాత్ర'పై వక్తలు ప్రసంగించనున్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం చంద్రగిరి కోట వద్ద అతిథులు బస చేయనున్నారు. రెండో రోజైన సోమవారం జరిగే సదస్సులో 'విద్య, నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్య భద్రత, తల్లి ఆరోగ్యం'పై చర్చ, పాలనావ్యవస్థల్లో మహిళ పాత్ర.. విజేతల కథలు'పై ప్రజెంటేషన్ ఉంటుంది. దేశం నలుమూలల నుంచి 250 మందికిపైగా మహిళా ప్రతినిధులు తరలిరానున్నారు. ముగింపు సమావేశానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరుకానున్నారు. అతిథులు తిరుమల, కాణిపాకం, శ్రీకాళహస్తీశ్వర స్వామిని దర్శనం చేసుకునే అవకాశం ఉంది.

రేపు సీఎం చంద్రబాబు రాక

సీఎం చంద్రబాబు ఆదివారం విజయవాడ నుంచి హెలికాప్టర్‌లో తిరుపతికి చేరుకుంటారు. ఉదయం 9 గంటలకు శ్రీకన్వెన్షన్ సెంటర్‌లో విట్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు విశ్వనాథం మనవరాలి వివాహానికి హాజరవుతారు. అనంతరం జాతీయ మహిళ సాధికారత సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరుకానున్న సీఎం.. తన ప్రసంగం అనంతరం తిరుగుప్రయాణం కానున్నట్టు సమాచారం.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.